తరతరాల

# స్త్రీల పరాజయ గాథ



305.4
734

రచన :

మల్లాది సుబ్బమ్మ

## ఇవి మీకు తెలుసా :

# ఈ కాలానికి పనికివస్తాయా ?

"బాల్యముగా నుండినను, యవ్వనముగా నుండినను, వార్ధక్యముగా నుండినను స్త్రీలు తమతమ ఇండ్లయందునూ తమ మనస్సు పోయినట్లు ఏకార్యమును చేయరాదు." "తండ్రి లేక తోడబుట్టినవాడు ఆమెను ఎవ్వనికి వివాహమునకై ఇచ్చుచున్నాడో వాడు జీవించియుండువరకు, వానికి ఈమె శుశ్రూష చేయవలయును. వాడు చనిపోయిన వెనుకనూ వ్యభిచారముచేయక వానికి శ్రాద్ధము మొదలగువానిని జేసికొనుచుండవలయును." "భర్త దురాచారవంతుడై యుండినను, అన్యస్త్రీ లోలుడై యుండినను, సద్గుణము లేనివాడై యుండినను, పతివ్రతా స్త్రీ వానిని దైవముగా పూజింపవలయును. స్త్రీలకు పంచమహాయజ్ఞము, ఉపవాసము, వ్రతము మొదలగు ధర్మములు ప్రత్యేకముగా లేవు భర్తకు శుశ్రూష చేయుటచేతనే స్వర్గమందు గౌరవము పొందుచున్నారు "

"నికృష్టుడైన తన భర్తను విడిచి ఉత్కృష్టుడగు మరియొకనిని యే స్త్రీ పొందులో ఆమె నిందలపాలగున." "స్త్రీ వ్యభిచారము చేయుటచేత లోకమునందు నిందింపబడుటయేగాక గతించిన పిదప గుంటనక్కగా జన్మించి తెల్లకుష్టు మొదలగు వ్యాధుల ననుభవించును." (మను ధర్మశాస్త్రం - 5వ అధ్యాయం).

"పురుషుడు తాను సంపాదించి తెచ్చిన ద్రవ్యమును కాపాడుట, వ్యయము చేయుట, పాత్రలు మొదలగువాటిని శుద్ధిచేయుట, దేవీపూజ మొదలగువానికి సహాయమైన కార్యము చేయుట, భక్ష్యభోజ్యములను పక్వపరచుట మొదలైన యవశ్యములగు కార్యములు భార్యకు నేర్పి ఆమెయొక్క మనస్సు ఇతర విషయములందు పోకుండునటుల చేయవలయును." "స్త్రీలకు చంచల స్వభావము, నిలకడలేని మనస్సు పుట్టుకతోనే ఉండుటవలన పురుషులయొక్క రక్షణవలన వారు నశించుటలేదు. ఏడుపు, ఆసనము, అలంకారము, కామము, కోపము, అబద్ధము, ద్రోహచింత, వీనిని స్త్రీల నిమిత్తమే మనువు కల్పించినాడు." (9వ అధ్యాయం).

"1. భర్తకు ఇష్టమైనవి చేయాలి. 2. భర్త తల్లిదండ్రుల పాదపద్మాలకు నమస్కరించాలి. 3 భర్తతో మర్యాదగా ప్రవర్తించాలి. 4 ఇంద్రియ నిగ్రహం పాటించాలి." (యాజ్ఞవల్క్యుని ప్రవచనాలు).

"1. భర్త లేక పెద్దలు పొమ్మంటేతప్ప ఇల్లు దాటరాదు 2. చకచకా నడవరాదు. 3 బంధుత్వంలేని పురుషునితో మాట్లాడరాదు. 4 బొడ్డును కన్పింపరాదు. 5. పాదములవరకు జీరాడేలా చీర కట్టుకోవాలి. 6 స్తనాలను బహిర్గత పరచరాదు. 7. చేయిగాని, వస్త్రంగాని అడ్డుపెట్టుకోకుండా బిగ్గరగా నవ్వరాదు. 8. భర్తనుగాని, అతని బంధువులనుగాని ద్వేషించరాదు. 9. వేశ్యల సాంగత్యం కూడదు." (శంఖ లిఖిత స్మృతి వాక్యాలు).

## తరతరాల

# స్త్రీల పరాజయ గాథ

Donated by:
Malladi Subbamma

రచన :

మల్లాది సుబ్బమ్మ

స్త్రీ విమోచన శిక్షణా కేంద్రం
9, ఎం.ఐ.జి.హెచ్. కాలనీ, మెహదీపట్నం,
హైదరాబాదు-500 028. ఫోను : 35429

స్త్రీ విమోచన శిక్షణా కేంద్రం ప్రచురణ సంఖ్య 7

**తరతరాల స్త్రీల పరాజయ గాథ**

ప్రతులు **1000**

ప్రథమ ముద్రణ : ఆగస్టు **1991**

రచన :

**మల్లాది సుబ్బమ్మ**

హక్కులు రచయితవి

305.4
సుబ్బ--

ప్రచురణకర్త .

**స్త్రీ విమోచన శిక్షణా కేంద్రం**

**9,** ఎం.ఐ.జి.హెచ్. కాలనీ, మెహిదీపట్నం, హైదరాబాదు-**500 028.**

ఫోను : **35429**

ఇందులో

**తరతరాల స్త్రీల పరాజయ గాథ**

**సహజీవనం : సన్నిహితత్వం**

**వెల : రూ, 6-00**

ప్రతులకు :

**స్త్రీ విమోచన శిక్షణా కేంద్రం**

**9,** ఎం.ఐ.జి.హెచ్. కాలనీ, మెహిదీపట్నం, హైదరాబాదు-**500 028.**

ఫోను : **35429**

C7904

ముద్రణ :

**లక్ష్మి ప్రింటర్స్**

11-6-868, బేగ్ ఐలాండ్, లక్డీకాపూల్,

హైదరాబాదు-500 004.

సుందరయ్య గ్రంథాలయం
70,734
హైదరాబాద్-500 044.

# స్త్రీలపై అత్యాచారాలు ఇంకెన్నాళ్ళు!
# ఇంకెన్నాళ్ళు సహించాలి ?

రోజు రోజుకూ స్త్రీలపై అత్యాచారాల సంఖ్య పెరుగుతున్నది. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి అందుకు భిన్నంగా లేదు భార్యలపై హింస, భార్యల హత్యలు, స్త్రీల వేధింపు, మానభంగాలు పెచ్చుపెరుగుతున్నాయి పోలీసుల హెచ్చరికలు, మహిళాసంఘాల ఆందోళనలు ఏ విధమైన ఫలితాన్ని ఇవ్వలేక పోవటం సంభవిస్తున్నది ఇది దేశ ప్రగతికి గొడ్డలి పెట్టు జాతికి అవమానం, మహిళాలోకానికి తీరని ద్రోహం ఈ పరిస్థితి ఇలా కొనసాగవలసిందేనా?

ఈ దుర్మార్గాన్ని ఎన్నాళ్ళు సహించాలి? ఎంతకాలం ఈ ఘోరాలు సాగుతాయి? ఎంతకాలం సమాజం ఉలక్కుండా పలక్కుండా ఉండగలదు? ఎంతవరకు ప్రజలు ఉదాసీన వైఖరి అవలంభించగలరు? ఈ ప్రశ్నలకు సమాధానాన్ని ప్రజానీకం అంతా వెతుక్కోవలసియున్నది.

సమాజాన్ని పరిరక్షించ వలసిన రక్షకభట వర్గం ఎందుకు ఈ అగడాలను అపలేకపోతున్నది? అపుడపుడు పోలీసులలోని కొందరు దుండగులు కూడా ఈ అత్యాచారాలకు పూనుకోవడం ఎందుకు జరుగుతున్నది? నిందితులు న్యాయస్థానాల్లో ఎందుకని శిక్ష లేకుండా తప్పించుకొని పొగలుగుతున్నారు? ఈ ప్రశ్నలు కూడా మనల్ని వేధిస్తున్నాయి ఈ ప్రశ్నలను మనమంతా ఎదుర్కోవలసి వుంటుంది.

**భార్యలపై హింస**

పెద్దమొత్తంలో కట్నం తీసుకొని, పెళ్ళి చేసుకొని తర్వాత అరు నెలల్లోనే భార్యను చంపివేసే దుర్మార్గులు మన సంఘంలో అవతరిస్తున్నారు తదుపరి మరల రెండు నెలలకే తిరిగి వివాహానికి సిద్ధం అవటం, మరల మరెవరో కట్నం ఇచ్చి మరొక యువతిని ఇచ్చి అతనికి వివాహం చేయటం పరిపాటి అయింది ఇలా వరుసగా భార్యలను చంపివేస్తూ కట్నాలు పోగుచేసుకుంటూ తనకు పుట్టిన పిల్లలనే తల్లిలేని వారినిగా చేస్తూ వారిని నిరాశ్రయులుగా చేస్తూ తాము మాత్రం జల్సాగా, ఖుషీగా జీవితం వెళ్ళబుచ్చే దుష్టుల సంఖ్య దినదినం వృద్ధి పొందుతోంది? సమాజంలో వారియెడ నిరసన భావం ఏర్పడటంలేదు అట్టి పురుషులను, వారి కుటుంబాలను అసహ్యించుకోవటం జరుగటం లేదు ఎందువల్ల?

కుటుంబంలో ఆడపిల్ల పుట్టినప్పటినుండి ఆమెను తక్కువగా చూడటం అలవాటు అయింది ఆమె "ఆడ"పిల్ల పరాయిధన్ పరాయి యింటికి పోవలసిన స్త్రీ. కుటుంబంలోని బాలునికన్నా ఆమెను హీనంగా చూడడం విడ్డూరం కాదు తిండి, దుస్తులు, చదువు, సౌకర్యాలు, ఆటపాటలు ఇలా అన్నింటా ఆమెకు వ్యతిరేకంగా వివక్షసమాజంలో ప్రత్యక్షమవుతున్నది. పెళ్ళికి ముందు ఆమెకు తండ్రి, వివాహానంతరం భర్త, ఆమె భర్తను కోల్పోతే ఆమె కుమారుడు లేక ఏ మేనల్లుడో, మనవడో ఆమె పురుష బంధువులు ఆమెకు రక్షకులు.

(P.T.O)

ఆమె సర్వదా అస్వతంత్రః ఈ భావాలను వెలిబుచ్చింది ఎవ్వరో కాదు. అన్ని మతాలకు చెందిన ఋషులు, ప్రవక్తలు, మహాత్ములు అలా ప్రకటించారు. అందువల్ల సంప్రదాయ ధారానికి లొంగిపోయి, అదే మంచిదని తలచే కుటుంబాలు స్త్రీని ప్రాణం వున్న వస్తువుగా భావించడం విచిత్రంకాదు. అలాంటి భావాలు ఉన్నందుననె స్త్రీల యెడ దుర్మార్గాలు అవిరళంగా జరుగుతున్నాయి

తనకు కలిగిన సంతానానికి భర్త జీవించి ఉండగా, స్త్రీ సంరక్షకురాలుకాదు. ఆమె గార్డియన్‌గా వ్యవహరించాలంటే ఆమె న్యాయస్థానానికివెళ్ళి ఉత్తర్వులు పొందవలసియున్నది ఇవి చాలా కష్టనష్టములతో కూడిన పని అని చెప్పక తప్పదు. 18శాతం స్త్రీలు మాత్రమే అక్షరాస్యులుగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఎంతమంది స్త్రీలు శాసనాలు ఇచ్చే సౌకర్యాలులను అనుభవించగలరు? ఎంతమంది తమ హక్కులను స్థిరపరచుకోగలరు? అలా తమ హక్కులను రక్షించుకోగల స్త్రీలను వ్రేళ్ళమీద లెక్కపెట్టవచ్చు.

**స్త్రీలను వేధించటం :**

స్త్రీలను గౌరవించటం మాని, వారిని వేధించటం కొంతమంది దుర్మార్గ ప్రవృత్తిగల పురుషులకు అలవాటయింది స్త్రీల యెడ వేధింపు బహుముఖంగా సాగుతున్నది. స్త్రీని భోగ్య వస్తువుగా పరిగణించే మనస్తత్వం వలన ఇలాంటి దుర్మార్గం జరుగుతున్నది

**మానభంగాలు :**

స్త్రీలను భోగ్య వస్తువులుగా చూడటం. స్త్రీలపై ద్వేషం పెంచుకోవటం, స్త్రీలను అసహ్యించుకోవడం, ఇతరత్రా ప్రత్యేకంగా ఒక స్త్రీని అవమానించ తలచటం, శత్రువర్గపు వారి భార్యలను అవమానించి శత్రువర్గాన్ని కించపరచాలనే తాపత్రయం, మానసిక జాడ్యం ఇవి స్త్రీల మానభంగాలకు కారణభూతాలవుతాయి.

**ఎవరు వీటిని ఆపాలి ? ఎలా ?**

పోలీసులు తమ విద్యుక్తధర్మాలను నిర్వహించడం, మహిళా సమాజాలు వీటి విషయమై శ్రద్ధవహించి ఆందోళన చేయడం, నూతన సమసమాజానికి నడుంకట్టె యువకులు ఎంతో జాగరూకతతో వ్యవహరించి వీటిని అరికట్టటం, న్యాయస్థానాలు ఈ నేరాలపట్ల తీవ్ర వైఖరిని ప్రదర్శించటం, ఇరుగుపొరుగువారు బాధితులయిన స్త్రీలకు అనుకూలంగా వాస్తవాలను వెల్లడించటం వెంటనే ఉరిగాల్సిన పనులు ఈ కృషిలో వయస్సుతో నిమిత్తం లేకుండా లింగబేధాన్ని పాటించకుండా సర్వ ప్రజలు శ్రద్ధవహించాలి. ఇలా జరిగిననాడు స్త్రీలపై అత్యాచారాలు అంతరిస్తాయి కనీసం వాటి సంఖ్య తగ్గుముఖం పడుతుంది. అలా చేయటానికి స్త్రీ పురుషులందరూ పూనుకోవాలి

తేది. 25—3—91

మల్లాది సుబ్బమ్మ
డైరక్టర్, మహిళాభ్యుదయసంస్థ

9, ఎం. ఐ. జి. హెచ్,
మెహదీపట్నం, హైదరాబాద్—28
ఫోన్ : 815129

"స్త్రీలు—శిశువులు" అనే భారత ప్రభుత్వశాఖ (మానవ వనరుల విభాగం) వారి సహాయంతో సౌజన్య ప్రెస్ వారిచే ముద్రితం.

# స్త్రీల పతనానికి ప్రాతిపదిక ఎక్కడ? ఎప్పుడు?

మాతృస్వామ్య వ్యవస్థ అనేది ఒకానొక సామాజిక దశలో వుండేదని చరిత్రకారులు తేల్చిన దాన్నిబట్టి నిజమేనేమోనని మనం అనుకొంటున్నాంతప్ప, ఏ కాలంలోనైనా - ఏ దేశంలోనైనా, ఏ రాజ్యంలోనైనా - ఏ జాతిలోనైనా, మతంలోనైనా, కులంలోనైనా, వర్గంలోనైనా - ఏ సామాజిక దశలోనైనా పురుషుడితో సమాన ప్రాశస్త్యం, సమానహోదా స్త్రీ సాధించినట్లుకానీ, అనుభవించినట్లుగాని రికార్డయిన ఆధారాలు చరిత్రలో కన్పించటంలేదు వేదకాలం (2500 - 1500 బి. సి.) లో స్త్రీల స్థితి మహోన్నతంగా ఉండేదనీ, ఆర్య సంస్కృతి మహోన్నతమనీ, దానిని పునరుద్ధరించాలనీ ఒక వాదన ప్రబలంగా వుంది హిందూ సమాజంలో స్త్రీకి సమున్నతస్థానం ఉందనీ, హిందూ సంస్కృతి స్వయం సంపూర్ణమనీ, భారత ప్రజలు తదితర జాతుల నుండి తెలిసికోవలసింది అనుసరించ వలసింది ఏమీలేదని ఇటీవల ఉధృతంగా నినాదాలు వినపడుతున్నాయి రుగ్వేదకాలంలో స్త్రీ పురుషులలో పెద్ద తేడాలు లేవనీ ఆల్ టేకర్, కపాడియా, ఇంద్రలాంటి పరిశోధకులు వెలిబుచ్చారు కాని స్త్రీ పతనానికి అక్కడే ప్రాతిపదికలు పడ్డాయి ఆడపిల్ల పుడితే ఏడ్చినట్లు లేదుకాని, బాలునికొరకు దేవతల్ని ప్రార్థించినట్లున్నది. అధర్వణ వేదంలో ఆడపిల్ల పుట్టరాదనే భావం బాగా ప్రబలింది ఆడపిల్ల జన్మించరాదని ప్రార్థనలు, వ్రతాలు వెలిసినాయి. కన్యల స్థితి ఘోరరూపం దాల్చింది. వివాహం అభిలషణీయమేకాదు, విధికూడా అయింది. స్త్రీలు పావులుగాను, నిస్సహాయులుగాను చూడబడేవారు. ఆమె విలువ ఆమె తెచ్చే కట్నంమీద ఆధారపడి వుండేది. కట్నం ఆచార రూపమయింది. బ్రహ్మ, గాంధర్వ వివాహాలు చలామణిలో వుండేవి. స్త్రీ భర్త ఇంటికే వెళ్ళాలి. అప్పుడప్పుడు యజ్ఞయాగాదుల్లో పాల్గొనేది భార్యా భర్తలమధ్య సఖ్యతకోసం ప్రార్థించేది బహు భార్యాత్వం పెరిగింది. మంత్రతంత్రాలచేత భర్తలను లోబరుచుకోవాలననే ప్రయత్నం వుండేది శవం ప్రక్కన భార్యను పడుకోబెట్టి తగలబెట్టేవారు. ఆత్మ అనే భావం పుట్టింది కనుకనే ఆ లోకంలో భర్తకు ఆమె తోడు వుండాలని, బ్రతికివున్నా ఈ లోకంలో ఆమె జీవచ్ఛవమేనని అలా జరిపేవారు పున్నామ నరక విముక్తికోసం పుత్రుడు కావాలన్నారు అందువల్ల దృక్పధాలు మారినాయి రుగ్వేదంలో మతంలోనూ, సాంస్కృతిక రంగంలోనూ భాగస్వామియైన స్త్రీ పిల్లల తల్లిగా మిగిలిపోయింది అధర్వణవేదం చివర - బ్రాహ్మణాలకు ముందు నియోగ' పద్ధతిలో పిల్లవాణ్ణి కనడమే

స్త్రీకి జీవిత ధ్యేయమయింది. ఆడపుట్టుక దురదృష్టమయింది. విధవా వివాహం నిషేధ మయింది.

బ్రాహ్మణాలు - (600 బి. సి ) లో మతం సామాజిక జీవితంలో పెనవేసుకు పోయింది మగబిడ్డకోసం పితృదేవతల్ని పూజించేవారు. ఆడపుట్టుక నీచం, శోక దుఃఖ కారణమై పుట్టకుండా క్రతువులు చేశారు మగబిడ్డ స్వర్గంలో జ్యోతి అన్నారు కన్యకు అగౌరవం పెరిగింది వివాహిత అయిన స్త్రీ భర్తతో క్రతువులలో పాల్గొనాలి స్త్రీలు సభలకెళ్ళరాదు గర్భిణీ స్త్రీలను అపవిత్రంగా చూచేవారు ముట్టు, అంటూ వుండేవి. మైత్రాయిణి సంహిత ప్రకారం స్త్రీ జూదం, త్రాగుడుతో సమానం సమాజంలో స్త్రీ పెద్ద చెడుతో సమానం. తైత్తరీయ సంహిత, శతపథ బ్రాహ్మణం ప్రకారం దుష్ట పురుషునికన్నా స్త్రీ హీనం బొడ్డుక్రింది ఆమె శరీరభాగమంతా అపవిత్రమనే మంత్రాలు చదివేవారు. భర్తను ఎదురించని స్త్రీని, ముందుగా భోంచెయ్యని స్త్రీని గౌరవించేవారు. కన్యల్ని అమ్మడం, దానం చెయ్యడం జరిగేది ఉంపుడుగత్తెలుండేవారు సంధి యుగంలో (ఉపనిషత్తుల కాలం నాటికి పూర్వం) కేవలం భర్త సుఖంకోసమే ఆమె జీవించాల్సిన దుస్థితి కొచ్చింది వంట, పిల్లల పెంపకం, భర్త సేవలకే పరిమిత మయింది యజ్ఞయాగాదుల్లో సహచారిగా వుండేది చాందోగ్యోపనిషత్తులో బాల్య వివాహాలున్నట్లు ఆధారాలున్నాయి. బ్రాహ్మణులు శూద్ర కన్యల్ని వివాహమాడవచ్చు. కాని బ్రాహ్మణ స్త్రీలతో శూద్రుని వివాహం నిషిద్ధం బృహదారణ్యకోపనిషత్తులో భర్త ఆజ్ఞదాటిన స్త్రీని తిట్టి, బలవంతంగానైనా ఆజ్ఞాపాలనం చేయించవచ్చు. బౌద్ధం (500 - బి సి ) నాటికి స్త్రీలు బ్రహ్మ వాదినులవలె మతంలోని శాశ్వత సత్యాలను, వేదాంతాన్ని అర్థం చేసుకోటానికి బ్రహ్మచర్యాన్ని స్వీకరించి బౌద్ధ ఆరామాలకు చేరారు. మంత్ర బ్రాహ్మణంలో ఇందులో ఎక్కువగా పెండ్లి మంత్రాలు వున్నాయి. నా భర్తకు చావుతేవద్దు, దురదృష్టాన్ని తేవద్దు అంటూ లాజ హోమం చేయించేవారు. అగ్నిని, వాయువుని, ఆమె పవిత్రురాలు కావాలని, పిల్లల్ని కనేయోగ్యత పొందాలని, ముఖ్యంగా కొడుకునే కనాలని ప్రార్థించేవారు పురాణకాలం లేక సూత్రాల యుగం నాటికి (500 బి. సి. - 510 ఎ. డి ) స్త్రీ స్థితి పూర్తిగా క్షీణించిందనవచ్చు 300 బి సి. వరకు కొంత హోదాఅయినా వుండేదల్లా వివాహ వయస్సు తగ్గించబడింది. ఆర్యులు స్థానిక జాతులవారితో పోరాడవలసివచ్చింది ఈ పోరాటాలకు మగపిల్లలే అవసరమనే భావం కలిగింది స్త్రీలను వేదవిద్యకు అనర్హులని శాశించటంవల్ల వారు విద్యార్హతను కోల్పోయారు. హిందూ (ఆర్య) మత సంప్రదాయం,

సంస్కృత భాష తెలియని కారణాన వారిని అజ్ఞానులుగా భావించి మతపరమైన విధానాలకు అనర్హులని నిర్దేశించారు. క్రమంగా వేదవిద్యకు, మతపరమైన హక్కులకు స్త్రీలందరూ తగరని నిర్దేశించారు. ఎప్పుడైతే మతపర హక్కులు, విద్యాహక్కులు క్రోల్పోయారో సాంఘికంగా, కుటుంబ పరిధిలోకూడా అణగద్రొక్కబడ్డారు ఇలా మనుస్మృతి - (500 ఎ. డి.) నాటికి ఆమె మహాపతివ్రతగా - అంటే భర్తయే పరమ దైవంగా, అతడే దేవుడుగా భావించాలనేది రూఢి అయింది.

500 క్రీ. శ. నుండి అనేకమంది ఋషులు, మను, యాజ్ఞవల్క్య, విష్ణు, పరాశర, గౌతమ, శంఖలిఖిత, హారీత, అవస్తంబవ్యాస వంటి ఋషులంతా సూత్రాలు, ధర్మ శాస్త్రాలు వ్రాసి వానిలో స్త్రీని పుట్టుబానిసగా చేసి ఆస్తిలో, అధికారంలో, పురుషాధిపత్యానికే పట్టం కట్టారు. స్త్రీలకు అనేకానేక విధినిషేధాలు నిర్ణయించారు. స్మృతి కర్తలలో మనువు ముఖ్యుడు స్త్రీలకు కఠినమైన ఆంక్షలు, విధులు, పురుషులకు ఉపకరించే మార్గదర్శక సూత్రాలు నిర్వచించాడు. ప్రతి సామాజిక రుగ్మతకు మనువు దగ్గర మందువుందని బ్రాహ్మణులు, పతివ్రతలు ఆయన్ను ఇప్పటికీ ఆరాధిస్తారు మగడెంత నీచుడైనా, దుర్మార్గుడైనా, వ్యభిచారియైనా స్త్రీ భర్తను భగవంతునివలె ఆరాధించాలి అని నిర్దేశించి ఆమెను వ్యక్తిత్వంలేని ఆటబొమ్మగా చిత్రించాడు. ఆజన్మాంతం ఏదో ఒక మగదిక్కు రక్షణలో బ్రతకాలని శాసించాడు. వివాహం కాగానే భర్త స్వామి అని, అతని సేవద్వారానే ఆమె స్వర్గానికి చేరుకోవాలని ఉద్బోధించాడు. వ్యభిచారిని కుక్కలచేత కరిపించమనీ, కర్రతో కొట్టవచ్చని భయపెట్టాడు. స్త్రీ 'శూద్రునితో సమతుల్య' అని, ఆడపిల్ల పుట్టుకవల్ల తల్లీ, పిల్లా నిరాదరణపాలయ్యే దైన్యస్థితికి తెచ్చాడు. ఋగ్వేదం కాలంలో స్త్రీల పరిస్థితి కొంత మెరుగుగా వున్నమాట వాస్తవమే. పుత్రికా, పుత్రులకు తేడాలువున్నాయి అనేదానికి ఆధారాలు వున్నాయి ఋగ్వేదపు చివరిదశలో ఆమె పతనం ప్రారంభమై, యజుర్వేదంలో ఇంకా దిగజారిపోయి, సామవేదం నాటికి పరాకాష్టకు చేరి, అధర్వణవేదం నాటికి ఆమె పతనం పూర్తి అయింది. బ్రాహ్మణాల కాలంనాటికి ఆమె దురవస్థకు గట్టి పునాదిపడ్డది. ఇక పురాణాల కాలంనాటికి స్త్రీని పూర్తి బానిసత్వంలో కట్టిపడవేయడం జరిగింది. మను ధర్మశాస్త్రం స్త్రీని పూర్తిగా ఇల్లనే ఇనుప పంజరంలో, పాతివ్రత్యమనే సంకెళ్ళతో పర్మనెంటుగా కట్టిపడేశింది.

అసలు మత అవిర్భావంలోనే కర్మ అని, తలరాత అని, దైవనిర్ణయమనే ప్రవచనాలు వున్నాయి అందులో స్త్రీకి అనేక ఆంక్షలు, కట్టుబాట్లు, కఠిన నియమాలు

నిర్దేశింపబడ్డాయి. మతం స్త్రీ స్థానాన్ని పురుషుడి పాదాలచెంతనే వుంచింది. శైశవం దాటగానే మెల్లిగా మాట్లాడాలని, తలెత్తుకొని తిరగరాదని, నిటారుగా నిలబడరాదని శాశించింది. "స్త్రీ భర్తకు ఎప్పుడూ వినయ విధేయతలతో లొంగివుండాలి భర్త ముందు వాచాప్రాబల్యం పనికిరాదు, మగడు కోపించినా అలుగరాదు, భర్త సంతోషిస్తే తానూ సంతోషించాలి భర్త దుఃఖిస్తే తానూ దుఃఖించాలి, ఏకాంత వేళల్లో మనస్సులో దుఃఖమున్నా దాచుకొని భర్తముందు నవ్వుతూ, అయన్ను పొగడుతూ వుండాలి" అని కాశీ ఖండంలో చెప్పారు స్త్రీమీద పురుషుడికి సర్వాధికారాలు వున్నాయి. "అల్లా పురుషుణ్ణి అధికుణ్ణిగా సృష్టించాడు ఆమె పోషణకొరకు తన సంపదను వెచ్చిస్తున్నాడు కనుక ఆమె విధేయత చూపాలి". పురుషుణ్ణి ముందు సృష్టించి అతని సంతోషంకోసమే స్త్రీని దేవుడు సృష్టించాడని ప్రచారం చేస్తోంది బైబిలు. అసలు పురుష పతనానికి మూలకారణం ఆడది (ఈవ్) అని ఈసడిస్తుంది "ముక్తికి, మోక్షానికి స్త్రీ అనర్హురాలు" అని జైనమతం ప్రతిపాదించింది ఆమెకు ముక్తికావాలంటే మరో జన్మలో పురుషుడుగా పుట్టాలని జైనమత ప్రవక్త మహావీరుడన్నాడు. స్త్రీలకు గృహ సంబంధమైన విద్య చాలని రూసో అన్నాడు. ప్రౌధన్ అంతటివాడు స్త్రీ మేధాశక్తి, నైతిక విలువలు పురుషునిలో 3/4 వంతు అన్నాడు "స్త్రీలకు పురుషులకన్నా పళ్ళు తక్కువ వుంటాయి అంతేకాక ఆమెకు స్వేచ్ఛనిస్తే ఈ లోకాన్నే దిగమింగుతుంది" అన్నాడు విషపానీయాన్ని సేవిస్తూ గ్రీకు తత్త్వవేత్త సోక్రటీసు "సిల్లీ ఉమన్" అన్నాడు సెయింట్ పాల్. స్త్రీలు తమకు తెలియని విషయాలను భర్తద్వారా మాత్రమే తెలుసుకొని వారి ఆజ్ఞలను జవదాటరాదని నిర్దేశించారు అలా మత గ్రంథాలన్నీ పురుషాధిక్యతను వేయినోళ్ళ చాటాయి లండన్ చర్చిలో ఆడవాళ్ళకు ఆత్మలు లేవని, వాళ్ళ మెదడు చాలా చిన్నదిగా వుంటుందని చర్చలు జరిపారట. స్త్రీలు నిజాయితీ లేనివారనీ, నీతిహీనులని చాణక్య నీతి దర్పణంలో ఉంది స్త్రీ ఆజన్మాంతం ఎలా అదుపు ఆజ్ఞల్లో జీవించాలో కుమారి శతకం లాంటివి రాయించి విపులంగా బోధించారు హిందూమతస్థులు ఇలా అన్ని మతాలు స్త్రీని అణగద్రొక్కాయి ఆమె పురుషుని భోగవస్తువని, పిల్లల్ని కని వంశాన్ని వృద్ధిచేయడానికే సృష్టింపబడ్డదని మత గ్రంథాలన్నీ ధృవీకరించాయి పాకశాస్త్రం, లలితకళలుతప్ప మరే విద్యకు స్త్రీలు అనర్హులని నిన్నమొన్నటిదాకా అమాటకువస్తే ఇప్పటికీ భావించేవారు కోకొల్లలుగా వున్నారు. ఇలా యుగయుగాలుగా స్త్రీ సమాజంచేత, పురుషుడిచేత, సంప్రదాయాలవల్ల అణగద్రొక్కబడిందనేదానికి లెక్కలేనన్ని తార్కాణాలు వున్నాయి

# తరతరాల స్త్రీల పరాజయ గాథ

సామాజిక పరిస్థితులు మారినా ఒకసారి ఉద్భవించిన భావాలు తేలికగా చావవు, మారవు అంటుకని ఆ పాతకాలపు భావాలను వ్యతిరేకించడానికి భావాల పరంగా పోరాటం అవసరమవుతుంది అందుకనే 1959 లో చైనాలో కమ్యూనిస్టు ప్రవేశ పెట్టిన తదుపరికూడ 1966 లో మావో సాంస్కృతిక విప్లవాన్ని ప్రబోధించాడు. సామాజిక విప్లవానికి ముందు భావ విప్లవం రావాలని ప్రముఖ తత్వవేత్త ఎం. ఎన్. రాయ్ సిద్ధాంతీకరించాడు నూతన భావాలవల్ల ఉత్తేజితులైన కార్యకర్తలు సమ సమాజాన్ని ఊహించగలరు, దానిని స్థాపించగలరు. ముందు సామాజిక విప్లవం వచ్చి తరువాత భావ విప్లవమా లేక మున్ముందు భావ విప్లవము తరువాత సామాజిక విప్లవమా, అలాకాక రెండూ సామాజిక విప్లవమూ, భావ విప్లవమూ, ఏకకాలంలో సాగాలా అనే అంశంపై అభిప్రాయ భేదాలుండవచ్చును కాగా పాతకాలపు భావాలను చీల్చి చెండాడవలసిన అవసరం ఈనాటు ఎంతయినా వుంది.

స్త్రీల స్థితి మానవ సమాజపు తొలి రోజుల్లోనుంచి ఇప్పటివరకు ఒకలాగున లేదు. మారుతూ వచ్చింది ఆ మార్పులో ఒక దశ కన్పిస్తున్నది. మరో అంశాన్ని విస్మరించరాదు. ఏకకాలంలో ఒక దేశంలోవున్న స్థితి మరోదేశంలో లేదు. కాగా సామాజిక పరిస్థితులు ఒకేరకంగా ఉండే దేశాలలో స్త్రీల స్థితి ఇంచుమించుగా ఒకే రకంగా ఉండేది ఈ సూత్రాలను గమనించి మనం సామాజిక పరిణామాన్ని అధ్యయనం చేయవచ్చు .

మనిషి సగము పశువు సగము మానవుడుగా ఉన్న రోజుల్లో జంతు ప్రవృత్తి మానవునిలో ఎక్కువగా కన్పించేది కోతి జాతినుండి ఉద్భవిల్లిన మానవజాతి తెలివైన జంతువుల సముదాయంగా ఉండేది. కేవలం మనుగడకే ప్రాధాన్యతను ఇచ్చే కాలమది. జంతు వాసనతో జీవితం సాగించేది. ఆనాడు స్త్రీ పురుషు లిరువురు కలిసి ఆహారం సంపాదించుకునేవారు కనుక పెద్దగా హెచ్చుతగ్గులకు అవకాశం ఉండేదికాదు.

వేటాడి పచ్చిమాంసం తిని లేక తర్వాత కాల్చుకున్న మాంసాన్ని తిని బ్రతికే రోజుల్లో స్త్రీలపై పురుషుల దౌర్జన్యం ఉండేదికాదు ఇరువురు కలిసి వేటాడి ఆహార సముపార్జనం చేసుకునేవారు పశువులను మచ్చిక చేసుకొని వాటిని సాకి వాటి పాలతో,

మాంసంతో జీవయాత్ర సాగించేటప్పుడు స్త్రీలను తక్కువచూపు చూడటం సంభవించ లేదు. అడవిలో కాయకూరలను, పళ్ళను, ఫలాలనూ ఏరి తెచ్చిన దశలో, పడి మొలిచిన ధాన్యపు మొక్కలనుండి ధాన్యాన్ని సేకరించినదశలో స్త్రీ ప్రముఖపాత్ర వహించింది కనుక ఆమె స్థితి దిగజారలేదు. వ్యవసాయ యుగం ప్రారంభమయింది. మెట్ట వ్యవ సాయంలో గుంటక లేక గొర్రుతోనే వ్యవసాయ విధానం వచ్చింది. అపుడుకూడా స్త్రీలు గొర్రు తోలేవారు. నేలను సమతలం చేసేవారు. అపుడు వారు ప్రధాన భూమి కనే వహించారు సామాజిక ఉత్పత్తి రంగంలో.

నాగలితో - కొయ్య నాగలిగాని ఇనుప నాగలిగాని - వ్యవసాయం ప్రారంభం కాగానే కొంచెం శారీరక శ్రమతోకూడిన పని కనుక 'నేను చేస్తానులే ఆ పని; నాగలి నేను దున్నుతాను అన్నాడు పురుషుడు. తనకు తేలికపని కేటాయించినందుకు స్త్రీ లోకం సంతసించింది. ఆమెను ఇంటిపట్టున వుండమన్నాడు పురుషుడు. అది అంతా తన మంచికే అనుకుంది ఆమె. అయితే పొలంలో పనిచేస్తూ స్త్రీని ఇల్లాలును చేసిన పురుషుడికి ఒక సందేహం వచ్చింది. తను ఇంటికి దూరంగా పొలంలో వుంటే, తన భార్య ఇంట్లో తనను విడిచి ఉంటే ఆమెకు కల్గే సంతానం తనదయినట్లు ఎలా అని సందేహం కల్గింది. దాంతో ఆమెకు కొన్ని కట్టుబాట్లు ఏర్పరచాడు. పరపురుషునితో మాట్లాడవద్దన్నాడు. వారిని ఇంట్లోకి రానివ్వవద్దన్నాడు. ఆమెకు పతివ్రతా ధర్మాలు బోధించాడు. ఆమెచేత వ్రతాలు చేయించాడు. తన సౌభాగ్యమే ఆమె సౌభాగ్యమని ప్రకటించాడు. ఇలా ఆమెను లొంగదీసుకున్నాడు.

ఈ పై ప్రక్రియ అంతా ఒకరోజులో జరగలేదు; ఒక దశాబ్దంలో జరగలేదు. వేల సంవత్సరాల క్రమంలో జరిగింది. మొదట్లో స్త్రీ ఎదురు తిరిగింది. పోరాడింది. చివరకు లొంగిపోయింది. అప్పటినుండి ఇప్పటివరకు అణచివేతకు, దోపిడికి గురి అవుతున్నది. దీనినిబట్టి తేలిందేమంటే సామాజిక పరిణామంలో సమాజ ధోరణులకు, ప్రక్రియలకు స్త్రీ పురుషులు బానిసలు, కాగా పురుషుడికి స్త్రీ బానిస. అంటే బానిసకు బానిస అన్నమాట. సమాజమూ, పురుషాధిక్యత రెండూ ఆమెను అణచివేస్తున్నాయి అన్నభావం సత్యదూరం కాదు. పైన వివరించింది ఒక పరిశీలనా విధానం. కాగా స్త్రీ పురుష సంబంధ సమస్యను మరో కోణంనుంచికూడా గమనించవచ్చును.

ఒక తెగ ఒక భూభాగాన్ని ఆక్రమిస్తుంది. తమ పశువుల పెంపకానికి బీళ్ళు కావాలి కదా! బీళ్ళకోసం, పచ్చిక బయళ్ళకోసం పోరాటాలు సాగుతాయి తెగలమధ్య;

తండాలమధ్య. అంటే మానవ నాగరికత తొలిరోజుల్లో ఒక తండా మరొక తండాను యుద్ధంలో ఓడించేది. శత్రువు తండాలోని పురుషులను చంపేపద్ధతి ఉండేది. కాగా స్త్రీలను అందులో ముఖ్యంగా యవ్వనంలోవున్న స్త్రీలను చెరపట్టేవారు. వారిని భార్యలుగా, ఉంపుడు కత్తెలుగా వాడేవారు. కాలం గడిచింది. శత్రువులను చంపే దానికన్నా వారిని పశువులుగా చేసి అంటే బానిసలను చేసి తమకు, తమ సమాజానికి లాభకరంగా వాడుకునేవారు. పశువులను పెంచిన పద్ధతిలో బానిసలను పెంచేవారు. బానిస పురుషులకు బానిస స్త్రీలను భార్యలుగా ఇచ్చారు. వారి సంతానం బానిస సంతానం. వారు యజమాని ఆస్తి. ఈ బానిస సమాజంలో స్త్రీ పురుషులు బానిసలుగా ఉండేవారు. కాగా స్త్రీ పతికికూడా బానిస ఇలా రెండురకాల బానిసత్వాన్ని ఆమె అనుభవించింది.

బానిసత్వంపోయి వ్యవసాయ రంగంలో అర్ధబానిసత్వం వచ్చిన రోజుల్లోకూడా స్త్రీ పరిస్థితి మారలేదు కాగా ఆమె కొంత గాలి పీల్చుకోగల్గింది. వ్యవసాయ విప్లవం వచ్చి రైతుకు భూమిపై యాజమాన్యం వచ్చింది. కాని ఆస్థి మాత్రం పురుషునికే దక్కింది స్త్రీ రైతు భార్యగా, అతని దయాదాక్షిణ్యాలపై బ్రతికే జీవి అయింది.

పారిశ్రామిక విప్లవం వచ్చింది. మనిషి చేతితోచేసే పనులను యంత్రంతో చేయ నారంభించారు యంత్రాలు నడపటానికి శ్రమశక్తి అవసరమయింది. గ్రామాలలో రుణభారంతో భూస్వామందులకు కట్టుబానిసలుగా ఉన్న స్త్రీ పురుషులను విముక్తి చేసి పట్టణాలకు, నగరాలకు తరలింపచేసింది భూస్వామ్య సమాజంలో యజమాని 'దయా దాక్షిణ్యాల'పై బ్రతికే రైతుకు కాస్త భద్రత ఉండేది. పారిశ్రామిక సమాజంలో అతడు కార్మికుడుగా, ఆమె కూలీగా తయారయ్యారు. ఆర్థిక భద్రత ఎగిరిపోయింది. కేవలం కూలిపై బ్రతకవలసి వచ్చింది. 16 నుండి 18 గంటలు పనిచేయాల్సిన పరిస్థితి కల్గింది. ఈ సమాజంలోకూడా స్త్రీ పురుషుని అధీనంలోనే ఉండవలసి వస్తున్నది. కూలి డబ్బులు, నెలజీతం ఆమె చేతిలోకి వచ్చినా ఆమె వాటిని పతిదేవుని పాదపద్మాలవద్ద సమర్పించుకోవలసిన స్థితి కొనసాగుతున్నది.

ఇక సోషలిస్టు సమాజాలు తీసుకుందాము. రష్యాలాంటి దేశంలో స్త్రీ పురుషు లిద్దరూ 6 గంటలో 7 గంటలో రోజుకు పనిచేస్తారు. వేతనం ఇద్దరికీ సరిసమానమే. కాని స్త్రీ ఇంటికివచ్చిన తరువాత కనీసం మూడుగంటలు వంటపని, ఇంటిపని చేయ వలసి వుంటుంది. ఇంటి యజమాని లేక ఇతర పురుషులు టి.వి. చూడటమో, నృత్య

నాటికను లేక సినిమాను చూడటానికి థియేటరుకు వెళ్ళటమో చేస్తారు. కాకపోతే క్లబ్బులకు వెళ్ళి కాలక్షేపం చేస్తారు, ఇది దరహంమీద ప్రజానీకపు స్థితి కనీసం భార్యతో గోష్టికైనా ఆయన ఇంటిలో వుండడు దాంతో ఆమెకు చిరాకు ఎత్తుతుంది భర్తను నిలదీసి అడుగుతుంది. "నీకు కవిత్వం సంగతి, నాట్యశాస్త్రపు విషయం, చిత్రలేఖనం, శిల్పం ఇత్యాది కళలగురించి తెలియదు కదా! నీతో ఏమి మాట్లాడేది?" అంటాడు దాంతో ఆమెకు మరీ ఒళ్ళు మండుతుంది. భార్యాభర్తలు మాటామాటా అనుకుంటారు విడిపోతారు నగరాలలో క్రొత్త వివాహాలలో విడాకుల రేటు 50 శాతం, గ్రామాలలో 80 శాతం. ఇది శోచనీయ పరిస్థితి.

ఇక ముఖ్యవిషయాలను కొన్నింటిని స్పృశిద్దాం. అమెరికాలాంటి పెట్టుబడిదారీ దేశాలలో సామాజిక ప్రజాస్వామ్యం వుంది స్త్రీ పురుషులిద్దరూ ఇంటిపనిని పంచుకుంటారు. ఆచరణలో ఆర్థిక ప్రజాస్వామ్యం కొంతవరకు ఉంది రాజకీయ ప్రజాస్వామ్యం లేదు సమాజపు కీలకపు స్థానాలలోకి స్త్రీలను దరిజేరనియ్యరు రష్యాలో ఆర్థిక ప్రజాస్వామ్యం వుంది. కీలకస్థానాలలో స్త్రీల సంఖ్య అత్యల్పం సామాజిక ప్రజాస్వామ్యం లేదు. ఇంటిపనిలో పురుషుడు వేలుపెట్టడు భారతదేశంలో లా ప్రకారం రాజకీయ ప్రజాస్వామం వుంది. ఆచరణలో ఇంచుమించుగా మృగ్యం అని చెప్పవచ్చు. సామాజిక, ఆర్థిక స్వాతంత్ర్యాలు సున్న. ఇవన్నీ దరహంమీద చేసే సూత్రీకరణలు. ఈ సూత్రాలకు మినహాయింపుగా ఉండే కుటుంబాలు, వర్గాలు అన్ని దేశాలలోనూ ఉన్నాయి.

దీనినిబట్టి సామాజిక వ్యవస్థలు మారినా పాతకాలపు వ్యవస్థలతాలూకు భావాలు నూతన సామాజిక వ్యవస్థలలోకూడా మనగల్గుతున్నాయని తెలుస్తుంది ఈ సూత్రం ప్రకారం ముఖ్యంగా స్త్రీల దోపిడీ, ఆమె శ్రమశక్తిని, మేధాశక్తిని కారుచౌకగా సమాజం వాడుకోవటం అనేది ఒకటయితే పురుషాధిక్యతా భావబోధిత సమాజంలో పురుష ప్రాధాన్య విలువలు స్త్రీల నెత్తిపై రుద్దబడతాయనేది రెండవది. కనుక స్త్రీ పురుష అసమానత్వం అంత తేలికగా నశింపు కావటంలేదు.

ఇలాంటి సామాజిక భావాలు ఉదయించటానికి స్త్రీ పురుషులమధ్య పని విభజన ఒక కారణమయితే సమాజానికి అవసరమయిన సంతానాన్ని ఉత్పత్తి చేయటంలో స్త్రీ స్థానం రెండవదని ఎంగెల్సు చెప్తాడు. సామాజిక వస్తువుల ఉత్పత్తి, ప్రజా పునరుత్పత్తి రంగాలలో స్త్రీల స్థితిని గమనించిన తర్వాత చెప్పిన మాటలవి స్త్రీ

అబల కనుక ఆమెకు రక్షణ అవసరం కనుక ఆమెను ఇంటిలో చల్లనిచోట కూర్చో పెట్టి పురుషుడు సామాజిక ఉత్పత్తిరంగంలో పనిచేస్తూ ఇతోధికంగా శ్రమిస్తున్నాడని సంప్రదాయవాదుల విశ్వాసం ఇటీవల మరో సిద్ధాంతం వచ్చింది. పురుషుడు స్త్రీని తన స్వార్థంకోసం ఇంటిలోకి నెట్టలేదని స్త్రీయే తనకు భద్రత, సౌఖ్యం, విశ్రాంతి, భారమైన పని లేమికోరి పురుషుని బుజ్జగించి తానే బుద్ధిపూర్వకంగా గృహ సామ్రాజ్యాన్ని ఏలుకోవటానికి పూనుకున్నదని ఆ క్రమంలో తెలివితక్కువగా తన పతనాన్ని తనే కోరితెచ్చుకున్నదని ఈ వాదన సారాంశం ఇది యుక్తియుక్తం కాదు. మాతృస్వామ్య వ్యవస్థనుండి పితృస్వామ్య వ్యవస్థకు మారే దశలో స్త్రీలు వ్యతిరేకించినట్లు, పోరాడినట్లు చరిత్రకారులు చెప్తున్నారు అదీగాక ఎవరూ బుద్ధిపూర్వకంగా తమ అధికారాన్ని - సమాజంలోకాని, ఇంటిలోకాని - వదులుకోరు. కనుక ఈ వాదనను త్రోసిరాజనాలి

ఇకపోతే శారీరక బలం విషయంలో, ఒకనాడు సమానంగా శారీరక బలాన్ని ప్రదర్శించిన స్త్రీలు ఎందుకు శారీరకంగా బలహీనమయినారని విచారించాలి. శారీరక బలాన్ని చూపవలసిన పరిస్థితులు తక్కువ అయితే వాడుక లేక వాడుకలేని శరీరావయవాలు చిక్కిపోవటం, సన్నగిల్లిపోవటం సహజమే దరహంమీద ఈ పరిణామం సంభవించింది.

అయితే వీటికి మినహాయింపు లేకపోలేదు. ఇప్పటికీ కొన్ని వర్గాలలోని స్త్రీలు తతిమ్మా వర్గాలలోని పురుషులకన్న శారీరకంగా బలవంతులని మన అందరికీ తెలుసు అసలు శారీరక బలానికి ప్రాధాన్యత ఇచ్చే రోజులు పోయాయి; పోతున్నాయి. చేతులతో చేయలేని పనులను యంత్రాలతో చేస్తున్నాం ఒకనాడు పశుబలాన్ని వాడుకున్నాం. ఈనాడు యంత్రబలాన్ని వాడుకుంటున్నాం. స్త్రీ పురుషుల మేధాశక్తిలో వస్తుతః తేడాలు లేవు కాగా కొన్నిరంగాలలో స్త్రీలను ప్రవేశించనీయనందునను, వారు చొరవగా ముందుకు రాలేకపోయినందువలనను కొన్ని విషయాలలో వారి మేధాసక్తి తక్కువ అయినట్లుగా కన్పడుతుంది. కాని వాస్తవానికి ఆమె మేధస్సు, బుద్ధి పురుషునితో సమానమైనదే కాగా అలవాటుప్రకారం ఆచరణలో పురుషుని బుద్ధికి సానపెట్టటం జరిగింది. ఆమె బుద్ధి వజ్రతుల్యమైనా అది సానపెట్టబడని వజ్రం అవకాశాలు ఇస్తే, వాటిని ఆమె వాడుకుంటే, ఆమె పురుషునితో అన్ని రంగాలలో సమఉజ్జీగా నిలబడకలదు. కాని నాటినుండి ఆమెకు అలాంటి అవకాశమే లభించలేదు.

ఈ సందర్భంగా ఒకటి రెండు అంశాలను మనం గమనించాలి. సోషలిజం వచ్చిన రష్యాలో స్వార్థపరత్వం, పని రలాయింపు మనస్తత్వం, అధికార వాంఛ, ఆశ్రిత పక్షపాతం, పెత్తందారీతనం, సదుపాయాలకోసం, హక్కులకోసం తాపత్రయం, సాధారణ ప్రజానీకంయెడ నిరాదరణ ఇలాంటి ధోరణులు నశింపుకాలేదని రష్యా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి గోర్బచేవ్ ప్రకటించాడు. అందుకోసం సమాజ పునర్నిర్మాణానికి పూనుకున్నాడు. దానికి ప్రాధాన్యత ఇస్తున్నాడు. మావో సాగించిన సాంస్కృతిక విప్లవకాలంలో అసహనం, దుందుడుకు విధానాలు, 'పవిత్ర' మనస్తత్వ ధోరణులు ప్రబలాయి కనుక కేవలం సమాజ స్వరూపానికేకాక ఆ సమాజసాధనలోనూ, ఆ సమాజంలోనూ మానవ విలువలకు ప్రాధాన్యతనిచ్చే నీతికి (కల్చరల్ రివల్యూషన్) పెద్దపీట వేస్తేనే బానిసత్వం, పెత్తందారీతనం, అసమానత్వం, వర్గ సంకుచితధోరణి, అహంకారం, న్యూనతాభావం, కేవలం స్వార్థపరత్వం నశించవు అవి నశించనిదే, అవి నశించటానికి మనం కృషిచేయనిదే స్త్రీ విమోచన సాధ్యంకాదు, లభ్యంకాదు. తాత్కాలికంగా లభించినట్లు కన్పడినా అది నిలువదు సమాజ పరిణామం మూసపోసిన ధోరణిలో ప్రపంచమంతటా జరగలేదు. వడిదుడుకులు, వ్యత్యాసాలు, తేడాలు, మార్పులు, గోచరిస్తున్నాయి. ఒక దేశంలో స్త్రీకి సాంఘిక విషయాలలో స్వేచ్ఛ ఉంటే మరో దేశంలో ఆర్థిక స్వేచ్ఛ ఉండదు (ఉ॥ బ్రిటనులో 1940 వరకు, వివాహిత స్త్రీ ఆస్తిపై భర్తదే యాజమాన్యం.) అలాకాక ఒక దేశంలోనే భిన్న కాలాలలో భిన్న విధానాలు ఉంటాయి. భారత స్త్రీ సామాజిక స్వేచ్ఛను కోల్పోయిన మధ్యయుగంలో ఆస్తిహక్కును పొందింది. కొన్ని తెగలలో సామాజిక స్వేచ్ఛ ఉన్నట్లు కన్పిస్తుంది. తీరా పరిశోధనచేస్తే అది మృగ్యమవుతుంది. 9 వ శతాబ్దంలో కామసాని అనే ఆమె రాణిగాఉంటే ఇంచుమించుగా అదేకాలంలో అస్సాంలో స్త్రీలు రాజరికం సాగించారు. 20 వ శతాబ్దంలో ఇండియాలో, సింహళంలో, ఇజ్రాయిలులో, బ్రిటనులో స్త్రీలు ప్రధానమంత్రులయితే అలాంటి స్థితిని అమెరికాలాంటి అగ్రరాజ్యంలోకాని రష్యాలో కాని ప్రస్తుతం ఊహాతీతం అయితే ఒక స్త్రీ రాజ్యం చేసినంతమాత్రాన స్త్రీలకు ఒరిగేదేమీలేదు. ఆమె పురుష ప్రాధాన్య సమాజంలో, వారి సహకారంతో బలంతో అధికారాన్ని చలాయించినంతమాత్రాన పురుష ప్రాధాన్య సమాజపు నీతికి కాదనగల స్థితిలో లేదు. కాబట్టి దరహంమీద స్త్రీల స్థితి ఎలాఉందని పరిశీలించాలి కాని పైపై పూత మెరుగులను చూచి మోసపోరాదు. ఆత్మవంచనకు గడంగరాదు.

భారతదేశం కాలమానం ప్రకారం 20వ శతాబ్దంలోనూ, పారిశ్రామికంగా 19వ శతాబ్దంలోను, భావాల పరంగా మధ్యయుగంలోనూ (15వ శతాబ్దం) ఉన్నది. కనుక అన్నియుగాల భావాలు బలీయంగా మనకు కన్పిస్తున్నాయి. ఏకకాలంలో మన గల్గుతున్నాయి. ఇపుడు ఈ పరిస్థితులలో క్రొత్త ఆలోచనలు ఉత్పన్నమవవలసి వస్తున్నది. వేదకాలపు ఆలోచనలు, ఏసుక్రీస్తునాటి ఊహాపోహలు, మహమ్మదునాటి సామాజిక రీతులు, మన్వాదుల శాసనాలు, 19వ శతాబ్దపు భావాలు, ఆ మాటకువస్తే 70, 80 ఏండ్లనాటి లెనిన్, మావోల భావ వారసత్వం మనలకు సంపూర్ణమైన పరిష్కార మార్గాన్ని చూపించదు. ప్రతి సమస్యను కూలంకషంగా పరిశీలించి, దాన్ని అంటిపెట్టుకొనివున్న సామాజిక పరిస్థితులను అధ్యయనంచేసి, ఆనాటి స్థితిగతులకు ఈనాటి వాటికి ఉన్నతేడా గమనించి స్త్రీ విమోచన వాదులు తమ కార్యక్రమాన్ని నిర్ణయించుకోవాలని ఆకాంక్షించడంలో తప్పులేదు.

అవి దురాచారాలైనా, కాలగతినిబట్టి అర్థరహితాలైనా, ఆచరించటానికి అనర్హాలైనా, పనికిమాలినవై మన ప్రాణాలను తోడేవి అయినా మనం వాటిని ఒకపట్టాన విడిచిపెట్టం. అది మన ప్రత్యేక లక్షణం, మన లక్ష్యంకూడాను. మనం మన విలువలను గుర్తించకపోగా సామాజిక స్పృహను కోల్పోతున్న అయోమయావస్థలో వున్నాం. మన అజ్ఞానంవల్ల మనం నష్టపోతున్న స్త్రీ శక్తిని గుర్తించలేక పోతున్నాం. అదే మన తరతరాల బానిస మనస్థత్వం.

మానవుడు పాశవికదశనుండి పురోగమించినా, ఒకనాటి అసాధ్యాలు ఈనాటి సాధ్యాలుగా మారినా స్త్రీజాతి నిద్రాణదశనుండి మేల్కొనలేదనటానికి అనేక రుజువులున్నాయి. పుత్రుడికోసం ఎదురుచూచే తల్లిదండ్రులకు 'ఆడదే' పుట్టిందే అనే అవమానంతో, బాధతో మొదలవుతుంది ఆమె పరాజయ గాథ. ఏ వేడుకలూ లేక, ఎవరికీ సంతోషంలేని ఆమె బ్రతుకు అంతా గాఢాంధకారమే. ఆడపిల్ల పెంపకంలో, పోషణలో, ఆదరాభిమానాలలో తేడాతో పెంచబడుతుంది. ఆహారలోపంవల్ల, అశ్రద్ధవల్ల బాలికల మరణాలు హెచ్చని మనందరికీ తెలుసు. వివాహయోగ్యత వరకు విద్య నేర్పిస్తారు. అంతటితో 'ఫులిస్టాప్'. కట్నమనే దక్షిణతో "సొంత ఆస్తి"క్రింద ఆమెను జమకడతాడు భర్త అనే యజమాని. తల్లి నేర్పిన నీతులతో, ఒద్దికతో, భయభక్తులతో, నీడలా అనుసరిస్తుందా జవరాలు. ఆమె 'పవిత్రతను' రక్షిస్తూ ఆమె సేవలందుకుంటూ ఇంత ఆశ్రయమిస్తాడు భర్త! ఆమె వ్యక్తివికాసాన్ని అణచివేసి తెలివితక్కువ దద్దమ్మలా

పుండనిస్తారు అత్తమామలు, భర్త. పిల్లలను కనాలి, పెంచాలి అది ఆమె విధి. కాని పిల్లలు మాత్రం భర్త సొత్తు అతడే వారికి 'గార్డియన్'. అలా దిష్టిబొమ్మలా, దిగదుడిచిన ఉప్పులా, విసిరేసిన విస్తరిలా, జీవచ్ఛవంలా జీవితాన్ని గడుపుతుంది ఆ బొమ్మ. అదిచాలక వ్రతాలు, నోములు పూజలు చేస్తూ, పతిభక్తి పారాయణం చేస్తూ, ఇచ్ఛాపూర్వకమైన పురుషాధిపత్యాన్ని సగౌరవంగా స్వీకరిస్తుందా మహాసాధ్వి పరమ పతివ్రత, శాంతమూర్తి, పుణ్యకాంత అనే బిరుదులు పొందుతుంది. ఈ రకమైన కఠిన నియమాలతో, అత్తగా రూపొందిన ఆమె తన పూర్వస్మృతిని విస్మరించలేక తనకన్నా అబల అయిన కోడలిమీద దౌర్జన్యాన్ని సాగిస్తుంది. కట్నం చాలలేదు కాలుస్తానంటుంది. బిడ్డలు పుట్టని గొడ్రాలు అంటుంది ఆమెను హింసించటమే తనకు 'హోదా'గా, గౌరవ ప్రతిష్టలుగా భావిస్తుంది ఇదంతా తన కర్మ అనీ, నొసటి వ్రాత అనీ కృశిస్తుందా చిన్నారి కోడలు. అయినా ఆ కోడలుపిల్ల ఆడదానికి అదే మహా భాగ్యంగా భావిస్తుంది ముందుతరాల వారి గాధలు విని అదే మన సంస్కృతి, సంప్రదాయం అని తెలుసుకుంటుంది, ఆచరిస్తుంది. ఇది తరతరాల స్త్రీల పరాజయ గాధ కనుక ముందుగా స్త్రీ వ్యక్తిత్వాన్ని, ఉనికిని గుర్తించి తరువాత పరిణామ దశలో జరిగిన మార్పులను గమనిద్దాం.

ఒక వ్యక్తియొక్క రూపురేఖలు, మాటతీరు, నడకతీరు, ముఖకవళికలు, తెలివితేటలు, బుద్ధివికాసం, ప్రతిభ, శక్తి, సామర్థ్యం, పరోపకార పారీణతలాంటి సద్గుణాలు, శాంతి, దాంతి, సహనం ఇలా ఒకటేమిటి సమస్తగుణాలు, అమాటకువస్తే సమస్త దుర్గుణాలు, బలహీనతలు, లోటుపాట్లు అన్నీ కలిస్తే దానిని వ్యక్తిత్వం అంటారు. సంపూర్ణ మానవుడనేవాడు లేడు. అలాగే సగటు మనిషి లేడు. ప్రతి మనిషిలో కొంత మంచి, కొంత చెడు ఉంటుంది. ఒక్కొక్కరిలో ఒక్కొక్క మంచి గుణమో లేక దుర్గుణమో, శక్తియో, లోపమో ప్రస్ఫుటంగా దర్శనమిస్తాయి ఇవన్నీ కలిస్తేనే వ్యక్తిత్వం. క్షీరనీర న్యాయంగా విడదీసి మంచిగుణాలను ఏరి వాటితో అతనిని లేక ఆమెను చిత్రిస్తే ఆ చిత్రణలో మనకు ఆ వ్యక్తి కన్పించరు. మరోవ్యక్తి కన్పిస్తారు అలా వేరుచేయడం ఆత్మవంచన, పరవంచన అవుతుంది. ఇది స్త్రీ పురుష ఇద్దరికీ వర్తిస్తుంది. స్త్రీని మనిషిగా పరిగణించటం తరువాత ఆమె విలక్షణాన్ని గుర్తించి అంగీకరించటం ముందుగా జరగాల్సిన పని. కాని స్త్రీని చంచలచిత్త అని, కామోద్రేకి అని, అసత్యవాది అని, పలుపకాలుగా ఆమెను నిందించారు పెద్దలు. భీష్ముని పాత్రద్వారా అంబ వ్యామోహాన్ని నిరసించిన వ్యాసుడు మొదలు మనువుదాకా

అందరూ స్త్రీని కించపరచి మాట్లాడారు. అయితే ఇందులో ముఖ్యాంశం ఏమిటంటే స్త్రీని మనిషిగా గుర్తించి ఆమెను తిట్టారు. ఆమె వ్యక్తిత్వానికి అపార్థాలు ఇచ్చారు కాని అసలు ఆమెకు వ్యక్తిత్వం లేదని అనలేదు. అంతవరకు పూర్వస్థితికన్న ఈ పరిస్థితి మెరుగుగానే ఎంచవచ్చు. స్త్రీలకు పూర్తిగా తమతోపాటు శక్తియుక్తులూ, ప్రతిభా వ్యుత్పత్తులు ఉన్నాయని పురుష ప్రపంచం అంగీకరించదు. అంత్రగా అంగీకరించాల్సివస్తే అది అంతా పురుషుల చలవవల్ల వారి దయాదాక్షిణ్యాలవల్ల మాత్రమే సాధ్యమనేటట్లు మాట్లాడుతారు. ఒకవేళ ఏస్త్రీ అయినా పేరు ప్రఖ్యాతులను సంపాదిస్తే ఆమె వివాహిత అయితే ఆమె తండ్రినీ, సోదరుల్నీ ప్రశంసిస్తారు. చూస్తూ చూస్తూ ఆమెను అభినందించలేదు పురుష సమాజం. ఒక పురుషుని వ్యక్తిత్వాన్ని మదింపు వేయాల్సివస్తే అతని లోపాలు, లొసుగులు వదిలివేసి గుణగణాలను గురించి ముచ్చటిస్తారు. అదే ఒక స్త్రీని గురించి మాట్లాడవలసివస్తే ఆమె లోపాలను గోరంతలు కొండంతలుచేసి వర్ణిస్తారు. ఈ విషయాలన్నీ మనం నిత్యం గమనిస్తున్న నగ్నసత్యాలే కదా!

స్త్రీ తన మాతృత్వంద్వారా మానవజాతి మనుగడను కొనసాగిస్తుందే పిల్లలను కనగల శక్తి ఆమె బలహీనతకు నిదర్శనంగా పేర్కొంటూ ఆమెకు రావలసిన పేరు ప్రఖ్యాతులను, పదవీ యోగ్యతలను వమ్ము చేస్తున్నారు అత్యధిక సంఖ్యలో పురుషులు. శారీరక దార్ఢ్యానికి విలువపోయిన ఈ రోజుల్లో, బుద్ధిబలానికి విలువనిస్తున్న ఈనాడు స్త్రీ శారీరకంగా బలహీనురాలని వాదిస్తూ తమ ఆధిక్యతను చాటుకుంటారు పురుషులు. అందులో ముఖ్యంగా అల్పపరిమాణ శరీరులైన మగవారుకూడా ఇంతగా ఎన్నివిధాల అదిమిపెట్టినా, అణచివేతకు గురిచేసినా ఆమె ప్రతిభ రాణిస్తుందే దానిని అంగీకరించి అభినందించలేక దానిని వక్రమార్గాన పెట్టానే తాపత్రయం కనపడుతోంది. సుశిక్షిత మేధాసంపత్తి, తర్కబుద్ధి, విశ్లేషణాశక్తి, సమ్యక్‌దృష్టి లాంటివి స్త్రీకి లేవట. అవన్నీ పురుషజాతికే లభ్యమట. ఆమెకు గణితం, ఇంజనీరింగు వగైరాదులు గ్రాహ్యం కావట - ఇలా ఆత్మస్తుతి, పరనిందతో కాలం గడుపుకుంటున్నారు కించిదజ్ఞులైన కొందరు పురుషులు. ఇదంతా తమ అసమర్థతను, అప్రయోజకత్వాన్ని కప్పిపుచ్చుకోవటానికి చేసే కుటిల ప్రయత్నాలుకాక మరేమిటో ఆలోచించండి. ఇన్ని కుయుక్తులతో వాదించినా పరాజయం పొందక తప్పటంలేదు. ఇలాంటి ఈ పురుష దురహంకారులు (ఇక తర్కాన్ని గాలికివదలి, సభ్యతా సంస్కారాలను అవలకు నెట్టి) కుడిచేయి, ఎడమచేయి సమానంకాదు కదా, కుడిచేయి బలంగా ఉంది కదా, అలాగే పురుషుడు పురుషుడే, స్త్రీ స్త్రీయే, పురుషునితో సమతూకంగా స్త్రీ వ్యవహరించలేదని

తీర్పు చెప్పుకొని తమ తెలివితేటలకు తామే సంతోషిస్తారు. ఇలాంటి ప్రబుద్ధులు పొరుగింటి పుల్లకూర రుచి అన్నట్లు తమ కుటుంబాలలోని స్త్రీల శక్తిసామర్థ్యాలను ఈసడించి, ఇరుగుపొరుగువారి లేక దూరాన ఉన్న ఆడంగుల ప్రతిభను గురించి వేనోళ్ళ పొగడుతూ, వారికి భజనపరులయి, వారికి భట్రాజీయం నెరపుతూ స్త్రీలను అణచివేశామనే మన స్తత్వంతో సంచరిస్తూ అధికారంలో ఉన్న స్త్రీల అడుగులకు మడుగులొత్తుతూ రొమ్ము విరుచుకొని తిరిగే పురుషపుంగవులు అత్యధికంగా వున్నారు స్త్రీజాతిపై ఉన్న అసహనం, ఈర్ష్య, అసూయ, ద్వేషంలాంటివి మరోరూపం తాలుస్తున్నాయి. అసాధారణ శక్తికల మహిళలను కొనియాడి తతిమ్మా స్త్రీజాతిని చిన్నచూపు చూస్తూ చులకనగా మాట్లాడటం వారి నైజం. ఇదోరకమైన వేర్పాటు ధోరణి అంటే స్త్రీలలో ఐక్యతను తొలగించడమే. ఇలా పురుషజాతి అవలంభించే విధానాలను గురించి, ఎత్తులు, చిత్తులనుగురించి ఎంతయినా చెప్పుకోవచ్చు. అసలు విషయమేమంటే చాలమంది పురుషులకు స్త్రీల శక్తిని, ప్రతిభను గుర్తించడానికి ఇష్టంలేదు. వారిని వ్యక్తిత్వంలో ఎదగనీయడం పురుషులకు నచ్చని విషయం. ఇక్కడ స్త్రీపట్ల మరో అపోహవుంది. స్త్రీలో శరీరధర్మం ఎక్కువ్వగా పనిచేస్తుందని, పురుషునిలో మేధాశక్తి వికసిస్తుందని, అంటే స్త్రీ ఎంతసేపూ కామాతుర అని పురుషుడు మానసిక వ్యాపారంమీద ఆసక్తి కలవాడని వర్ణిస్తూ తమకు లేనిపోని గొప్పలను ఆపాదించుకుంటూ కాలక్షేపం చేస్తున్నది పురుష లోకం. స్త్రీ నైజంవేరు, పురుష నైజంవేరు అని మరోవాదన చాలకాలంనుండి చలామణీలో ఉంది.ఈ వాదనను ఇరుతెగలు అంటే పురుషులూ, స్త్రీలూ ఇద్దరూ ప్రచారం చేస్తున్నారు. ఇది విడ్డూరంగా కన్పించినా వాస్తవం. స్త్రీలో లాలిత్యం, కరుణ, ప్రేమ, సానుభూతి మొదలైనవి ఉంటాయట, ఇవి స్త్రీత్వ లక్షణాలట, పురుషునిలో సాహసం, ధైర్యం, పూనిక, పట్టుదల, పోరాట పటిమ ఉంటాయట, ఇవి పురుషత్వ లక్షణాలట (Masculine Qualities) స్థూలంగా చూస్తే ఇది నిజమనిపిస్తుంది. కాని అది సత్యం కాదు. ప్రతి మనిషిలో రెండు లక్షణాలు - స్త్రీత్వ లక్షణాలు, పురుష లక్షణాలు ఉంటాయి. కాకపోతే మోతాదులలో తేడాలుంటాయి. ఇలా స్త్రీలపై నిరసన ప్రదర్శించే భావాలు అనంతంగా వున్నాయి.

స్త్రీల వ్యక్తిత్వ వికాసంగురించి చర్చిద్దాం. భారతదేశంలో, వైవాహిక జీవితంలో సర్వసాధారణంగా స్త్రీల వ్యక్తిత్వ వికాసం పెరగటానికి అవకాశంలేదు. ఉద్యోగం లేక బయట పని అదనంగా ఇంటిపనితో స్త్రీ సతమతమయి పోతున్నది. ఎంతో ప్రతిభ, సామర్థ్యం, పట్టుదల వుంటేతప్ప వారి వ్యక్తిత్వ వికాసం జరగటం

లేదు. భారతదేశపు స్త్రీల శోచనీయ స్థితి ఇలా ఉంది. స్త్రీ అవివాహితగానో, లేక విడాకులు పొందితేనో, లేక వితంతువు అయితేనో, ఇవన్నీ కాకపోతే బాగా అనుకూలవంతుడయి, తనకోసం త్యాగాలుచేసే భర్త లభిస్తేనో అప్పుడే ఆమె పురోభివృద్ధి సాగుతుంది. ఈ అంశాన్ని గుర్తించటం అత్యవసరం.

భారతదేశపు స్త్రీలు పుట్టుకనుంచి తమ అభీష్టాలను, వాంఛలను, ఇష్టాయిష్టాలకు వెలికి ప్రస్ఫుటంగా చెప్పకపోవటం, కోర్కెలను అణచుకోవటం, బాధలను సహించటం నేర్చుకున్నారు. సామాజిక దౌష్ట్యం, కుటుంబంలో అణచివేతవలన ఇలా సంభవిస్తున్నది. ఇది వారి సెక్స్ వాంఛల విషయంలోకూడా వర్తిస్తున్నది. పురుషునికన్నా స్త్రీ తన కామోద్రేకాన్ని అణచుకోగల్గుతున్నది. ఇదీ ఒకరకంగా ఆమెకు ఇతర ప్రవృత్తుల, శక్తులపై దృష్టి కేంద్రీకరింపచేసుకోటానికి దోహదం చేస్తున్నది. ప్రతి చెడులోనూ ఏదోకొంత మెరుపు, కాంతి వుండకపోదు. అలాగే ఇదికూడా. ఇంతకూ చెప్పతల్చుకున్న విషయం ఒకసారి స్త్రీ తన జీవితవిధానాన్ని తన మానసికాభివృద్ధి బాటను నిర్ణయించుకున్న తరువాత సమాజం నేర్పిన మనోనిగ్రహం ఆమెకు తోడ్పడుతుందని చెప్పటంమాత్రం సాహసం కాదు. అలాంటి వ్యక్తిత్వ వికాసాభివృద్ధిని పొందగల శక్తి స్త్రీలలో రూఢిగా పాదుకొంటుంది.

తల్లిగా, భార్యగా, కుమార్తెగా ఆమెకు ఎన్నో ఆంక్షలు విధించారు, శిక్షలు నిర్దేశించారు. నీవు ఉత్తమ గృహిణివి, మాతృదేవతవు, క్షమ, త్యాగం, ఓర్పు, సహనం స్త్రీ సహజ లక్షణాలన్నీ శ్లోకాలద్వారా కీర్తిస్తే అజ్ఞాని అయిన అనాటి స్త్రీ తాను త్యాగశీల కావాలని ఎన్ని కష్టాలయినా భరించేది. ఆ త్యాగ స్వరూపమే సతీసహగమనం. పాతివ్రత్యమే పరమధ్యేయమని నమ్మిన సీత అగ్నిలో దూకింది, అమ్ముడుపోయింది చంద్రమతి. జూదంలో పావుగామారింది ద్రౌపది, శిల అయింది అహల్య. భర్తను వేశ్యకు అర్పించింది సుమతి. వీరంతా మహాపతివ్రతలు, గణుతికెక్కిన ఆదర్శ స్త్రీ మూర్తులు. వారి పేరు ఉచ్చరిస్తేనే పంచమహాపాతకాలు పటాపంచలై పోతాయట. అందువల్లే భర్తలు చంపుతున్నా, నరుకుతున్నా, వాతలు పెడుతున్నా ఆ కష్టాలముందు మన కష్టాలొక లెక్కా అని కళ్ళొత్తుకుంటూ వుంటారు. ఇక మనువులాంటి ధర్మశాస్త్రజ్ఞులు విషం క్రక్కుతూ స్త్రీకు అజన్మాంతం సంరక్షకత్వం సృష్టించారు. బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కుమారుడు రక్షించాలనే ఆచారం నాటినుండి నేటివరకు శిరోధార్యమయింది.

ఈ సందర్భంగా కొన్ని స్త్రీ ధర్మాలను నెమరేసుకోవటం అత్యంత అవశ్యకం. "ఓ దేవా నాకు మగబిడ్డను ప్రసాదింపుము" అనే ప్రార్థనకు ప్రాతిపదికలు ఋగ్వేదం లోనే ఏర్పడ్డాయి. ఏ స్త్రీకాని, ఏ పరిస్థితిలోకాని, త్రికరణశుద్ధిగా భర్తను అతిక్రమించ రాదు అని గౌతమ ధర్మ శాస్త్రకారుడు నాతిచరేద్భర్తారమ్ (2-9-2) అని ఇంకా శ్రౌత సంబంధమైనదిగాని లేక గార్హస్థ్య సంబంధమైనదిగాని అగు ధర్మములో భర్తను అనుసరించాలేగాని స్వతంత్ర్యం కూడదు అని (2-9-1) కూడా ప్రవచించారు. భర్త అనుమతిలేకుండా స్త్రీలనుసైతం చూడరాదని, వెడితే పణము (దండములు) విధించాలని కౌటిల్యుడు శాశించాడు. ఏ స్త్రీ అయితే భర్త దుఃఖంలోనూ, సుఖంలోనూ పాలుపంచుకుంటుందో, భర్త మరణించగానే మరణిస్తుందో ఆమె మహాపతివ్రత అని బృహస్పతి నిర్ధారించాడు. నపుంసకుడయినా, పతితుడయినా, అంగవికలుడయినా, రోగిగ్రస్తుడయినా భార్య అతన్ని దైవంగా భావించి పూజించాలి అని శంఖ లిఖిత స్మృతి వక్కాణించింది. స్త్రీలు సన్యాసితో, వైద్యుడితో, వృద్ధుడితోతప్ప ఏ పరాయివాడితో మాట్లాడరాదు; బొడ్డు కనబడకుండా, పాదముల క్రిందికి వుండునట్లుగా చీర కట్టవలెను. వక్షస్థలము కనిపించరాదు; ఆమె బట్టను నోటికి అడ్డుపెట్టుకొని మాత్రమే మెల్లిగా నవ్వాలి. భర్తను అతని బంధువులను అసహ్యించుకోరాదు. నాట్యకత్తెలతోటి, జూద రులతోటి, జారిణులతోటి కలిసి వుండరాదు అని ప్రాచీన శాస్త్రజ్ఞులు సూత్రీకరించారు. భర్త వూరలేనప్పుడు కురులు దువ్వరాదు, సరసాన్నముతో భుజించరాదు అని తారకు బృహస్పతి ధర్మోపనీతిని తెలిపాడు అలాగే ఆటలు, పాటలు, నాటకాలు ఉత్సవాలను ఒంటరిగా తిలకించరాదు అని యాజ్ఞవల్క్యుడు (1-85) నిర్వచించాడు. పతికి సర్వవిధాల సేవచేస్తూ, అతనికి హితమాచరించుటే పతివ్రతా లక్షణమని భారతం అనుశాసనిక పర్వం నిర్దేశించింది. ధనహీనుడైనా, కురూపి అయినా, జారుడయినా ఆఖరికి పాపి అయినా పతి పాదములపై చేయివేయక నిదురించరాదని, పతి ఎంగిలి తినవలెనని, కుమారి శతకకారుడు బోధించాడు. "పతికంటే వేరు ధర్మం లేదు, వేరే దైవం లేదు, అతని నామమే బ్రహ్మధ్యానం, అతను మృతిచెందితే అవశ్యం ప్రాణాలు వదలాలి, అతని సమ్మతిలేని ధర్మము నిందార్హము" అంటూ జయదేవుడు భార్య పద్మావతి పేరుతో కొన్ని స్త్రీ ధర్మాలు ప్రచారంలోకి తెచ్చాడు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఈ ధర్మోపన్యాసాలన్నీ ఆడపిల్లలకు పాఠ్యాంశాలుగా పెట్టి బ్రహ్మాండమైన బ్రెయిన్ వాష్ చేసి తరతరాల పురుషులూ సంతృప్తి పొందేవారు.

నాటి స్త్రీకి బిడ్డలను ముఖ్యంగా మగబిడ్డను కనడమే పరమధ్యేయంగా మారింది భర్త సేవ, కుటుంబ సంరక్షణ, పిల్లల పోషణలే ఆమె జీవితలక్ష్యాలు గౌరవ్రదాలయిన స్త్రీ జీవితం కుక్కకన్నా నీచంగా చూడబడేది. వితంతువులకు కఠిన నియమాలు, ఇంటి చాకిరీ వుండేవి. అలా నాటిస్త్రీ కేవలం వంటఇంటికీ, పడకటింటికి పరిమితమై కూపస్థ మండూకంలా బ్రతికేదే; అది చాలక భర్తకు ఎందరు భార్యలున్నా తొణక రాదు, పల్లెత్తుమాట అనరాదు, నవ్వుతూ అణుకువతో మెలగాలి. తను కన్న పిల్లలపై సైతం తనకు ఆధిపత్యంకాని, పెత్తనంకాని వుండరాదు. బిడ్డల్ని కనే యంత్రమేతప్ప బిడ్డకు 'గార్డియన్' కాబోదు. పిల్లలకు, భర్తకు సేవచేయటం, మిగిలింది తిని బ్రతకటం ఆమె ధర్మం. ఒక్క మాటలో చెప్పాలంటే భర్త కురూపి అయినా, జడుడైనా, రోగి అయినా జూదరి, త్రాగుబోతు, సప్తవ్యసనాలకు దాసుడైనా పడతికిమాత్రం ఇహం పరం ఆ పతియే కావాలి. అలా కాని స్త్రీని వెలివేయమని, కొరడాదెబ్బలు కొట్ట మని, త్యజించమని ధర్మశాస్త్రాలు వక్కాణించాయి. ఆచారాలు బలపరిచాయి. ఇలా కొన్నివేల సంవత్సరాలు గడిచాయి ఈనాటికీ ఆమె అణచబడ్డ జాతిగానే ఎంచబడు తోంది అనేదానికి బోలెడన్ని ఆధారాలు వున్నాయి

కుటుంబపరంగా ఆలోచిస్తే, అమ్మాయి పుట్టుకతోనే తేడాలు, సమస్యలు ఆరంభమవుతున్నాయి. 'జెనెటిక్స్' విభాగంవారు గర్భిణీస్త్రీకి కొన్ని పరీక్షలు చేసి పుట్టబోయే శిశువు ఆడ, మగ నిర్ధారించగలిగారు. దాని ఫలితంగా ఆడపిల్ల పుడుతుందని తెలిసిన కొందరు గర్భస్రావాన్ని చేయించుకుంటున్నారు. అలా మొదలైన వివక్ష ఆమె జీవితాంతం వుంటూనేవుంది. అమ్మాయికి మజ్జిగ, అబ్బాయికి పెరుగువేసి పెంచుతారు. అలా తల్లికూడా తేడా చూపిస్తుంది. అమ్మాయికి పెద్ద పెద్ద విద్యలు నేర్పిస్తే పెళ్ళి కాదని కొద్ది విద్యతో మాన్పించి పెళ్ళి చేస్తారు. ఆ వివాహంలోకూడా ఆమె ఇష్టా ఇష్టాలతో నిమిత్తంవుండదు. ఇక దాంపత్య జీవితంలో అనేక కష్టనష్టాలు పాలు అవు తుంది ఆమె. విడాకులు పొందితే తప్పు. ఆస్తి అడిగితే నేరం. మళ్ళీ పెళ్ళాడిన వితం తువును నీచంగా చూస్తుంది సమాజం. ఇంటి చాకిరీ ఎంతచేసినా విలువలేక భారంగా బ్రతుకుతోంది. అలా బ్రతకలేని ఆడది ఆత్మహత్య పాలవుతోంది. భార్యను భరించటం ఇష్టంలేని భర్తలు ఆశాపాతకులై అమ్మాయిల్ని హత్యచేసి చట్టం కళ్లు ప్పి తప్పించు కుంటున్నారు. ఇది ఈనాటి కథ. అంటే మనం 20వ శతాబ్దంలో వున్నాం, కాని మన భావాలు 16వ శతాబ్దాన్ని అధిగమించలేక పోతున్నాయి. ఇటు సనాతన సంప్రదా యాలతో ఇమడలేక, అటు ఆధునిక యుగంలోకి అడుగుపెట్టలేక కొట్టుమిట్టాడుతున్న సంధియుగంలో మనం జీవిస్తున్నాం.

అసలు స్త్రీ అనగానే వెంటనే కుటుంబం జ్ఞప్తికి వస్తుంది కారణం స్త్రీకి లక్ష్యంగా నిర్దేశించింది, వైవాహిక జీవితం, మాతృత్వం, సతీత్వం. ఆమె చిన్నతనంలో ఆడుకునే ఆటలు, పాటలు దానికి సంబంధించి ఉంటాయి ఎంతసేపూ గుమ్మడిపండు లాంటి మొగుడు కావాలనే ఆకాంక్ష. అమ్మాయికి బొమ్మలు, వంట సామానులు బహుమతిగా ఇవ్వటం, అబ్బాయిలకు ఆటవస్తువులు, పుస్తకాలు ఇవ్వటం ఆచారంగా జరుగుతున్నాయి. ఇక నోములు, వ్రతాలు, భర్త ఆయుష్కాలాన్ని వృద్ధి చేయటానికి అమ్మాయిచేత చేయిస్తారు. అతని శ్రేయస్సుకోసం, అతని ఆరోగ్యంకోసం, అతని భద్రతకోసం ఆమె తన సర్వస్వాన్ని త్యాగం చెయ్యాలి కాపురానికి వస్తే అతనితోడిదే లోకం కావాలి. పతివ్రతగా జీవిస్తూ పతి పాదాలవద్దనే ఆమె కన్ను మూయాలి అదే ఈ ధ్యేయంతో ఆమె బ్రతకాలి. "కార్యేషు దాసీ, కరణేసు మంత్రీ, రూపేషు లక్ష్మీ, క్షమయా ధరిత్రీ, భోగ్యేషు మాతా, శయనేషు రంభా, షట్కర్మనిష్టా, కుల ధర్మపత్నీ" మహా పతివ్రతలంటే ఈ ఆరురకాల సపరిచర్యలు అతనికి విధిగా జరపాలి. సేవలో దాసి, సలహా చెప్పటంలో మంత్రి, రూపంలో లక్ష్మి, శయనంలో రంభ, క్షమలో భూదేవి, భోజనంపెట్టే విషయంలో తల్లి ఇలా అనేక రూపాలుగా ఆమె భర్తను సేవించాలి భర్త చనిపోయిన తరువాత అతనికి పుణ్యలోక ప్రాప్తి కొరకు మగపిల్లలు లేకపోతే హిందువులలో దత్తు చేసుకోవాలి. తీర్థయాత్రలు చేయాలి. ఇలా జీవితమంతా అతని గొడవే అతనితోడిదే లోకం కావాలి ఆమెకు తనదంటూ వేరే ఏమీ లేనట్లు ఆదేశించారు. ఆలా ఆడది ఆజన్మాంతం వ్యక్తిత్వంలేని కీలు బొమ్మలా బ్రతకాలని నిర్దేశించి ఆమెపై అనేక ఆంక్షలు, కఠిననియమాలు తయారుచేశారు.

## మాతృత్వం

స్త్రీకి తన సెక్సు వాంఛలను తనకుగా వ్యక్తీకరించరాదు. కాని పతిదేవుని అలరించాలి, అతనికి పిల్లలను కని ఇవ్వాలి. అందులో ముఖ్యంగా కుమారులను కని ఇవ్వాలి. కనుక ఆమె జీవితం అంతా ఆ రకమైన తంతుతో నింపారు. రజస్వల అయితే పండుగ, బంతి (తమిళ దేశంలో పెండ్లికన్న ఎక్కువ వైభవంగా జరుపుతారు), గర్భాదానం, సూడిదలు, బారసాల, పిల్లను తొట్లోవేయడం, పిల్లవాని ప్రతి చేష్టకు మురిసిపోతూ ప్రతి దశకూ పేరంటాలు, పుట్టినరోజులు, అన్నప్రాశన, అక్షరాభ్యాసం లాంటి వేడుకలు ఆమె మాతృత్వగమ్యాన్ని, ఆశ్యాన్ని అనుక్షణం గుర్తుచేస్తూవుంటాయి.

స్త్రీని కేవలం భోగ్యవస్తువుగా, తన పిల్లలకు తల్లిగా భర్త చూడటం ఎందుకు తటస్థించింది అని ఆలోచిస్తే వేదకాలంనుండి వ్యక్తిగత ఆస్తివరకు అధ్యయనం చేయాలి మొదటినుండీ కుటుంబంలో ఆమె స్థానం ఇంతేనా? దీనికి జవాబు అన్వేషించాలంటే పెండ్లియొక్క పుట్టుపూర్వోత్తరాలను తడివి చూడాలి. పరిణామవాదం. జంతు వారసత్వం మొదట్లో వావివరుసలు లేని కలయికలు, గుంపు పెళ్ళిళ్లు, జంట కాపురాలు, తరువాత తరాల కలయిక పనికిరాదని నిషేధం కూతుళ్ళను, చెల్లెళ్ళను పెండ్లాడరాదనే నిషేధాలు వచ్చాయి ఆ తరువాత బహుభార్యాత్వం, బహుభర్తృత్వం కొన్ని సమాజాలలో మొదటిది కొన్ని సమాజాలలో రెండవది. షా సిద్ధాంతము - జనాభా ప్రాతిపదికమీద ఆధారపడి స్త్రీల సంఖ్య తక్కువ ఉంటే బహు భర్తృత్వం, స్త్రీల సంఖ్య అధికమయితే బహుభార్యాత్వం అమల్లో వుండేది. ఆ నాటి స్థితిగతులు, భావజాలము వీటి సంబంధాలు తెలియపర్చుట మన ధర్మం బెంగాలులో కులీన వివాహాల చరిత్ర పరిశీలిస్తే 80 ఏళ్ళ కులీనునికి ఛటర్జీ, ముఖర్జీ, మహామహోపాధ్యాయ కుటుంబాలలో పురుషునికి పదిమంది బాలికలను కట్టపెట్టటం భావజాల ప్రభావమా లేక కేవలం జనాభా అంటే స్త్రీల జనాభా ఎక్కువ అవటం వలననా అనేవి ఆలోచనీయాంశాలు. ఏదేమయినా చివరకు అంటే ఈ నాటికీ ఏకపత్నీత్వము, ఏకపతిత్వం ఆచరణ యోగ్యమయినాయి. ఒకనాటి జమీందారీ వ్యవస్థలో భూస్వామ్య సంస్కృతిలో ఉంపుడుగత్తె ఉండటం హోదాగా పరిణమించింది. ఉత్తమ భార్యలు ఆ పరిస్థితికి అలవాటుపడిపోయారు. భర్తలకు అదొక హోదా అయింది. పిల్లలనుమాత్రం భార్యల ద్వారా కని వంశాభివృద్ధి చేయటం, సానులతో సంసారసుఖాలు అనుభవించటం గొప్ప, నాగరికతగా భావించేవారు. ఉదారవాద ప్రభావం (Liberalism) పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో ఇంతమంది స్త్రీలను పోషించగల ఆర్థిక వ్యవస్థ పురుషునికి లేకుండా పోయింది. ఏకపత్నీత్వానికి దోహదంచేసిన అంశాలలో ఇది ముఖ్యమైన దశగా పేర్కొనవచ్చు. ఈ సందర్భంగా దాంపత్య వ్యవస్థ, కుటుంబ వ్యవస్థలగురించి విశ్లేషించటం అవసరం. ఒకనాడు సమిష్టి కుటుంబాలు సర్వసామాన్యంగా అమల్లో వుండేవి. భూమిని అందరూ కలిసి అమరకం చేసుకునే కాలంలో అంటే ముఖ్యంగా వ్యవసాయ దశలో వుండేది. సమిష్టి అంటే రక్తసంబంధీకులు అంతా కలిసివుండటం, ఇది మన దేశం, చైనా, జపానులలో ఉంది. కుటుంబమే చిన్న గూడెం లేక పాలెంగా ఎంచవచ్చు. తరువాత తల్లిదండ్రులు, కుమారులు, కోడండ్రు, అవివాహిత కుమార్తెలు, మనుమలు, మనుమరాండ్రు.

భూస్వామ్య వ్యవస్థలో తరువాత అవి కుటుంబాలుగా మార్పుచెందాయి. వాటిలో కేవలం భార్యా, భర్తా, వారి సంతానం మాత్రమే వుంటారు. ఇందులో స్త్రీల పాత్ర ఇంటి ఇంట్లో సేవా కార్యక్రమాలు, పొలంలో పని, పిల్లలను కనడం, పెంచడం, కుటుంబపు పరిమాణం ఎలా ఉన్నాసరే ఇవే స్త్రీల కర్తవ్యాలు అయినాయి ఆనాటికీ, ఈనాటికీ స్త్రీకి ఇంటిపని, పురుషునికి బైటతిరిగి సంపాదించే పని చేయడం ఆచారమయింది. ఇవే తరువాత పని విభజన పేరుతో స్వీకరించబడ్డాయి స్త్రీకి మొదటి నుంచీ గృహ సంబంధమైన కార్యకలాపాలేనా? ఏనాడైనా ఆమె పురుషునితో సమ దీటుగా వ్యవహరించగలిగిందా? అనేదొక ప్రశ్న వుంది

వేటాడే దశ - ఇరువురు కలిసి వేటకువెళ్ళే దశలో స్త్రీయే సాహసం ప్రదర్శించేది మానవ శాస్త్రజ్ఞుల కథనం జంతువు లో ఆడసింహం ముందుగా బలిపశువు మీదికి లంఘిస్తుందట అలాగే ఆడపులి కూడాను. అడవుల్లో కాయగూరలను, పండుఫలాలను ఏరుకొని తినేరోజుల్లో స్త్రీయే ఆహార సంపాదన చేసేదట.

## పశుపాలన దశ

ఈ దశలో స్త్రీలు మచ్చిక పశువులకు పాలు పితకటం, మేత వేయటం వగైరా విధులు నిర్వహించేవారు అనేదానికి ఉదాహరణలు చాలా వున్నాయి. వేద కాలంలో కోడలును పెండ్లినాడు పశుగణానికి పెత్తందారిణిగా వర్ణించే మంత్రాలు అనేకం వున్నాయి కాకపోతే యుద్ధాలకు మాత్రం ఎక్కువగా పురుషులు వెళ్ళేవారు. ఆది ఆర్యుల పద్ధతి-అనార్యులలో స్త్రీలు యుద్ధాలలో కూడా పాల్గొనేవారు శూర్పణఖ, లంఖిణి వగైరాలు ఆ తెగకు చెందినవారు సుభద్ర తేరు గడపంగా నేర్చె అనే పద్యం చదివాము కూడా. యాదవ కులసంజాత ఆమె. కృష్ణునికి, బలరామునికి చెల్లెలు వారు అనార్యులుగా పరిగణింపబడ్డారు. విత్తనాలను వెదజల్లి పైరులు పెంచే దశలో స్త్రీ బాధ్యత పెరిగింది. ఈ రకపు వ్యవసాయంలో స్త్రీ పురుషులు భాగస్వాములుగా పొలంలో పనిచేసేవారు.

## నాగలి వ్యవసాయం

ఆ రోజుల్లో స్త్రీలు నాగలి కురును ఒత్తిపెట్టి పొలాన్ని దున్నవలసి వచ్చింది. గర్భం ముదిరిన నేలల్లో, ప్రసవమయిన మూడు, నాలుగు మాసాలలో పిల్లలకు ఆమె పాలిచ్చే కాలంలో ఆమెకు ఈపని చెప్పడం న్యాయం అనిపించలేదేమో భర్తకు, తండ్రికి, మామకు, కుమారునకు. అందువల్ల ఆమెను ఇంట్లో విశ్రాంతి తీసుకోమన్నార

అలాకాక ఆమెకు ఆమే విశ్రాంతిని ఆశించిందేమో? అనే భావం కూడా లేకపోలేదు. ఏదైనా అంతా ఊహమీదనే ఆధారపడాలి. దానిని గురించి చరిత్రగా రికార్డు లేదు ఫలితం మాత్రం సత్యం. ఆమె ఇల్లాలుగా మారింది, గృహలక్ష్మి అయింది గృహరాణి, మాతృదేవత అనే టైటిల్సు మాత్రం ఇచ్చి పూర్తిగా కుటుంబానికి అంకితం చేశారు. అంతేకాదు తను పొలంలో ఉంటే ఇంట్లో తన భార్య నడవడిని గురించి పురుషునికి అనుమానం వచ్చింది దానితో పరపురుషుని చూడరాదు. మాట్లాడరాదు, తలుపు చాటునుండి జవాబు చెప్పాలి! అని శాసించడంవల్ల జనానా, మర్దానా అని ఇంటిలో విభాగాలు, పద్ధతి అవతరించాయి ఇదంతా స్త్రీ పురుష శారీరక నిర్మాణపు తేడాలను బట్టి పని విభజనగా వచ్చిందంటాడు ఏంగెల్సు ఇది ఎంతవరకు సత్యం? అనేది నిజమయిన చర్చనీయాంశం కాకపోదు కేవలం శరీరక నిర్మాణంపై ఆధారపడి ఇది జరిగిందా లేక ఆ కాలపు భావజాల సౌధం ప్రభావంవల్ల ఇలా జరిగిందా? ఇది ఆలోచనీయాంశం కూడాను పురుషుని భావాల పస ప్రభావం పని చేయలేదా? నిజంగా స్త్రీలు గర్భధారణ సమయంలో ప్రసవానంతరం అంత దుర్బలులుగా ఉంటారా? వడియ రాజస్త్రీలు, వడ్డెరలు, మట్టిపనిచేసే స్త్రీల దేహదార్ఢ్యత మెండు. ప్రసవించే వరకు పనిచేస్తారు తరువాతకూడా పనిచేస్తారు. మధ్యతరగతి స్త్రీలలో కూడా ప్రసవానంతరం 3,4 రోజులు కాగానే మామూలుగా పని పాటలు చేసే స్త్రీలు ఉన్నారు.

## ఈ వాదంయొక్క పసెంత

ఏదయినా స్త్రీ ఇంటిలోకి నెట్టబడింది. కాగా పొలం పనిచేయనిదే కష్టజీవుల కడుపు నిండదు అందుచేత భార్యాభర్తలు పొలంలో పనిచేస్తారు. కాని పని స్వభావాన్ని బట్టి ఇద్దరూ ఒకే పొలంలో ఒకేచోట చేయడానికి వీలుపడదు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలలో మగకూలీలు ఒక చోట, ఆడ కూలీలు ఒకచోట. తన సమక్షంలో భార్య పనిచేసే పరిస్థితి లేదు. అయినా పర్యవేక్షణ అతనిదే. ఆమె ప్రతి చర్యపైనా అతనిదే పెత్తనం పట్టణాభివృద్ధి-కార్ఖానాలో పనులు, పట్టణాలు పెరిగాయి. అర్ధ బానిసత్వం నుండి రైతులు విడిపడి పట్టణాలకు శ్రామికులుగా వచ్చారు వారి స్త్రీలు కూడా వారితోపాటు వచ్చారు. కొన్ని దేశాలలో ఈ నాటికీ ఆఫ్రికాలో స్త్రీలు గ్రామాలలో వుండి వ్యవసాయం చేయిస్తారు పురుషులు పట్టణాలలో కూలీలుగా పని చేస్తున్నారు-స్త్రీలు బస్తీలకు ఎగబ్రాకి దుస్తుల పరిశ్రమలో, నేత కర్మాగారాలలో



సుందరయ్య గ్రంథాలయ
A C No 70734

పనిచేయడం ప్రారంభించారు. 19వ శతాబ్దంలో స్త్రీ యొక్క కూలి పైకాన్ని భర్త 'లా' ప్రకారం వసూలు చేసుకునేవాడు. ఎంతో పోరాడి తమ కూలిని తామే దక్కించుకున్నారు పట్టణ శ్రామిక స్త్రీలు. అయినా వారసత్వంగా వారికి వచ్చింది గృహ నిర్వహణ బాధ్యత. అది ఇప్పటికీ అలాగే ఉంది. ఇదంతా వ్యవసాయ దశనాటి స్త్రీల పరిస్థితి. పారిశ్రామికాభివృద్ధి-ఫ్యాక్టరీల పెరుగుదలవల్ల స్త్రీ జీవిత విధానంలో అనేక మార్పులొచ్చాయి. పారిశ్రామికాభివృద్ధితో పాటు కార్మికుల శ్రమశక్తి దోపిడీ మరీ పెరిగింది. కాలం మారింది పరిస్థితులలో అనేక మార్పులొచ్చాయి. పోరాటాల ఫలితంగా కార్మికులు, సామాన్యప్రజలు హక్కులు తెచ్చుకున్నారు వయోజనులకు ఓటుహక్కు స్త్రీలకు ఓటుహక్కు తత్ఫలితంగా స్త్రీలకు అదనపు సౌకర్యాలు వచ్చాయి. ప్రసూతి సెలవులు, పిల్లలకు పాలివ్వడానికి కాలవ్యవధి వగైరాలు అమలులోకి వచ్చాయి. మధ్యతరగతి స్త్రీలు ఉత్పత్తి రంగంలోకి నెట్టబడ్డారు. భర్తలు నామమాత్ర వశిష్టులు అయినారు. పోషించేశక్తి కోల్పోయినారు. అయినా పురుషాధిక్యత తగ్గలేదు. స్త్రీల అదనపు ఇంటి పనిభారం తగ్గలేదు. జీతం ఆమె చేతిలోకి వచ్చినా దానిపై యాజమాన్యం పూర్తిగా భర్తదే అయింది

ఈ దశలో సోషలిస్టు దేశాలలో స్త్రీ పరిస్థితిలో ఎలాంటి మార్పులొచ్చాయి అనే విషయం గురించి ఆలోచిస్తే పని గంటలు తగ్గాయి. ఇతరత్రా స్త్రీ పురుషుల హోదాలు సమానమయినాయి. కాని ఇంటిపని అదనంగా ఆమె 8 గంటలు ప్రతి రోజూ చేయాల్సి వస్తున్నది. భర్త సినిమా చూస్తూనో, క్లబ్‌లో బాతాఖానీ కొడుతూనో, మద్యము సేవిస్తూనో లేక కళాభిరుచిని పెంపొందించుకుంటూనో కాలక్షేపం చేస్తున్నాడు. ఆమెతో కలిసి ఇంటిలో పని చేయటం జరగటంలేదు. దాంతో ఘర్షణ ప్రారంభమయింది. క్రొత్తగా జరిగే పెళ్ళిళ్ళలో నగరాలలో యాభయి శాతం, గ్రామాలలో ముప్పై శాతం విడాకులతో అంతమవుతున్నాయి. ఇది తీవ్రమయిన సమస్య. కుటుంబ అవ్యవస్థకు గోర్బచోవ్ కృంగిపోతున్నాడు. 1979లో చైనాలో కమ్యూన్ల పద్ధతి వచ్చింది. సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు పెరిగాయి. పని గంటలను బట్టి వ్యక్తులకు వేతనాలు మొదలయినాయి. దీంతో మళ్ళీ కుటుంబానికి పురుషుడు పెత్తందారుగా తయారయినాడు. స్త్రీపై విధినిషేధాలు మొదలయినాయి ఏపని ఎప్పుడు చెయ్యాలో, వంట ఎప్పుడు చెయ్యాలో, పంటలు ఎప్పుడు కోయాలో, ఎలా విక్రయించాలో నిర్ణయించే అధికారం, పెత్తనం భర్తకు దక్కాయి. దాంతో ఆమె తన అవసరాలనిమిత్తం అతనిపై ఆధారపడే స్థితికి వచ్చింది. అఖిల చైనా మహిళా

సంఘంవారు ఈ పరిస్థితిని విమర్శిస్తున్నారు. కాని ఎదిరించలేకపోతున్నారు. ఇలా కుటుంబాలలో స్త్రీలపై పురుష పెత్తనం, ఆర్థిక దోపిడీ రెండూ ఏక కాలంలోనే జరుగుతున్నాయి గుంపు వివాహాలు అంతరించిపోయి జంట దాంపత్యాలు వచ్చి సమిష్టి కుటుంబాలు వచ్చిన కాలంలో రెండు రకాల వ్యవస్థలు ఏర్పడి అమల్లోకి వచ్చాయి, అది మాతృస్వామ్యం, పితృస్వామ్యం అని విభజించవచ్చు.

తల్లి కుదురుగా కుటుంబం: ఒక తల్లి పిల్లలు ఒకచోట ఉండేవారు. కుమారుడు, కుమార్తె, కుమార్తె సంతానం ఒక ఇంటిలో ఉండేవారు. కుమారుని సంతానం కోడలు పుట్టింటిలో ఉంటారు ఆస్తి తల్లిపేర వుంటుంది కాగా ఆమె సోదరుడు ఆమె సోదరుడు ఆమె ఇంట్లో ఆమె ఆస్తికి మేనేజ్‌మెంట్ చేస్తాడు. పితృస్వామ్య వ్యవస్థలో కూతురు అత్తవారింటికి పోతుంది. ఆమె సంతానం, ఆమె, ఆమెభర్త అత్తవారి ఇంటిలో వుంటారు మామ, ఆయన లేకపోతే భర్త అన్న, లేక భర్త యజమానులుగా వుంటారు. ఇదంతా ఎందుకు చెప్పవలసి వస్తున్నదంటే ఒకనాడు గుంపుగా నివసించే రోజుల్లో మేనమామకు తనతోపాటు గుంపుతో నివసిస్తున్న మేనకోడలు (అక్క లేక చెల్లెలి కూతురు) పై లైంగిక హక్కులు వుండేవి ఇప్పటికీ ఇది చట్టపరంగా నిషేధమయినా ఆచారంగా అమల్లోవుంది ఆస్తులకొరకు, బంధుత్వంకొరకు మేనరికం, మేనమామలతో వివాహాలు జరుగుతూనే వున్నాయి. దాని చిహ్నంగా హిందూ వివాహాల్లో గంపలో కూర్చోపెట్టుకొని మేనమామ 'పెండ్లి పీటలమీదికి వధువును తెస్తాడు. బహుమతిగా ధోవతి, ఉత్తరీయం పొందుతాడు. వధువుపైన హక్కులు వదులుకున్నందుకు బదులుగా వస్త్రాలు బహుమతి పొందుతాడు.

ఇక భార్యలపై భర్తల ఆగడం: స్త్రీయొక్క ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా భర్త ఆమెను పొందుతాడు. దీనికి ఆమె కోపగించుకొని లాభంలేదు. ఆమె భర్తపై మానభంగపు కేసుపెట్టి లాభంలేదు. పెండ్లి చేసుకున్నప్పుడే ఇలాంటి దుష్ట ప్రవర్తనకు ఆమె భర్తకు లైసెన్సు ఇచ్చిందట. ఈ సందర్భంలో ఒకటి రెండు అంశాలు గమనిస్తే ఇది సత్యమని తేలుతుంది. భర్త పరాయిస్త్రీని మానభంగం చేస్తే 10 సంవత్సరాలు జైలుశిక్ష అదే నేరం కోర్టుద్వారా వేరుగా ఉండటానికి ఉత్తర్వు పొంది విడిగా ఉంటున్న భార్యపై భర్త చేస్తే రెండు సంవత్సరాలు మాత్రమే శిక్ష. దీనినిబట్టి అర్థమవుతుంది భార్యపై (ఈ రోజుల్లోకూడా) లైంగిక దౌర్జన్యం చేయడానికి భర్తకు ఎంత హక్కో! దానినే వివాహంలో, దాంపత్య జీవితంలో మానభంగం

(మారిటల్ రేప్) అన్నాడు మార్క్స్. అంటే భార్య సమ్మతిలేకుండా భర్త అనుభ వించడమన్నమాట.

భార్యా భర్తలమధ్య ప్రేమ, అనురాగం, పరస్పర గౌరవం, స్నేహం, విశ్వాసం, పరస్పర సహాయం ఉండవలసిన కుటుంబాలలో అశాంతి, ద్వేషము, విశ్వాసరాహిత్యం, ఆధిక్యత న్యూనతాభావాలు, దౌర్జన్యం, హింస నెలకొనడం విడ్డూరం కాదా! కొన్ని కుటుంబాలలో హింస బండగా వుంటుంది. మరికొన్నింటిలో హింసకు నాగరికత సంస్కృతి తొడుగులు ఉంటాయి. అది హింసగా పైకి కన్పించదు. అనుభవించే స్త్రీకి హింసగా తోచదు అది తన విధ్యుక్తధర్మమని నమ్ముతుంది ఆత్మన్యూనతా భావం స్త్రీకి అలవాటయిపోతుంది. దానికి ఆమె బాధపడక తన పురుషుని అహం కారాన్ని, ఆధిక్యతను, గర్వాన్ని, దర్పాన్ని, చివరకు దౌర్జన్యాన్ని, హింసను చూచి మురిసిపోతుంది. అది ఆదర్శ గృహిణుల లక్షణమని, పతివ్రతా ధర్మమని తన మనోవాక్కాయ కర్మలను నమ్ముతుంది

ఇది సర్వసాధారణంగా ప్రపంచం మొత్తంమీద స్త్రీల దుస్థితి ముఖ్యంగా భారతదేశ స్త్రీల పరిస్థితి. ఈ భావ పరంపర స్త్రీ పురుషులిద్దరి నరనరాలలో జీర్ణించిపోయింది. కుటుంబంలో పురుషాధిక్యతతో పురుష పరిపాలన లైంగిక దౌర్జన్యం నెలకొని ఉన్నాయి. ఈ విషయం చాలమంది స్త్రీలకు స్పృహలోకి కూడ రాదు. కనుక వాస్తవంగా కుటుంబ జీవితం ఎలా వుండాలి అనేది ముందుగా పెళ్ళికి ముందు వధూవరులు తెలుసుకోవాలి. ఒక నిర్ణయానికి రావాలి అప్పుడే వారు స్వేచ్ఛా సమానత్వాలతో స్నేహ విశ్వాసాలతో ఒకరికొకరు తోడు నీడగా ఉండి సహచరులుగా, స్నేహితులుగా, ప్రేయసీ ప్రియులుగా, భార్యా భర్తలుగా ఉండగలుగుతారు. కుటుంబం ఒక ఆర్థిక యూనిట్ కూడాను అటు కుటుంబాల రోజులివి. ఏ ఒక్కరి సంపాదనతోనూ సంసారం గడిచే రోజులు కావు ఈనాడు. కనుక ఇరువురి సంపాదనపై పెత్తనం ఎవరిది అనే సమస్య ఉత్పన్న మయినప్పుడు వస్తుంది. ఈ సమస్య ఎలా పరిష్కారం కావాలి ఇరువురి సంపాదనను జాయింటుగా బ్యాంకులో వేసుకొని కొంత డబ్బు ఇంట్లో వుంచుకొని జాయింటుగా వాడుకోవటం ఒక పద్ధతి. అంటే ఎవరికి అవసరం వచ్చినప్పుడు వారు రెండవవారి అనుమతి లేకుండా కుడా తీసుకొని ఖర్చు పెట్టుకునే స్వేచ్ఛ కలిగి ఉండ డమన్నమాట. మరో పద్ధతి ఉంది. తమ సంపాదనలో చెరికాస్త ఒక సమిష్టి డబ్బాలో పడవేసి మిగతాది ఎవరికివారు తమ పేర బ్యాంకులో దాచుకొని, డబ్బాలో

పైకం కుటుంబానికి ఎవరయినా తీసి వాడుట ఇది రెండవ పద్ధతి డబ్బాలో పైకం అయిపోతే మరల చెరికా స్త దాంట్లో వేయుట రెండవ పద్ధతి మంచిది ఉత్తరోత్తరా ఊహించకుండా భార్యా భర్తల మధ్య బేధాభిప్రాయాలు వచ్చినా ఒకరు మరియొకరిని పూర్తిగా మోసం చేయలేరు పెద్ద మొత్తములకు, ఆ మాటకు వస్తే ఏ ఒక్కరి ఆర్థిక భద్రతకు భంగం వుండదు. ఒక పరిస్థితిలో విడిపోవలసి వస్తే ఎవరిడబ్బు వారి పరమై వుంటుంది. ఇంత వివరంగా ఎందుకు చెప్పవలసివచ్చింది అంటే సంపాదించే మధ్యతరగతి భార్యలు, కూలితెచ్చే శ్రామిక భార్యలు తమ సంపాదనను భర్తల పాద పద్మాలచెంత సమర్పిస్తూ పూలకు, చీరెకు, చిన్నచిన్న సరదాలకు భర్తలను ప్రతి మాలుతూ జీవిస్తున్నారు కనుక శ్రామిక మహిళలపై దౌర్జన్యంచేసి భర్తలు వారి సంపాదనను గుంజుకుంటున్నారు మధ్యతరగతి మహిళలు బెదిరింపులు, దౌర్జన్యాలు లేకుండా ఎవరన్నా వింటే పరువుపోతుందని నోరు నొక్కుకుని లోపల కృశించి కుళ్లుతూ సంపాదన అంతా భర్త చేతిలో పోస్తున్నారు. వ్యసనాలకు లోనయి అతడు తరువాత తనను అవమానిస్తుందే భరిస్తున్నారు. ఇది కుటుంబంలో భార్యల ఆర్థిక దాస్యం మాత్రమేనని భావించరాదు. మానసిక దాస్యంకూడానని నమ్మాలి. కుమార్తెల స్థితి, తల్లుల పరిస్థితి, అత్తల గతి, కోడళ్ళ స్థితి ఇంతకన్నా మెరుగుగా లేదు. ఇలా కుటుంబంలో స్త్రీలు ఆర్థిక దాస్యానికి లోనవుతున్నారు. ఆమె తెచ్చిన కట్నంపైన, పుట్టింటి వారిచ్చిన నగలపైన, ఇతర వస్తువాహనాలపైన, స్కూటరు, కారు, ఇల్లు, పొలం వగైరాలమీద యాజమాన్యం అంతా భర్తదే. ఇది కాదనగలరా! కొన్ని సంద ర్భాలలో పరిశ్రమలు భార్య పేరుమీద పెడతారు కాని దాని ఆదాయవ్యయాలు, ఆర్థిక లాభాలు, హక్కులూ అన్నీ భర్తలకే చెందివుంటాయి భార్యలు కేవలం దిష్టి బొమ్మలుగానే మిగిలిపోతున్నారు.

ఇక కుటుంబంలో స్త్రీల అశాంతినిగురించి ఆలోచిస్తే స్త్రీలకు కేవలం శారీరక సుఖమూ, వస్తువాహనాదులు మాత్రమేకాదు కావలసినవి. ఆమెకు మానసిక ఉల్లాసం కావాలి. అది కరువయి చాలమంది స్త్రీలు హిస్టీరియాలాంటి వ్యాధులకు లోనవు తున్నారు. కొంతమంది భర్తలు భార్యలను హింసించి ఆనందించే స్వభావం కల్గి ఉంటారు. మరికొందరు ఎంత ప్రేమఉన్నా తమకు తెలియకుండానే భార్యను నసపెట్టి బాధిస్తారు. అన్నింటికన్న మిన్నగా ఆమె వ్యక్తిత్వాన్ని గౌరవించరు. ఆమెను తన కోరికలకు అనుగుణంగా, తమ అభీష్టానుసారం జీవించమంటారు. అది అసంభవం. వారు నిజానికి ఇద్దరు వ్యక్తులు. ఎవరి ఆలోచనలు వారివి. ఎవరి ఇష్టాయిష్టాలు

వారివి వారికి వేరువేరు అభిరుచులు ఉండవచ్చును ప్రత్యేకాభిమానాలు ఉండవచ్చును. మూసపోసినట్లు ఇద్దరికీ ఒకే మనస్తత్వం ఉండదు కదా! ఉంటే సమిష్టి జీవితం దుర్భరమవుతుంది కూడా. అలాంటప్పుడు భర్త తనమాట నెగ్గాలని ప్రతి విషయం లోనూ - చిన్న విషయాల్లోకూడా - పట్టుపట్టినప్పుడు ఆ స్త్రీ మనస్సులో తుఫానులు చెలరేగుతాయి. అలా ఆమె అశాంతికి లోనవుతుంది.

పెండ్లితో స్త్రీకి స్వేచ్ఛ నశిస్తుందని కొందరి వాదన నిజానికి పరమయం అంటూ దేనికీలేదు. అనిబద్ధమైన స్వేచ్ఛ, అపరిమితమైన స్వేచ్ఛ ఉండదు ఇద్దరు వ్యక్తులు కలిసి ఉంటూ జీవిస్తుంటే వారు ఏకలింగ జాతులవారైనా - ఘర్షణ తప్పదు ఇద్దరూ సర్దుకొని జీవించాల్సి వుంటుంది. కనుక స్వేచ్ఛ ఇద్దరికీ తగ్గుతుందన్నమాట. అయితే బంధంలోనే సుఖం కాగా ఆ బంధాన్ని ఇరువురూ ఆహ్వానించే స్థితి ఉండాలి ఒకరు వేరొకరిని బంధిస్తే అది అశాంతికి దారితీస్తుంది. ఈ సూత్రం దాంపత్యానికి, వైవాహిక జీవితానికి రెంటికీ వర్తిస్తుంది. ఒకరి వ్యక్తిత్వాన్ని మరొకరు గౌరవిస్తూ, ఒకరి శ్రేయస్సుకోసం మరొకరు త్యాగంచేస్తూ, ఒకరి అభిరుచులను రెండవవారు సహిస్తూ ప్రేమానురాగాలతో కలిసి జీవించే స్త్రీ పురుషులు వున్నదే ఉన్నతశ్రేణి కుటుంబం.

భారతదేశంలో వివాహం లాటరీ లాంటిది ఎలాంటి వరుడు లభిస్తాడో, ఏలాంటి భార్య తన ఇంటికి వస్తుందో వారిరువురికి తెలియదు ముమ్మందుగా కలలు కంటారు. వాస్తవానుభవం వచ్చిన తరువాత కలలు చెరిగిపోతాయి. దుఃఖభాజనులు అవుతారు. బాల్య వివాహాలలో భార్య తన భర్తకు అనుకూలంగా తనను మలుచుకుంటుంది. ఆమెకు అతనితోడిదే లోకం. అతని కోరికలే తన కోరికలు, అతని అభిష్టాలే తన ఇష్టాలు. వివాహం అనేది రెండు చక్రాలబండి అనుకుంటే దానికి భార్యాభర్తలు ఇద్దరూ రెండు చక్రాలు. ప్రాచీన వివాహాలలో పెండ్లి అయిన మూడు నాలుగు ఏండ్లకుగాని భార్య అత్తింటికి కాపురానికి పొయ్యేదికాదు. ఈలోగా తన వ్యక్తిత్వాన్ని చంపుకోవ టంలో తన తల్లివద్దే పూర్తిగా శిక్షణపొందేది, ఆ బండిలో ఒక చక్రమే తిరిగేది. అది రెండో చక్రాన్ని కూడా వెంట లాక్కుపొయ్యేది. కదిలే చక్రం భర్త. లాగుకొని పోబడేది భార్య. ఏదో శాంతి వుండేది. అది స్మశానశాంతి కావచ్చును. అది పైకి శాంతిలాగా కన్పడేది. అంటే భార్య పూర్తిగా అణగి పడివుండి సర్దుకుపోవటం జరిగేది.

ఈనాటి వివాహాలు వేరు. యుక్తవయస్కులైన స్త్రీ పురుషులు వివాహమాడుతున్నారు. పెళ్ళికి ముందు వారిద్దరిమధ్య పరిచయం ఒక గంటసేపు. ఆ భేటీలో ఇద్దరూ పోజు పెట్టారు ఒకరి వ్యక్తిత్వం మరొకరికి తెలియకుండా జాగ్రత్తపడతారు. వారిరువురికివున్న సమిష్టికోరిక ఒకటే ఒకటి పెండ్లాడుదామనేదే అది ఒకరి ఇష్టాఇష్టాలు మరొకరికి తెలియవు ఒకరి అభిరుచుల విషయం మరొకరికి తెలుసుకోవడానికి అవకాశం లేదు ఒకరి ఆకాంక్షలు, ఆశలు, ఊహలు, కలలు రెండవవారికి అర్థంకావు. నిర్ణయమైన పదిరోజుల్లో పెండ్లి. తరువాత సమిష్టి జీవితం కలసి జీవించటం ఒక కళ. ఆ విషయం తెలియని నూతన భార్యాభర్తలు చాలమంది ఘర్షణ పడనారంభిస్తారు. కొంతమంది సర్దుకుంటాడు కాగా మరికొందరు తగాదాలను పెంచుకొని విడిపోతారు. ఏదయినా భర్తకు అనుకూలంగా సర్దుకుపొమ్మని అత్తవారి ఇంటికి పొయ్యేటప్పుడు కూతురికి తల్లిచెప్పే సలహా మంచిదిగానే కన్పడుతుంది. కాని జీవితంలో ఎప్పుడూ సర్దుకుపొయ్యేది స్త్రీయేనా? అలా స్త్రీలు ఆజన్మాంతం లొంగివుండటం వ్యక్తిత్వాన్ని చంపుకోవడం, అదే తమ కర్తవ్యంగా శీలసంపదగా భావించడం తరతరాలుగా స్త్రీపట్ల జరుగుతోంది. ఈ పరిస్థితిని సమాజం హర్షిస్తోంది. కుటుంబం-సంతానం, ఇంటిపని భార్య తనకు ఎంతమంది సంతానాన్ని కని ఇవ్వాలో, ఎలాంటి సంతానం అక్కరలేదో నిర్ణయించేది భర్త. నవమాసాలు మోసి పెంచే స్త్రీకి తన దేహంమీద తనకు హక్కులేదు. అందరూ ఆడపిల్లలు పుట్టున్నారు, మగపిల్లాడు పుట్టేదాకా కనాలని భర్త శాసిస్తే భార్య ఆజ్ఞ శిరసావహించాల్సిందే. కుమారునిగా ఏదవ సంతానంగానయినా కనవలసిందే. అసలు ఆడపిల్లలు కలగటానికి తను కారణభూతుడని తెలియని పురుషుడు తన భార్యను నిందిస్తాడు. ఆమెను సూటిపోటి మాటలతో బాధిస్తాడు. తన శరీరధర్మంవలన తన భార్యకు పిల్లలు పుట్టటంలేదని తెలియని భర్త భార్యను గొడ్రాలువని చీదరించుకుంటాడు. పూర్వకాలంలో మరో స్త్రీని వివాహ మాడేవాడు. ఇలా ఎన్నోరకాలుగా ఆమె బాధలకు లోనవుతున్నది ఈనాడుకూడా.

సంతానాన్ని పెంచడంలో తేడా చూపేది ఎవరు? అని ప్రశ్నిస్తే సమాజంలో పురుషాధిక్యత ఉండటంతో, పురుషాధిక్యతా సమాజపు విలువలవలన లిన స్వాంతం చేసుకున్నందవల్ల గృహిణి కుమార్తెలను తక్కువగాను, కుమారులను అధికులుగానూ పెంచుతుంది. స్త్రీ జాతికి అజ్ఞాతంగా తనే ద్రోహం చేస్తున్నది.

కోడళ్ళపై అత్తల అదుపు: పురుషాధిపత్య సమాజపు భావాలను జీర్ణించుకున్న అమ్మమ్మలు, నానమ్మలు, అత్తలు, అమ్మలు తమ కూతుళ్ళకు, కోడళ్ళకూ వాటిని

నూరిపోస్తారు. అంతటితో ఆగక పురుషులకు అనుకూలంగా పురుషాధిపత్యాన్ని గుర్తించి, పెంచే ఆచారాలను, సంప్రదాయాలను తాము ఆచరించడమేకాక వాటిని ఆచరించమని తరువాత తరాన్ని ఆజ్ఞాపిస్తారు, సలహా ఇస్తారు, నచ్చచెప్తారు; అవసర మైతే బెదిరిస్తారు. వారూ నిజానికి పురుషాధిపత్య సమాజంలో ఖైదీలే. వారి కుమా ర్తెలూ, కోడళ్ళూ ఖైదీలే కాగా పాతతరం స్త్రీలు ఖైదీ వార్డన్లు. అందుకనే కోడలిని అదుపులో పెట్టలేకపోయిన స్త్రీని కోడలు వినేటట్లు మామ నిందిస్తాడు. అది అర్థంకాని స్త్రీ పురుషు లిద్దరూ ఇంతా అత్తవల్లే జరుగుతోందని స్త్రీకి స్త్రీయే శత్రువని స్త్రీలను నిందిస్తున్నారు.

సామాజిక రంగం గురించి ఆలోచిస్తే ఉత్పత్తి రంగంలో ప్రధాన ఉత్పత్తి శక్తులుగా పనిచేసే మనుష్యులను ఉత్పత్తి ఫలితాలను దూరంగా ఉంచుతారు. ఇది ప్రతి వస్తువులోనూ జరిగేపనే బానిస సమాజంలో బానిసలను సామాజిక వ్యవహారాలకు హాజరనీయలేదు. అలాగే భూస్వామ్య సమాజంలో అర్థ బానిసలయిన రైతులను సామా జిక వ్యవహారాలపై పెత్తనం చేయనీయలేదు అదేవిధంగా పెట్టుబడిదారీ విధానంలో కార్మికులకు తాము ఉత్పత్తిచేసిన వస్తువు వినియోగంపై మార్పిడిపై అదుపులేదు. అలాగే కుటుంబంలో స్త్రీ ఎంత శ్రమచేసినా ఆమె పతి పాదదాసి మాత్రమే. పతి దేవుడు ముఖ్య నిర్ణయాలను చేస్తాడు. కాకపోతే అనవసర నిర్ణయాలను, తనకు నష్ట దాయకంకాని తీర్పులను ఆమెను చేయనిస్తాడు. అదేదో ప్రేమ ఫలితమని, తన పతి ఔదార్యమని, ఉదాత్త గుణ ప్రదర్శనయని ఆమె మురిసిపోయి మరింత పట్టుదలగా చాకిరీ చేస్తుంది. ఇదంతా అతగాడి ఎత్తుగడ అని ఆమె గ్రహించలేదు. బుద్ధిపూర్వ కంగా కన్నులు మూసుకుంటున్నది. మెదడు అతనికి వ్యతిరేకంగా పనిచేయదు. అతని ఎత్తులను, జిత్తులను గమనించదు. అదీ సాధ్వీమణి గొప్పతనం కుటుంబంలో జరిగే పెత్తందారీతనమే సమాజంలో మరొరూపంలో వెలుస్తుంది అంటే సామాజికరంగంలో స్త్రీకి పురుషునితోపాటు సమాన హోదా, ప్రతిపత్తి ఉండవు దీనికితోడు మతాలు అగ్నికి వాయువువలె తోడ్పడతాయి. ఎక్కువమంది మత ప్రవక్తలు పురుషులు. వారికి స్త్రీలసమస్యలు అంతుపట్టడంలేదు. అంతుపట్టించుకోదలచలేదు వారు. మొదట్లో పురుషజాతి స్త్రీలను విస్మయంతో చూచింది కదా! ఆమెకు సంతాన యోగ్యత, శక్తి ఎలా వచ్చిందో తెలియక తికమక పడ్డాడు కదా! ఆమెను ఆరాధించాడు కదా! అలాగే పుట్టింది శాక్తేయం. శక్తి ఆరాధనద్వారా తనకు శక్తి కల్గుతుందని ఆశించాడు పురుషుడు. విషయాలు తెలియడం మొదలయింది. తన సంపర్కం లేనిది ఆమె

గర్భవతి కాలేదని గ్రహించిన పురుషుడు తన గొప్పతనాన్ని చూచి గర్వించసాగాడు. అహంకార ప్రదర్శన సాగించి. స్త్రీ పురుష అవయవ నిర్మాణంలోని లోటుపాటులను గ్రహించాడు. తన ఆధిక్యతను ఆ రంగంలో స్థిరపరుచుకున్నాడు పురుషుడు. స్త్రీని మానభంగం చేయగలడు కాని స్త్రీ పురుషుని మానభంగం చేయలేదనే సత్యాన్ని వెలికి తీసాడు. ఇలా తన ఆధిక్యతకు మరో కారణం అతనికి కన్పించదు.

స్త్రీని సమాజంలో వెనుకకు నెట్టారు పురుషులు. గ్రామ పంచాయతీ, నగర, దేశ సామ్రాజ్య పరిపాలనలో వారిని పాల్గొననీయలేదు. స్త్రీలను ప్రేక్షకులుగా, శ్రోతలుగా చేశారు. చివరకు సంగీత నృత్యాది లలిత కళలలో సైతం వారిని దరిజేరనీయలేదు చాలాకాల తరువాత దైవపరమైన కార్యకలాపాలు, ఇహపరమైన కార్యకలాపాలు అని రెండు రకాలుగా విభజించి లౌకిక కార్యకలాపాలో జావళీలు మొదలయినవి. పాడి, ఆడి తమకు శృంగార భావోద్దీపన కలుగజేయడానికి వాడుకున్నారు. అయినా స్త్రీలను సమాజంలో పంక్తి బాహ్యులుగానే చూచారు. నాటి కాలంలో స్త్రీ పాత్రలను పురుషులు చాలా కాలం ధరించటమే అందుకు నిదర్శనం

ఎంతసేపూ వేదకాలపు సంస్కృతిని పొగడడం కన్పిస్తుంది. ఆ కాలంలో స్త్రీ పురుషుల సహ విద్య, తన జీవిత భాగస్వామిని తను ఎంపిక చేసుకోటానికి హక్కు, కొంత సంచార స్వాతంత్ర్యం మహిళలకు ఉండేవి నిజమే కొందరు స్త్రీలు విదుషీ మణులుగా, కవులుగా, ఋషులుగా ఉండేవారు. తాత్విక విషయాలపై పురుషునితో సమదీటుగా వాదించగల్గిన గార్గి, మైత్రేయులు ఉన్నట్లు వ్రాస్తున్నారు. అయితే మైత్రేయి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రశ్నించవద్దు అని ఆపుచేసిన యాజ్ఞవల్క్యుని కథ మనకు తెలుసు ఎంత వరకు విద్యా సాంస్కృతిక రంగాలలో ఆమెకు స్థానం ఇవ్వడం, కుటుంబంలో ఇల్లాలుగా హోదా ఇవ్వడం జరిగిందో అంత వరకే ఆమెకు ప్రమేయం కల్పించారు. కాలక్రమేణా వాటికి కూడా స్త్రీని దూరం చేశారు ఆమె విద్యను, పాండిత్యాన్ని, సామాజికంగా ప్రదర్శించటానికి అంగీకరించలేదు పురుష ప్రపంచం రాజవంశీకుల వద్ద చలామణి అయ్యే స్త్రీలు కొంతమంది రాజుల వద్ద తమకున్న పలుకుబడి వాడి తమ విద్వత్తును, పాండిత్యాన్ని పదిమంది ఎదుట ప్రదర్శించగలిగారు రంగాజమ్మలాంటివారు. ఇవి సర్వసామాన్య నియమాలకు మినహాయింపులు. వీటిని ఉదాహరణలుగా పేర్కొని స్త్రీలకు సామాజిక రంగంలో

సముచిత స్థానం ఉందని వాదించటం సబబు కాదు. సభలు సమావేశాలలో పురుషు దే అగ్రస్థానం. పంచాయితీలలో న్యాయనిర్ణయ సభలలో వారిదే పైచేయి. పాండిత్య ప్రతిభ ప్రదర్శించే సమయాలలో వారికే పెద్దపీట. రాజ్య పరిపాలనా వ్యవహారాలలో వారిదే హక్కు. ఒక కామసాని, ఒక రుద్రమదేవి, ఝాన్సీ రాణి, ఒక చాంద్‌బీబీ, చరిత్రలో పరిపాలకులుగా పేర్కొనబడినంత మాత్రాన స్త్రీలకు పరిపాలనా హక్కు ఉందనుకోవటం హాస్యాస్పదం అందులో రుద్రమదేవి తప్ప అందరూ తమ సంతానపు సంరక్షకులుగా మాత్రమే రాజ్యాధికారం చలాయించారు రుద్రమదేవికూడా పురుష వేషంలో పరిపాలన సాగించవలసి వచ్చింది. అవి ఆ రోజుల భావనా పటిమకు దృష్టాంతం. ఈనాడు స్త్రీల ప్రతిభా సంపదను పొగిడేవారే తమకు తెలిసిన ప్రతిభా సమన్విత స్త్రీలను రాజకీయాలలోకి రానీయరు. వచ్చినా గౌరవించరు. గౌరవించినా మెచ్చరు; ప్రోత్సహించరు ఇదీ ఈనాటి పురుష ప్రాధాన్యపు సమాజం

ఇప్పటికీ కొన్ని ముస్లిం దేశాలలో రేడియోలో స్త్రీల పాటలు రానివ్వటం లేదు దూరదర్శన్‌లో స్త్రీలముఖాలను చూడనీయటం లేదు. ఇరాన్‌లో మరలా బుర్ఖా సాంప్రదాయాన్ని నెలకొల్పాలని ప్రయత్నాలు సాగుతున్నాయి. వారిని ఇళ్ళలోకి నెట్టాని తీవ్ర కృషి కొనసాగుతున్నది. ఇదంతా స్త్రీల మాన రక్షణకని చెప్తారు వారి గౌరవ మర్యాదలకు భంగం కలిగించేదెవ్వరు పురుషులేకదా! అట్టి పురుషులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలిచ్చి, రక్షణను కావాల్సిన వారిని బందీలుగా చేయటం న్యాయమా? ఈనాటి కొందరు పోలీసు అఫీసర్ల చర్యలు గుర్తుకు వస్తున్నాయి దుర్మార్గుని ఆగడాలు ఆపలేక రక్షణ కోరినవారిని జైళ్ళలో బంధించినట్లున్నది ఈ ప్రవర్తన.

మరో అంశం గమనార్హం. పాటకపు స్త్రీలకు లేని ఘోషా, పైతరగతులని చెప్పబడేవారి స్త్రీలకు ఉంటున్నది. ఉచ్చనీచాలు ఆర్థికశక్తి సంపదలో ఒక పురుషుడు తన భార్యను ఇద్దరూ కష్టజీవులుగా ఉన్నప్పుడు ఇంటి వెలుపల వీధుల్లో బజార్లలో, ఉత్సవాలలో తిరగనిస్తాడు. కాని అదే పురుషుడు పెద్ద భూస్వామి అయినా, ధనవంతుడయినా ఆమె సంచార స్వాతంత్ర్యంపై సామాజిక ఆంక్షలు విధిస్తాడు. స్త్రీ యొక్క మాన మర్యాదలను సంపదతో తూకం వేస్తారు. ఈ ప్రవృత్తి భూస్వామ్య వ్యవస్థలో కొట్టవచ్చినట్లు కన్పడుతున్నది. వేర్పాటు, పరదా స్త్రీ యొక్క సామాజిక హోదాకు గొడ్డలి పెట్లు. ఉన్నతోద్యోగాలు చేసే ముసల్మాను స్త్రీలు, విద్యావంతులైన ముస్లిం

స్త్రీలు ఏదో రకంగా ఈ పరదా పద్ధతిని అనుసరించటం గమనిస్తున్నాం. ఒకవేళ తాము అనుసరించకపోయినా అది చాలా మంచి పద్ధతి అని వాదించటం మనకు పరిచయమైన విషయమే. ఆర్థిక పరిస్థితులు మారినంత మాత్రాన యాంత్రికంగా వాటంతట అవే సామాజిక సాంప్రదాయాలుమారిపోతాయా? అలామారవు. భావజాలము ఒక సారి ఉద్భవించిన తరవాత స్వతంత్ర్య ప్రతిపత్తితో మనుగడ సాగిస్తుందని, దానికాధారమయిన ఆర్థిక వ్యవస్థ మారినా భావజాల ప్రభావం పోదని పాత భావాల స్థానే క్రొత్త భావాలకు ఉనికి కల్పించడానికి పోరాటం సాగించాలి అని కొందరి అభిప్రాయం దీని తర్కరీత్యా, అనుభవరీత్యా తరచిచూడటం ఆవశ్యకర్తవ్యం.

స్త్రీల వ్యక్తిత్వ వికాసానికి అడ్డు వచ్చే సామాజిక సంప్రదాయాలను, రీతులను, అలవాట్లను నిరసించి వాటిపై తీవ్రమయిన ఏహ్య భావం కలిగించి వాటికి బదులుగా నూతనమయిన, జవసత్వాలు కల భావాలను విధానాలను నెలకొల్పటం అత్యంత శీఘ్రంగా జరగాల్సిన పని.

ఈ నాటి స్త్రీకి కొన్ని హక్కులు ప్రసాదించింది భారత రాజ్యాంగం విద్యా ఉద్యోగాలలో కొంత అవకాశం లభించింది నాల్లుగోడలు దాటి బైటి ప్రపంచాన్ని తిలకిస్తోంది. ఆటల్లో పోటీ పడుతోంది. విమానాలు నడుపుతోంది, చంద్రలోకయానం చేసి వచ్చింది జడ్జిలుగా, లాయర్లుగా ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, 'మెరిట్' నిలుపుకుంటోంది "యూనివర్సిటీ రేంకులన్నీ" స్త్రీల పరమవుతున్నాయి. గొప్పగొప్ప సైంటిస్టులుగా పురోగమిస్తున్నారు క్రీడా రంగంలో శక్తియుక్తులను ప్రదర్శిస్తున్నారు. అద్భుతమైన నటనా సామర్థ్యాన్ని చూపి ప్రేక్షకులను అలరింపజేస్తున్నారు. ఒకటేమిటి స్త్రీ చేయలేని పనిలేదు. పురుషునితోపాటు పోటీగా అన్ని రంగాల్లో రాణిస్తోంది. పురుషుడికన్నా మిన్నగా అద్భుతమైన చాకచక్యాన్ని చూపిస్తోంది అంతే బిడ్డల్ని కనడం స్త్రీకి మాత్రమే సాధ్యం ఇటు పిల్లల సంరక్షణా, అటు ఇంటి బాధ్యతా, పైన ఉద్యోగ నిర్వహణ ఇలా మూడురంగాల్లో విధీవిరామం లేకుండా శ్రమించేది ఎవరంటే స్త్రీ అని ఒప్పుకోక తప్పదు. పురుషుడికి ఒక్క సంపాదన తప్ప బాధ్యతలేవు. ఆమె అలాకాదు షాపింగు, 'బ్యాంకింగు', రేషను, పిల్లలకు హోమ్ వర్కు, చుట్ట పక్కాలకు ఆశ్రయం అలా అష్టావధానం, శతావదానాలతో ఉక్కిరి బిక్కిరై సంసార సముద్రాన్ని అవలీలగా ఈదుతోంది. ఇదంతా ఈ యుగపు చరిత్ర.

అయితే ఇదంతా స్త్రీకి అభ్యుదయమా? ఆమె పురుషునితో సమానంగా హక్కులు అనుభవిస్తోందా? సమాన హోదాతో జీవిస్తోందా? ఆమెకు స్వేచ్ఛ వుందా? సమానత్వం వుందా? ఇద్దరి మధ్యా హెచ్చుతగ్గులు తేడాలు వున్నాయా? లేవా అని ప్రశ్నించినప్పుడు ఆమె హాయిగా, సుఖంగా, నీడని విశ్రమిస్తుందా, బాధలు, బాధ్యతలు లేనివారెవరంటే మన మహిళలేనని అంటూ వుంటారు. ఇదొక మహిళా భాగవతమని చెప్పుకోవచ్చు కారణం ఈనాటి మహిళ వేషభాషలు మారాయి ఉన్నత విద్య అభ్యసిస్తోంది. వంట పనిముట్ల రూపాలు మారాయి. బొగ్గులు పిడకలు, కట్టెలు పోయి కరెంటు, గ్యాసు, ఎలక్ట్రానిక్సు పరికరాలు వచ్చి సుఖపడటానికి కారణభూతాలయినాయి. తరం మారింది. పరిస్థితుల్లో మార్పులొచ్చాయి, విలువలు మారుతున్నాయి. మార్పు అతి వేగంగా పయనిస్తోంది. ఇదంతా చూస్తుంటే విలువల విప్లవమా అనిపిస్తుంది ఇక్కడే వుందొక తిరకాసు. అదే 'మేడి పండు చూడ మేలిమై యుండు' అన్నట్లుంది నేటి స్త్రీ జీవితం. పెనం మీద నుంచి పొయిలో పడ్డట్లు వుంటుంది ఆమె జీవిత విధానం ఇది వినటానికి హాస్యాస్పదం కావచ్చు. కాని ఈ పరిస్థితి నమ్మలేని నగ్న సత్యం.

నాగరికతగా స్త్రీ వేషభాషలు పరిసరాలు మారినా సాంస్కృతికంగా, భావాలలో మార్పులేదు. ఆనాటి బానిసత్వ పంజరం నేడు షోకేసు'గా మారింది స్త్రీ పురుష తేడాలు పోలేదు. అంతస్తులు అలాగే వున్నాయి. అబలగానే చూడబడుతోంది. ఆధారపడి జీవించే ప్రాణిగానే ఎంచబడుతోంది. అన్ని రంగాల్లోనూ రెండవ బెంచి'కి నెట్టబడింది. రుజువు కావాలంటే బోలెడన్ని ఆధారాలు వున్నాయి.

ఇక భవిష్యత్తులో స్త్రీ పాత్ర, ఆమె హోదా గమనించి చర్చించే ముందు కొన్ని ఆలోచనలు, ఊహలు మన ముందు నాట్యం చేస్తాయి. ఈనాడు సామాజికంగా, వ్యక్తి పరంగా, మానసికంగా ఎన్నో మార్పులు వస్తున్నాయి మార్పు అనివార్యం కదా; ఈ మార్పు స్త్రీల ఉనికిలోకూడా చోటు చేసుకుంది. మహిళా దశాబ్దంవల్ల సాంస్కృతిక విప్లవం వల్ల పాశ్చాత్య ప్రభావం వల్ల సాంఘిక పరిస్థితులవల్ల స్త్రీలలో అలజడి సంచలనం కలిగాయి. ముఖ్యంగా దేశ పారిశ్రామికీకరణవల్ల, ధరల పెరుగుదల వల్ల స్త్రీలు ఉద్యోగాలు చెయ్యక తప్పటంలేదు. ఈ ప్రభావాలవల్ల వారిలో కొంత ఆలోచన, స్వాభిమానం వెల్లి విరిశాయి. ఉద్వేగం పుంతలు త్రొక్కింది. మేమెందుకు గొప్ప చదువులు చదువుకోరాదు? ఉన్నతోద్యోగాలలో ఎందుకు చేరరాదు? మా భాగ

స్వాములను ఎన్నుకునే హక్కు మాకు ఎందుకుండరాదు? ఇంటి పనిలో, పిల్లల పెంపకంలో, మా భర్తలు మాకెందుకు సాయపడరాదు? ఉత్పత్తి రంగంలో మేమెందుకు తోడ్పడరాదు? ఆస్తి హక్కుల్ని మేమెందుకు అనుభవించరాదు? మా పని గంటలు లెక్కలేదు, పైగా మమ్మల్ని పోషిస్తున్నట్లు చీదరించుకుంటారు; మేము మంచాన పడ్డదాకా చాకిరి చేస్తూనేవున్నాం. పిచ్చి ఎక్కితే తప్ప మంచాన పడితే తప్ప ఏనాడు విశ్రాంతి కోరనే కోరం. మా పనికి 'రిటైర్‌మెంటు' లేదు. అంటూ ప్రశ్నించు కుంటున్నారు; బాధతో అలమటించి పోతున్నారు. ఇదంతా ఒక విధంగా అభివృద్ధికి సోపానమని గర్వపడాలి

ఇక్కడే ఒక పెద్ద వైరుధ్యం రాబోతున్నది. ఇంతవరకు అణగి వున్న ఆడది ప్రశ్నించటం, హక్కులు అడగటం మొదలైతే కుటుంబంలో అశాంతి వస్తుంది. భర్తలు ఆదిరి పడతారు, బెదిరిపోతారు. తత్ ఫలిత గా వారు పెద్ద ఎత్తున అణచటానికి ప్రయత్నిస్తారు. తమలో వికాసం కలిగిన స్త్రీలు అణగి వుండలేరు బైటికి పరిగెత్త లేరు. అప్పుడు ఇద్దరిమధ్య (కోల్డువార్) ఎడతెగని పోరాటం జరుగుతూనే వుంటుంది. హక్కులు నిలుపు కోవాలనే భర్తలు, సమానత్వం, స్వేచ్ఛ కావాలనే భార్యల మధ్య దీర్ఘకాలిక పోరాటం జరుగుతుంది. క్రమంగా అన్ని వర్గాల్లో, అన్ని జాతులకు ఇది ప్రాకుతుంది. ఈ పోరాటం సివిల్‌వార్ కంటే ప్రమాదంగా పరిణమిస్తుంది. ఎందరో త్యాగాలు చెయ్యాల్సి వస్తుంది. మరెందరో క్షతగాత్రులు కాక తప్పదు. కాని ఆ తరుణంలో మాత్రం మహిళలు వెనుకంజ వేయరు. ప్రముఖన నిలబడి విజయాన్ని సాధిస్తారు. ఇది పచ్చి నిజం. విజయ పరంపరతో వారు సాధించబోయే హక్కులు గమనార్హం.

ఈదశలో ఆడ, మగ శిశువుల పెంపకంలో తేడాలు నిర్మూలిస్తాయి. స్త్రీలలో విద్యాభివృద్ధి పెరుగుతుంది. స్త్రీలు తమ వ్యక్తిత్వ వికాసానికి ఎక్కువగా విలువ కడతారు. అన్ని ఉద్యోగాలకు వారు ఎగబ్రాకుతారు. కీలక స్థానాల్లో వారికి స్థానాలు లభిస్తాయి. స్త్రీకి వివాహం విద్యుక్తధర్మం అనే భావం బలాన్ని కోల్పోతుంది. స్త్రీ పురుషులు తమకు తాముగా ఎంచుకున్న వివాహాలు హెచ్చు స్థాయిలో జరుగుతాయి. అందువల్ల వరకట్న వివాహాలు నశిస్తాయి, వరకట్న మరణాల సంఖ్య క్షీణిస్తుంది.

సామాజిక వ్యవహారాల్లో, కుటుంబంలో స్త్రీ పురుషులిద్దరూ భాగస్వామ్యం వహిస్తారు. స్త్రీకి పురుష రక్షణ కావాలనే భావం సన్నగిల్లుతుంది శాంతి వుద్యమానికి స్త్రీలు సారధులవుతారు. మగ పిల్లల ప్రాముఖ్యత అంతరిస్తుంది. ఆడపిల్ల అయినా ఒక్క పిల్లతో సరిపెట్టుకునే మనస్తత్వం ప్రబలుతుంది.

స్త్రీ తన వ్యక్తిత్వ వికాసానికి ప్రాముఖ్యత ఇవ్వడంవల్ల సతీపతుల మధ్య సంఘర్షణకు అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల విడాకుల రేటు పెరుగుతుంది పునర్వివాహాలు సర్వ సమ్మతమవుతాయి పాతివ్రత్య భావనపోతుంది. సతీపతులు పరస్పర విశ్వాసంతో కాపురం చేయ మొదలుపెడతారు. ప్రేమలేని దాంపత్యం, దాంపత్యంలేని ప్రేమ కరువవుతాయి. నీతి అనే పదం ఇంతవరకు స్త్రీలయెడ లైంగిక నీతిగా పరిగణింప బడుతోంది, ఇక ముందు అసలైన శిసలైన శీలంపై నొక్కి పెట్టడం సంభవిస్తుంది ఈనాటి ద్వంద్వనీతి వ్యాప్తిని కోల్పోతుంది, గొడ్రాలియెడ నిరాదరణ, విధవలపై సానుభూతిలేమి నశిస్తాయి. పరిపాలనా రంగంలో, రాజకీయ వ్యవస్థలో స్త్రీలు ముందంజ వేస్తారు. ప్రసారసాధనాలు అందరికీ అందుబాటులో వుండటం వల్ల స్త్రీలలో సాంస్కృతిక ఉద్యమాలు వెలుస్తాయి; వ్యాప్తి చెందుతాయి. పారిశ్రామిక, సాంకేతిక, శాస్త్రీయ విషయాలలో స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని అంగీకరిస్తారు. ఈ ప్రయత్నంలో మూఢ విశ్వాసాలు నిర్మూలింప బడతాయి. సమాజ శ్రేయస్సుకై ఇద్దరూ కలసి పాటుపడతారు.

రాబొయ్యే శతాబ్దంలో స్త్రీవిమోచన సందర్భంగా గొప్ప ప్రగతి వుంటుంది. ఇంతకాలం జరగని మార్పు, మౌలికమైన భావాలలో పెద్ద మార్పు వస్తుంది. స్త్రీ తక్కువకాదు అనే భావ విప్లవం స్త్రీ పురుషులిద్దరిలో ప్రవేశిస్తుంది. దానికే సాంస్కృతిక విప్లవమని పేరు పెట్టవచ్చు. దానివల్ల సమాజ పరంగా, వ్యక్తి పరంగా సమూల మార్పు ఎస్తుంది. ఆనాడు శాంతి, సత్యసంశోధన, వినమ్రత, స్వేచ్ఛా పిపాస, సహనశక్తి, ప్రజా సంక్షేమాలపై మానవదృష్టి కేంద్రీకరిస్తుంది. అప్పుడు స్త్రీ శక్తి మూడు పువ్వులుగా, ఆరుకాయలుగా పరిభ్రమిస్తుంది ఆనాడే అసలయిన సహజీవనానికి నాందీప్రస్తావన జరుగుతుంది. మరి ఆరోజు కొరకయి వేచి వుందామా!

# సహజీవనం : సన్నిహితత్వం
## ( మహిళా దృక్పథం )

సహజీవనం అనే పదం బాగా ప్రచారంలోకి వచ్చింది. ప్రపంచ రాజకీయాలలో, దేశ వ్యవహారాల్లో రాష్ట్రాంతర సంబంధాల్లో, ప్రాంతీయ తత్వం ప్రబలంగా ఉన్న స్థితిగతుల్లో సహజీవనం తప్పనిసరి అనే ప్రబోధం సాగుతున్నది మహిళలు మనుష్యులేనని, మానవ హక్కులు వారికి కూడా వర్తిస్తాయని, వారు స్వాతంత్ర్యానికి అర్హులని సాటిచెప్పే మహిళోద్యమం చెలరేగే ఈ కాలంలో కొందరు పురుషులు పని కట్టుకొని సహజీవన సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్నారు. ఇంతవరకు స్మశాన శాంతి లాంటిది కుటుంబంలో నెలకొని వుండగా, మహిళల్లో వచ్చిన జాగృతి చైతన్యాల ద్వారా సంఘర్షణ తలయెత్తే సూచనలు చెలరేగాయి. దాంతో చాలామంది పురుష పుంగవులు కుటుంబంలో సహజీవనం అవసరమని ఎలుగెత్తి చాటు తున్నారు. అలాంటి పురుషుల్లో చిత్తశుద్ధి ఉండవచ్చు. కాదనలేము కాగా ఇన్ని వేల సంవత్సరాలుగా స్త్రీజాతి దాస్యం చేస్తున్నపుడు రాని మాట ఇప్పుడు ఎందుకు వచ్చినట్లు? తమ దాస్య శృంఖలాలను స్త్రీలు త్రెంచ పూనుకున్నపుడే అవసరం వచ్చిందా ఈ నినాదం? ఇది ఈనాడు స్త్రీజాతి ఆలోచనలను గందరగోళం పాలుచేసే నినాదం. కుటుంబం ప్రాంతంలో భాగం, అలాగే ప్రాంతం రాష్ట్రంలో ఇమిడియున్న ప్రదేశం. రాష్ట్రాలు దేశానికి పట్టుకొమ్మలు, దేశాలు ఎంత వేరుగా ఉన్నా ప్రపంచంలో ఇమిడి ఉన్నాయి, పైగా ప్రపంచం చాలా చిన్నదయి పోతున్నది కనుక కుటుంబంలో సహజీవన సూత్రాలు వ్రేళ్ళూనక పోతే ప్రపంచ ఐక్యతకే భంగం వాటిల్లుతుంది అని చెప్పేవారు లేక పోలేదు.

1945 నుండి ప్రపంచంలో రెండు కూటములు ఏర్పడ్డాయి. ఒకటి అమెరికా ఆధిపత్యాన్ని అంగీకరించే కూటమి. మరొకటి రష్యా పెత్తనాన్ని ఆమోదించే కూటమి. ఇరు కూటములూ అణ్వస్త్ర ఆయుధాలను ప్రోగు చేసుకున్నాయి ఎప్పుడు వారిరువురి మధ్య సంఘర్షణ తల ఎత్తుతుందో, అణుయుద్ధం వస్తుందో అని ప్రపంచ ప్రజలు తల్లడిల్లి పోయిన రోజులు ఉన్నాయి. యుద్ధం వస్తే గెలిచినవారూ, ఓడినవారూ ఇద్దరూ సర్వ నాశన మవుతారని తేలింది. దాంతో ప్రపంచ నాయకులలో విజ్ఞత వెలిసింది.

సహజీవన సూత్రానికి ప్రాముఖ్యత వచ్చింది. దేశ సామాజిక ఆర్థిక, రాజకీయ వ్యవస్థలు వేరయినా దేశ దేశాలమధ్య సహజీవనం అవశ్యకమనే ఆలోచనకు అంకురార్పణ జరిగింది. అమెరికాలో పెట్టుబడిదారీ విధానం అమలుల్లో ఉండగా రష్యాలో కమ్యూనిజం ప్రబలంగా ఉండేది. తమ విధానం గొప్పదంటే తమది గొప్పదని పోటీ పడే కాలమది. అయితే కేవలం వాదోపవాదాలతో సరిపెట్టుకోక యుద్ధానికి తలపడే పరిస్థితి ఎదురయ్యింది. సంఘర్షణ ఉభయ విధ్వాంసకమని ఇరు కూటములు గ్రహించాయి. దాంతో ప్రపంచపు మనుగడకు సహకారం అవసర మయ్యింది. ఇలా ఈ సహజీవన సూత్రం ప్రపంచ శాంతిని కాపాడగల్గింది.

భారత దేశానికి వస్తే లౌకిక రాజ్యభావన నుండి ఈ సహజీవన సూత్రం బలం పుంజుకున్నదనే విషయాన్ని గ్రహించక తప్పదు. భారతదేశంలో పలు మతాల వారు ఒకరి సరసన మరొకరు నివసిస్తున్నారు. హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, పార్శీలు ఇలా జీవయాత్ర సాగిస్తున్నారు. హిందువులలోనే పలు శాఖలవారు కలసి ఉండక తప్పటంలేదు. శైవులు, వైష్ణవులు, స్మార్తులు, ఆర్య సమాజికులు, బ్రహ్మసమాజికులు ఇలా ఎందరో ప్రక్క ప్రక్కన కాపురాలు చేయటం మనం చూస్తున్నదే. వీరంతా ఒకరి మీద మరొకరు కత్తులు దూయటం ప్రారంభిస్తే సమాజమే ఛిద్ధలవుతుంది. 1947లో దేశ విభజన తరువాత జనాభా బదిలీలో హిందువులు, ముస్లింలు కోటి మంది దాకా ప్రాణాలు కోల్పోయారు. ప్రపంచ చరిత్రలో కనీ విని యెరుగని మారణ కాండ సంభవించింది. దాంతో కనువిప్పు కలిగిన నాయకులు లౌకిక రాజ్య భావనను పెంపొందించారు. ఈ భావన రెండు రకాల ఆలోచనల మీద ఆధారపడింది. ఒకటి దేశ వ్యవహారాల్లో మతజోక్యం ఉండరాదని, అంటే మతం, రాజ్యం విడిపడి ఉండాలని చెప్పింది. ఒక ధోరణి అలా కాక మతానికి రాజ్యానికి వేర్పాటు అవసరం లేదని కాగా రాజ్యం సర్వమత సమభావనపై నడవాలని మరో ధోరణి. ఏది ఏమయినా మతం పేరుతో సంఘర్షణలు అనవసరమని, ప్రమాదకరమనే భావం ప్రబలమయింది. అన్ని మతాలవారు ఒకరిపై మరొకరు కత్తులు దూసి చంపుకోవటం తప్పనే ప్రచారం ముమ్మరం అయింది. ఇది సహజీవన సూత్రానికి బలం చేకూర్చింది. మధ్య మధ్య పాకిస్తాన, ఇండియాలు మూడుసార్లు యుద్ధాలు చేసినా నామమాత్రంగా నయినా ఈ సూత్రం ఉటంకించటం మానలేదు. ఇదీ ఒకందుకు మంచిదనేవారు ఉన్నారు.

దేశంలోని రాష్ట్రాలు వైశాల్యాలలో మహా పెద్దవిగా రూపొందాయి. పలు ప్రాంతాల విలీనంవల్ల ఏర్పడినాయి. చిన్న రాష్ట్రాలను మినహాయిస్తే పెద్ద రాష్ట్రాలు యూరపులో దేశాలకన్నా విస్తీర్ణంలో, జనాభాలో అధిక్యతతో ఉన్నాయి. అదీగాక ప్రతి పెద్ద రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు తక్కువగా లేవు ఈ ప్రాంతాలకు చారిత్రక, భౌగోళిక, సాంస్కృతిక వైవిధ్యాలున్నాయి. సామాజిక ఆర్థికవ్యవస్థలు భిన్నంగా ఉన్నాయి ఇటీవలగా అంటే 1956 నుండి పరిస్థితులు కొంతగా మారుతున్నా ప్రాంతీయ భేదాలు సమసి పోలేదు. అందుచేత వివిధ ప్రాంతాల మధ్య వైమనస్యాలు, అనుమానాలు, స్పర్థలు, ద్వేషాలు తలెత్తుతున్నాయి. రాష్ట్రంలో శాంతి భద్రతలను కాపాడాలంటే ప్రాంతాల మధ్య సహజీవనం అవసరమని గుర్తించడం ప్రారంభమయింది. ఈ సూత్రం చాలా సార్లు ఒక ప్రాంతపు ఆధిపత్యాన్ని పోషించేదిగా పరిణామం చెందుతున్న సందర్భాలు లేక పోలేదు. సహజీవన సూత్రం అలాంటి పెత్తందారీ తనాన్ని పోషించిన సన్నివేశాలు లేక పోలేదు. అయినా భ్రమవల్ల నయితేనేమి లేక ఆ సూత్రపు అంతర్గత బలంవల్ల నయితేనేమి సహజీవన సిద్ధాంతాన్ని ఎవరూ కాదనలేని పరిస్థితి ఏర్పడింది.

ఇలా సహజీవనం అన్ని కాలాలకు, అన్ని దేశాలకు, అన్ని ప్రాంతాలకు అన్ని తెగలకు, చివరకు అన్ని కుటుంబాలకు అవసరం అనే నినాదం యిలా పుంజుకుంది.

కుటుంబంలో సహజీవనం గురించి ముందుగా చర్చిద్దాం కుటుంబంలో అనేక మంది సభ్యులుంటారు. తల్లి, తండ్రి, కుమారులు, కుమార్తెలు, మనుమలు, మనుమరాండ్ర, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు వారి సంతానం ఉండటం కద్దు. భార్య, భర్త, కుమారులు కుమార్తెలు కలసి ఉంటే అణుకుటుంబం అనడం మామూలు. ఇందరు కలసి జీవించాలంటే ఒకటితో ఒకరు సర్దుకొని జీవించాలి. మానవాళిలో ప్రతి మనిషీ ఒక విభిన్నమైన వ్యక్తి. అతనికి లేక ఆమెకు అభిప్రాయాలు, శక్తియుక్తులు, అవకాశాలు, ఆశలు, ఆశయాలు వీటి విషయంలో ప్రత్యేకత ఉంటున్నది. ఏ వ్యక్తికి ఆ వ్యక్తియే విశిష్టతతో విలసిల్లటం సర్వసాధారణం.

వివిధ అభిప్రాయాల విషయం పరిగణనలోకి తీసుకుంటే కుటుంబ సభ్యులమధ్య వైవిధ్యం గోచరిస్తుంది. ఒకరికి తీపి తినడం ఇష్టం; మరొకరికి కారం ఇష్టం అలాగే తదితర వంటకాలు పాలు పెరుగుల ప్రసక్తి. ఒకరు పరిశుభ్రతపై పట్టుపడతారు. వేరొ

కరు అపరిపక్వతతో తేలియాడుతాయి. ఇలా ఎన్నో విషయాలను పేర్కొని వివరించవచ్చు. ప్రతి ఒక్కరూ కుటుంబం యావత్తూ తన మాటమీదే సాగాలంటే, తన ఇష్ట ప్రకారమే నడచుకోవాలంటే కుదరదు. కుటుంబంలో అశాంతి నెలకొంటుంది.

విభిన్న శక్తియుక్తులు : అంతే కుటుంబ సభ్యుల శక్తియుక్తులు కూడా వేరు వేరుగా ఉంటాయి. ఒకరికి రచనా ప్రక్రియలో ప్రవేశం, మరియొకరికి క్రీడలలో నేర్పరితనం, ఇంకొకరికి లలిత కళలలో ప్రావీణ్యత ఉంటాయి. వీరందరికి శక్తియుక్తులకు వికాసం కల్పించాలంటే కుటుంబసంపాదన, ఆదాయం చాలకపోవచ్చు అప్పుడు ఎవరికి ప్రోత్సాహం ఇవ్వాలి, ఎవరికి అండదండలు అందించాలనే ప్రశ్నలు ఉత్పన్నమవుతవి. ఒకానొకప్పుడు అవి సంఘర్షణలకు దారితీయడం కద్దు. అప్పుడు ఈర్ష్యలు, ద్వేషాలు కొట్లాటలు కూడా సంభవించవచ్చు. ఆలాంటి సమయాల్లో సహజీవన భావం అక్కరకు వస్తుంది. కుటుంబ సభ్యుల శక్తి యుక్తులలో తేడాలుండ వచ్చని గ్రహించాము. అయితే అవకాశాలకు, శక్తియుక్తులకు సంబంధం ఉండకపోవచ్చును. ఒక కుటుంబ సభ్యురాలు వీణా వాదంలో దిట్ట కావచ్చు మరొక సభ్యుడు క్రీడలలో ప్రవీణుడు కావచ్చు. అయితే అవకాశాలు వారిద్దరికి సమానంగా లభించడం జరగదు వీణా వాదంలో నేర్పరియైన కుటుంబ సభ్యురాలికి ప్రోత్సాహమూ, సంపాదనా, పేరు ప్రఖ్యాతలు తేలిగ్గా దొరకవచ్చు. అప్పుడు కుటుంబం ఏమిచేయాలి? మగవాడు కనుక అతనికి అవకాశాలు తక్కువ ఉన్నా అతని విషయమే పట్టించుకోలేని రెండవ వ్యక్తియైన స్త్రీని నిరాదరణ చేయటమా లేక ప్రప్రథమంగా - అవకాశం ఉన్నది కనుక - సాయం చేయడమా? ఇదీ కుటుంబం ఎదుర్కొనే సవాలు. ఇప్పుడే కుటుంబ సభ్యులలో విజ్ఞత కావాలి. నిష్పక్షపాతబుద్ధి ఉదయించాలి ఎవరికి అవకాశాలు ఎక్కువగా ఉంటే వారిని ప్రోత్సహించాలి. ఇరువురికీ సాయంచెయ్యగల స్తోమతు ఆ కుటుంబానికి ఉంటే ఈ ఎంపిక చేయటం అనే ప్రసక్తిరానే రాదు. కనుక ఈ సందర్భంగా సహజీవన సూత్రం పనిచేస్తుంది. కుటుంబంలోని వ్యక్తులందరికి ఒకే రకపు ఆశలు ఉండనవసరంలేదు. ఆ మాటకు వస్తే ఏ ఆశా ఉండనివారూ ఉన్నారు. అలా కాక కొందరి ఆశలు గొంతెమ్మ కోరికలు కావచ్చు. మరి కొందరి ఆశలు తతిమ్మా కుటుంబ సభ్యులకు, సమాజానికి నష్టదాయకం అయ్యేవి కావచ్చు. ఆ పరిస్థితుల్లో కుటుంబం ఏమి చేయాలనేది ప్రశ్న. కుటుంబ సభ్యుల ఆశలు ఎలా విభిన్నంగా ఉంటాయో వారి ఆశయాల విషయంగా కూడా వైవిధ్యం ఉండవచ్చు ఒకరు కళాకారిణిగా వెలుగొందాలని

ఆశిస్తే మరొకరు ఎలాగయినా సరే తన పేరు పదిమంది నోళ్ళల్లో నానాలని తలపోస్తారు. ఒకరు మానవాభ్యుదయమే తమ పరమావధిగా భావిస్తే మరొకరు తమ స్వార్థమే ప్రయోజనకరం అనే ఆలోచనకు లోనవుతారు. ఇక్కడ కూడా ఎవరికి చేయి అందించాలనే ప్రసక్తి వస్తుంది సామాజిక శ్రేయస్సును కాంక్షించే వ్యక్తికి ప్రోత్సాహమివ్వగం సభ్యత సంస్కారాలు కల కుటుంబం యొక్క విధి. ఇది కుటుంబం యొక్క నైతిక స్థాయినిబట్టి ఉంటుంది. ఏదయినా ఇది కుటుంబానికి ఒక చిక్కు ప్రశ్న. ఈ విషమ పరిస్థితిని అధిగమించటానికి కుటుంబసభ్యుల మధ్య సహజీవనభావం అవసరం.

కుటుంబం ఎందుకు ఏర్పడుతుంది · భార్య, భర్త లేకుండా కుటుంబం ఉండదు కదా! ఒక పురుషుడు, ఒక స్త్రీ ఎందుకు వివాహమాడతారు? ఎందుకు కాపురం చేయడానికి ఇష్టపడతారు? కుటుంబ జీవితాన్ని వారు ఎందుకు ఆశిస్తారు? ఆలోచిస్తే కుటుంబ స్థాపనకు అనేక కారణాలు దోహదం చేశాయని తెలుస్తుంది. సంతానాభివృద్ధి, చేదోడు వాదోడుగా ఉండటం, సెక్సువాంఛ, సాహచర్యం, భద్రతకోసం ఆరాటం, సన్నిహితత్వం అటువంటి ప్రేరకాలు. సంతానాభి వృద్ధి ప్రకృతి పరిణామంలో ఉదయించిన మానవాళి కీకారణ్యాల మధ్య, క్రూరమైన అడవి జంతువుల మధ్య, ప్రకృతి వైపరీత్యాల మధ్య జీవయాత్ర గడపవలసి వచ్చింది. ఆ దశలో మానవుల సంఖ్యకు విలువ వచ్చింది. ఎక్కువ మంది మానవులు పైన చెప్పిన వాటి దౌష్ట్యాన్ని అరికట్టగల్గుతారు. కనుక ఆ కాలపు విజ్ఞులు బహు సంతానాన్ని ఆశించారు. పెక్కుమందిని కనమని ప్రోత్సహించారు. బహు సంతానవతులు కావాలని దంపతులను దీవించారు. కాలం మారుతున్నది సంతానం ప్రధాన ఆశయంగా దంపతులు భావించడం తగ్గింది. అయినా ఆచారం, అలవాటు దంపతులను ఒక్క సంతానాన్నయినా కనమని వత్తిడి చేస్తున్నాయి. మతం కూడా వారిని సంతానాన్ని కని పితృ ఋణం తీర్చమని ప్రబోధిస్తున్నది. కనుకనే సంతాన వాంఛ ప్రబలంగా ఉంటున్నది.

సెక్సు వాంఛ :- లైంగిక వాంఛ స్త్రీ పురుషులకు సహజం. అయితే పురుషుడు ఈ కోరికను బహిర్గతం చేస్తాడు. సాధారణంగా స్త్రీలు తమ కోరికను వెలిబుచ్చరు. అది సిగ్గువలన కావచ్చు. పురుషాధిక్య సమాజంలో లజ్జను స్త్రీల భూషణంగా పేర్కొనడం వల్ల కావచ్చు ఏమయినా పెండ్లాడిన వారు కాముక క్రీడలో పాల్గొనడం చూస్తున్నాం దాన్ని ఆశించడం విడూరం కాకపోగా ఆశించక పోవడం దౌర్బల్యంగా

భావించే స్థితి ఉంది. ఈడు వచ్చిన మగపిల్లలకు, ఆడపిల్లలకు పెండ్లి చేయాలని తల్లిదండ్రులు ఆశించటంలో, లేక వయస్సు వచ్చిన వారయితే యువతీ యువకులు కామ తృప్తిని ఆశించి పెండ్లాటంలో ఆశ్చర్యం ఏమీలేదు. ఇంతకూ తేలిన అంశమేమిటంటే సెక్సు వాంఛ కుటుంబం ఏర్పడడానికి ఒక కారణమని తేలుతుంది. సెక్సు ప్రధానాంశమా కాదా, సెక్సు వాంఛ మాత్రమే దంపతులను దగ్గరకు చేరుస్తున్నదా లేదా అవేవి చర్చనీయాంశాలు. సెక్సు మాత్రమే దంపతులను కట్టి వేస్తుందని ఒక భావం ప్రబలంగా ఉంటే అది ప్రధానమయినదే కాని అదే ముఖ్యాంశమని చెప్పటానికి వీలు లేదని మరో ఆలోచన ఉద్భవించింది.

సాహచర్యం :- మానవులు సంఘజీవులు. ఒంటి గింటి రామలింగంగా మానవ వ్యక్తి మనజాలదు. సమాజంలో పుట్టిన మానవ వ్యక్తి తన చుట్టూ సమాజాన్ని నిర్మింప పూనుకోవడం చూస్తున్నాం. కుటుంబం ఒక చిన్న తరహా సమాజం. కనుక మానవ వ్యక్తి తను కుటుంబంలో సభ్యత్వం పొందాలని ఆశించడం ప్రకృతి ధర్మం. ప్రతి పురుషుడూ, స్త్రీ కూడ ఒక సహచర వ్యక్తిని కోరుకోవటం సర్వ సాధారణంగా జరుగుతున్న విషయం. కొన్ని సందర్భాలలో పురుషుకు మరో పురుషుని సహచర్యాన్ని, ఒక స్త్రీ మరియొక స్త్రీ సహచర్యాన్ని ఆశించడం జరుగుతున్నది ఇక్కడ మౌలికం ఏమిటి 'నా అనే మనిషి నాకుండాలి' అనే సంకల్పం బలీయంగా ఉండటం

భద్రత :- స్త్రీ భద్రత కోసం వివాహ మాడుతున్నది. స్త్రీ ఏపురుషునికో చెంది వుండాలనే భావం బాగా ప్రచారం పొందింది. 'ఎవ్వతే నీవు భీత హరిణేక్షణ' అని ప్రశ్నించడం అలవాటు. ఫలాని పురుషుని కుమార్తెగానో, ఫలాని పురుషుని భార్యగానో, లేక ఫలాని పురుషుని తల్లిగానో మాత్రమే ఆవిడ హోదా అస్తిత్వము నిర్దేశించటం సంభవించింది. ఆమెకు ప్రత్యేక వ్యక్తిత్వాన్ని మతాలు, పురాతన సమాజాలు ఆమోదించలేదు సరికదా పైగా నిషేధించాయి. అవివాహిత స్త్రీ మీద, విడాకులు పుచ్చుకున్న స్త్రీ పైన, అత్యాచారాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఆమెని ఎవ్వరికీ చెందని వ్యక్తిగా సమాజ వ్యతిరేక వ్యక్తులు పరిగణిస్తున్నారు. వారి ఊహలలో ఆమె అందరికీ చెందినది కనుక అందరూ ఆమె పొందును ఆశించవచ్చు; ఆమెను అవమానించవచ్చు. ఆర్థికంగా తన కాళ్ళమీద నిలబడగల అతివ కూడా భద్రత కోసం వివాహం చేసుకో దలచడం తరచుగా జరుగుతున్నది. వరకట్నాన్ని అందజేసి భర్తను తనను

అతని స్వంతం చేసుకోనివ్వడం గమనిస్తున్నాం. వరకట్నం ఇవ్వడం తనకు న్యూన తగా ఆమె భావి.చలేని పరిస్థితి నేడు చలామణి అవుతున్నది. ఎక్కువ మంది మూర్ఖ పురుషుల దౌష్ట్యానికి బలికాకుండా ఒక క్రూర భర్తచేత ‌దెబ్బలు తినడం మేలని తలపోసే కాలమిది. అవివాహితగా ఉంటే సంఘ వ్యతిరేక శక్తులు తోడేళ్ళలా తనని వెంటాడి మనుగడ సాగించనీయవని ఆమె భయం. ఆర్థికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా ఆమెకు భద్రత ఉన్నా ఆమె సామాజిక భద్రతకు తహతహలాడు తున్నది. ఒక మగతోడు తన భద్రతకు అత్యంత ఆవశ్యకమని ఆమె ఆలోచిస్తుంది.

చేదోడు వాదోడు: కష్టజీవుల వర్గంలో స్త్రీ పురుషులు ఇద్దరూ శ్రమిస్తారు. కూలీ డబ్బులతో జీవయాత్ర సాగిస్తారు. వారు బ్రతుకు బాట పైన పయనించాలంటే వారిలో ఏ ఒక్కరికీ వారి సంపాదన అందుకు చాలదు. కనుక ఇద్దరు కలసి జీవిస్తే ఖర్చు తగ్గుతుంది, ఆదాయం పెరుగుతుంది. తిండి, బట్ట, ఇల్లు వాకిలి, ఆరోగ్యం వీటిని సంతరించుకోవడానికి వీలవుతుంది. వేన్నీళ్ళకు చన్నీళ్ళన్నట్లు ఒకరి జబ్బుచేస్తే మరొకరు ఆ కష్టకాలంలో ఆదుకుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉంటారు. అందుకనే పురాతన సంప్రదాయాలకు భిన్నంగా కట్నాన్ని ఆశించకుండా ఉద్యోగం చేసే వధువు కోసం మధ్య తరగతి వరులు అన్వే షిస్తున్నారు. వీరంతా ఆలోచనా పరుల క్రింద లెక్క. కట్నమయితే ఒక్కసారిగా కొన్ని వేలు లేక లక్షలు రావచ్చు. ఉద్యోగం చేసే వధువు అయితే కనీసం నలబది యేండ్లు సంపాదించగలదు కదా! వారు ఆశించడం తప్పని విమర్శించడం లేదు. కాగా చెప్పదల్చుకున్నదేమంటే జీవనం సాగించటానికి ఇద్దరి సంపాదన అవసరమయి ఒకరికొకరు ఆవశ్యకమయి స్త్రీ పురుషులు పెండ్లాడుతున్నారనేది ప్రస్తుతాంశం.

సన్నిహితత్వం:- మానవులలో కొందరు సంస్కారులు ఉంటారు. ఆచారానికి, సంప్రదాయానికి, మతాదేశాలకు, ప్రభుత్వ విధానాలకు వారు అంతగా విలువ ఇవ్వరు. వారు తమ అంతర్బుద్ధికి ప్రాధాన్యతను యిస్తారు. తాము అనుసరించదలచిన నీతిని వారే నిర్ణయించుకుంటారు. వారిదృష్టిలో భార్యాభర్తలు సంబంధంలో సన్నిహితత్వం చాలా ప్రధానమయిన అంశం. అదే భార్యాభర్తల బంధానికి బలాన్ని చేకూర్చేది.

సన్నిహితత్వం అంటే :- సన్నిహితులైన మనుజుల్లో ఒకరికి మరియొకరిపై శ్రద్ధ (CARING) వుంటుంది ఈ శ్రద్ధ అన్ని విషయాలకు వర్తిస్తుంది. అంటే ఆ వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల శ్రేయస్సు సంక్షేమం విషయమై శ్రద్ధను కనబరచటం జరుగుతుంది. అంతేకాక ఆ వ్యక్తి యొక్క సమానత్వ హోదాను గురించి ఆశక్తి ప్రదర్శితమవుతుంది. ఎంత సేపటికీ అవతలి వ్యక్తికి ఏ అపాయం జరుగుతుందో, ఏమి నష్టం వాటిల్లుతుందోనని భయ సందేహాలకు లోనయినప్పుడే అవతలి మనిషిమీద శ్రద్ధ చూపిస్తున్నట్లు లెక్క. అంతేకాక అవతలి మనిషికి సుఖ శాంతులు లభించాలని ఆశించడం ఆ శ్రద్ధ యొక్క లక్షణాలు. సన్నిహితత్వాన్ని అనుభవించే మనుష్యుల్లో ఒకరు మరొకరి అనుభవాలను పంచుకోవడం జరుగుతుంది. దీనినే కష్టసుఖాలలో పాలు పంచుకోవడం (SHARING) అంటారు. ఇద్దరు వ్యక్తులు ఒకే ఇంట్లోనే కాపురం చేస్తున్నా వారిరువురి మధ్య సంవాదం (CONVERSATION) లేకుండా వుండే పరిస్థితులు కూడా వున్నాయి. అలాకాక ఆప్యాయతగా మాట్లాడుకుంటూ తమ తమ అనుభవాలను మరొకరికి తెలుప్తుకుంటూ జీవయాత్ర సాగించటం ఈ వినూత్న పద్ధతి యొక్క స్వభావం. సంతోషం మరొకరితో చెప్పుకుంటే రెండింతలవుతుందని, నష్టకష్టాలు మరొకరితో పంచుకుంటే సగమవుతాయని నానుడి వుంది. ఇది అనుభవం మీద చెప్పిన మాట. దీనిలో ఎనలేని సత్యం వున్నది. మనిషి సామాజిక జీవి. అందుకని తన సుఖదుఃఖాలను తన స్నేహితులతో, జీవిత భాగస్వాములతో పంచుకోవాలని ఆశించడం సహజం. అవతలి వ్యక్తి మీద శ్రద్ధాసక్తులు, అనుభవాలను పంచుకోవడం ఈ రెండూ మానవ నైజానికి అనుసరణీయమే. మనిషిలో స్వార్థమూ, పదార్థ భావన రెండూ ఇమిడి వున్నాయి దూరదృష్టికల స్వార్థం పదార్థంగా పరిణమించక తప్పదని కొందరి ఆలోచన. పరోపకార పారీణత సామాజిక జీవియైన మనిషిలో సహజంగా ఉత్పన్నమైన లక్షణమని కొందరు పండితులు వాదిస్తున్నారు. ఏది ఏమయినా తోటివాడి శ్రేయస్సుకోసం పాటుపడటం మానవ లక్షణం. ఈ సూత్రాన్ని ఋజువు చేయడానికి ఎన్నో సంఘటనలను, సన్నివేశాలను పేర్కొనవచ్చు.

లైంగిక జీవితం-నీతి:- వైవాహిక జీవితంలో, దాంపత్య జీవితంలో సెక్స్ ముఖ్యమైన భూమికను నిర్వహిస్తుందని తెలుసుకున్నాం. అయితే అది జీవితాన్ని శాసించే ఒకే ఒక అంశమని ఈనాటి మేధావులు అంగీకరించడంలేదు. అయితే సెక్స్ జీవితానికి ప్రాధాన్యత లేదని వాదించేవారు ఎవరూ లేరు. ప్రతి మనిషి తన జీవితాన్ని

రెండు సూత్రాల ప్రకారం గడుపుతాడు. కొంతమంది తమ జీవితాలు సూత్రబద్ధం కాదని వాదిస్తారు. అంటే సూత్రబద్ధం కాని జీవితాన్ని గడపడమే వారి జీవితసూత్రం అని తేలుతుంది; అదే వారి జీవిత నియమం. ప్రతివ్యక్తి అనుక్షణం ఏదో చేస్తూనే వుంటాడు. ఒక్కొక్కప్పుడు ఏమీ చేయకపోవడమే అతని దినచర్య కావచ్చు. వ్యక్తమయినా, అవ్యక్తమయినా అనుక్షణమూ మానవ వ్యక్తి ఏదో ఒక నిర్ణయం చేస్తూనే వుంటాడు. అయితే ఆ నిర్ణయం చిన్నవిషయంలో కావచ్చు, పెద్ద విషయంలో కావచ్చు. తన అంతరంగానికి తోచిన విధంగా నడచుకోవడం సంభవిస్తుంది. ఈ సందర్భంగా భిన్న వ్యక్తుల కార్యాచరణ విభిన్నంగా వుండటానికి అవకాశం వుంది. అది వారి అంతరంగ ప్రవృత్తి మీద ఆధారపడి వుంటుంది. వ్యక్తి యొక్క పరిసర విషయ గ్రహణమే అంతరంగమని చెప్పవచ్చు. ఆ గ్రహణశక్తి, విషయ జ్ఞానం ఈ రెండూ అంతరంగ స్వభావాన్ని నిర్దేశించి ఆ వ్యక్తియొక్క నిర్ణయాన్ని, కార్యాచరణను ప్రభావితం చేస్తాయి ఈ ప్రక్రియనే నైతికత అంటాం. కనుక మనకు ప్రస్ఫుటంగా తెలిసినా మనకు తెలియకపోయినా ఒక నీతి వుంటుంది. ఇక్కడ నీతి అంటే మంచి అని అర్థం కాదు నీతి అంటే నడవడికి సంబంధించిన సూత్రం అన్న మాట. అలాగే వ్యక్తియొక్క లైంగిక జీవితంలో కూడా నీతి నిండి నిబిడీకృతం అవుతుంది.

కుటుంబంలో, దాంపత్య జీవితంలో అనుసరించే నీతి వాళ్ళ జీవితాలను చాలా వరకు నిర్దేశిస్తుంది. వారియొక్క సుఖదుఃఖాలను నిర్ణయిస్తుంది. కుటుంబంలో శాంతి అయినా, అశాంతి అయినా ఆ నీతి ఫలితమే. కుటుంబంలో శాంతికి అవసరమైన సహజీవన సూత్రం, తప్పని సరియైన సన్నిహితత్వం భావం దృష్ట్యా ఈ నీతియొక్క బాగోగులను మదింపు చేయవచ్చు. ఈ రెండు ప్రధానాంశాల దృష్ట్యా దాంపత్యంలోని వివిధ నీతులను, రీతులను పరిశీలిద్దాం.

పాతివ్రత్యం:- పితృస్వామ్య సమాజం ఆవిర్భవించి నప్పటినుండి వైవాహిక జీవితంలో పాతివ్రత్యానికి ప్రాముఖ్యత ఏర్పడింది. పాతివ్రత్యం అంటే పతివ్రత యొక్క జీవితం విధానం అన్నమాట. పతి సౌఖ్యాన్ని, శ్రేయస్సును, సౌభాగ్యాన్ని సర్వదా ఆశించడం వాటి కోసం ప్రయత్నించడం పతివ్రత లక్షణం. అంతటితో ఆగితే బాగుండేది కానీ ఆ స్త్రీకి వ్యక్తిత్వం లేకుండా నా అనేది లేకుండా ఆమెను

పూర్తిగా పతికి దాసురాలిని చేసింది సమాజం పతియే ప్రత్యక్ష దైవమని ఉద్బోధించింది. అతనికొరకు బలిదానం చేసుకోమని ప్రోత్సహించింది. చివరకు తన ఆత్మాభిమానాన్ని చంపుకుని పతి ప్రీత్యర్థం, ఆజ్ఞ పరిపాలన కోసం ఆ మగనాలు జీవించాలని పురాణాలు, మతాలు, ఘోషిస్తున్నాయి. స్త్రీ తన మగని అర్ధాంగి. అంతేగాని పురుషుణ్ని స్త్రీ యొక్క అర్థశరీరుడుగా అభివర్ణించలేదు.

అన్ని మతాలు-హైందవం, ఇస్లాం, క్రైస్తవం-పతి అభీష్టాను సరణమే సతి ధ్యేయం అని చెప్పాయి. వైవాహిక విధియొక్క రీతులు, ప్రమాణాలు ఈ అంశాన్ని ఋజువు చేస్తున్నాయి. పతి పాపపు పని చెప్పిన హితవు చెప్పి అతని బుద్ధిని మరల్చ వలెను. కాదు కూడదని పట్టుపట్టిన అతని ఆజ్ఞను పాటించవలెను. అలాగే పతి దుష్టుడైన, దుర్జనుడైన, నీచుడయిన, వైముఖ్యం చెందక అతన్ని అపరదైవముగా భావించి పూజించవలెను ఇవి హైందవ వనితలకు ఉగ్గుపాలతో అందించిన భావాలు.

సతి పాతివ్రత్యాన్ని పాటిస్తే కుటుంబంలో శాంతి నెలకొని వున్నట్లుగా కనిపించవచ్చు. కాని అది కేవలము శ్మశాన శాంతియే భార్య భర్తలు వివాహరథానికి రెండు చక్రాలు. పాతివ్రత్య జీవితంలో ఒక చక్రమే తిరుగుతుంది స్త్రీ అనే చక్రాన్ని పురుషుడు అనే చక్రం లాగుకుని వెళుతుంది. అంతేగాని స్త్రీ అనే చక్రం తిరగదు. కాబట్టి సమాన ప్రతిపత్తిలేని వ్యక్తుల మధ్య సహజీవనం వాంఛనీయం కాదు. మరో మాటలో చెప్పాలంటే పాతివ్రత్య సూత్రం స్త్రీని భర్తకు బందీగా చేస్తుంది. తద్వారా వాస్తవమైన సహజీవనాన్ని భంగపరుస్తుంది సతి పాతివ్రత్యాన్ని పాటించే దాంపత్యం జీవితంలో సన్నిహితత్వం చోటుచేసుకోదు. సతి తన తను, ధన, మనః, ప్రాణాలను పతికి సమర్పించే సందర్భంగా ఆమె "తనవిగా" ఏమి వుంచుకోదు. ఆ సమర్పణ విధి ప్రేరితం. అందుచేత ప్రత్యేక వ్యక్తిత్వం గల ఇరువురు స్త్రీ పురుషుల మధ్య వుండవలసిన సన్నిహితత్వం లోపిస్తుంది. పురుషుడు ఆజ్ఞలను ప్రత్యక్షంగాగానీ పరోక్షంగా గానీ జారీచేస్తాడు. ఇల్లాలు ఆజ్ఞలను పాలిస్తుంది. అంతవరకే ఆమె కర్తవ్యం. కనుక గృహిణి పాతివ్రత్యాన్ని పాటిస్తుంటే ఆ దాంపత్యంలో సహజీవనమూ సన్నిహితత్వమూ లోపిస్తాయి.

ఏక పత్నీత్వం:- బహుభార్యాత్వం 1955 వరకు హైందవ జీవితంలో శాసన సమ్మతం. తరువాత అది నిషేధించబడింది. ఇప్పటికీ ముస్లిం పురుషుడు ఏకకాలంలో నలుగురు భార్యలను కలిగి వుండవచ్చు.

క్రైస్తవ సమాజంలో మొదటినుండి ఏక పత్నీత్వం విధిగా అనుసరణీయం అవుతున్నది. హైందవ సమాజంలో శ్రీరాముని ఏక పత్నీవ్రతుడిగా అభివర్ణించటం జరిగింది. సీతా వియోగాంలో శ్రీరాముని విరహ వేదన ఏక పత్నీవ్రతుని వ్యథగా చిత్రించారు. శ్రీరాముని ఆదర్శ మానవునిగా చేశారు బహుపత్నులు గల శ్రీకృష్ణుని భగవంతుని అవతారంగా మలిచారు. కాని హైందవ సమాజంలో కొందరు వ్యక్తులు శ్రీకృష్ణుణ్ని అనుకరిస్తే సమాజం వారిని తప్పు పట్టలేదు. స్త్రీలను పాతివ్రత్యపు మూసలో ఉండే సమాజంలో ఏక పత్నీవ్రతాన్ని పురుషుడు పాటించినా లాభం లేదు.

ఏక పత్నీత్వం ఏకభర్తృత్వం MONOGAMY : ఈ వ్యవస్థలో ఒకే స్త్రీకి ఒకే భర్త, ఒకే పురుషునికి ఒకే భార్య ఉంటారు. అంతమాత్రాన స్త్రీకి ప్రత్యేకంగా ఒరిగేదేమీ లేదు. కాకపోతే బహుభార్యాత్వంకన్న కొద్దిగా మెరుగు. దీనినే గ్రుడ్డిలో మెల్ల అంటాము మౌలికమైన మార్పు ఏమీ ఉండదు. పైపై మెరుగులు చూచి స్త్రీ మోసానికి గురిఅవడం మంచిది కాదు

బహు భార్యాత్వం (POLYGAMY) : ఇలాంటి వివాహ పద్ధతి అమలులో ఉండే సమాజం ప్రస్తుతం ముస్లింలలోను, కొంత జాతి వారిలో మాత్రమే కన్పిస్తుంది. ముస్లింల వాదన మరీ విచిత్రంగా ఉంటుంది. భార్యలందరినీ సమదృష్టితో చూడగల శక్తి ప్రతిభ ఉన్న పురుషుడు మాత్రమే పెక్కు భార్యలను ఏక కాలంలో నలుగురిని మించకుండా వివాహమాడాలి అని మహమ్మదుగారు ఆదేశించారట. అయితే ఈనాడు ముస్లిం సమాజంలో బహు భార్యాత్వం దర్శనమిస్తూనే ఉంది ఆ విషయం అలా ఉంచితే మరో అంశం ప్రస్ఫుటంగా దర్శనమిస్తున్నది. ఏక పత్నీత్వాన్ని సాగించే ముస్లింలలో అధిక సంఖ్యాకులు తాము బహుభార్యాత్వ విధానాన్ని ఆచరణలో పెట్టక పోయినా బహుభార్యాత్వ విధానాన్ని సమర్థిస్తూ మాట్లాడతారు; వ్రాస్తారు. దీనిని బట్టి తేలిందేమంటే బహుభార్యాత్వ భావనను పెక్కుమంది ముస్లింపురుషులు ఆమోదిస్తున్నారనేది స్పష్టమవుతున్నది.

బహు భార్యాత్వ విధానాన్ని ఆమోదించే ముస్లింలు బహు భర్తృత్వాన్ని అంగీకరించరు. పురుషుడు సర్వ స్వతంత్రుడని స్త్రీ పురుషుని అంటి పెట్టుకొని ఉండాలని ముస్లిం పురుషులు అభిప్రాయ పడుతున్నారు. బహు భార్యాత్వ వ్యవస్థలో స్త్రీలను

వస్తువులుగా పరిగణించడం పరిపాటి. వారికి సంకల్పాలు, అభిప్రాయాలు, ఊహాపోహలు ఉంటాయని పురుషులు విశ్వసించరు. కనుక స్త్రీల సుఖం విషయం భర్త పట్టించుకోడు. అందుచేత భార్యలు భర్త సాంగత్యాన్ని ఆపేక్షిస్తూ వేచియుంటారు, కాచియుంటారు. ఇలా వ్యక్తిత్వాన్ని చంపుకొని జీవయాత్ర సాగిస్తారు ఆ స్త్రీలు నైచ్య జీవితం వారిది. పతివ్రతయైన ఒకే ఒక భార్యకు, అనేకమంది సవతులున్న స్త్రీకి మౌలికంగా తేడాలేదు. భర్త కటాక్ష వీక్షణం కోసం అలమటించడంలో ఇరుతెగల స్త్రీలు ఒకే తరహా అనుభూతులకు లోనవుతారు. కాకపోతే ఒకే భార్య ఉండే వ్యవస్థలో సవతుల బెడద ఉండదు సత్కృత్తుగా భర్త ఉంపుడు గత్తెల పోటీ ఉంటుంది.

బహు భర్తృత్వం :- బహు భర్తృత్వం అమలులో ఉన్న సమాజం ఒకటి రెండు కొండ జాతులలో తప్ప మరెక్కడా కన్పించదు భారతంలో దర్శనమిచ్చే ద్రౌపది లాంటి వనితను ఈనాడు చూడము బహు భర్తృత్వ విధానం హిమాలయ పర్వత ప్రాంతపు ఒక కొండ జాతిలోను, నీలగిరి ప్రాంతపు మరో కొండజాతిలోను కన్పిస్తుంది. సోదరులయిన పురుషులు ఒకే స్త్రీని భార్యగా కలిగి ఉండటం గమనించదగ్గ విషయం. జీవనం చేయటం కష్టంతో కూడుకున్న సమాజంలో అనేకమంది పురుషులు కలసి ఒకే కుటుంబంగా జీవించడం యుక్తి యుక్తమని వారు తలపోసి ఉండవచ్చును. అంతేగాక స్త్రీల జనాభా తక్కువగా ఉన్న ప్రాంతాలలో బహు భర్తృత్వ విధానం పెంపొందు తుందని బెర్నార్డుషా అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ఈ పద్ధతి జీవిత వ్యవస్థలో సహజీవనం, సన్నిహితత్వం ప్రముఖ పాత్ర వహించటంలేదు. కేవలం ఒకరకపు కుటుంబ వ్యవస్థ ఒనగూర్చే సౌకర్యాలను, ప్రయోజనాలనుమాత్రమే పరిగణనలోకి తీసుకోవడం గమనార్హం.

విశృంఖలత్వం :- వావి వరుసలతో నిమిత్తం లేకుండా సాగే దాంపత్య జీవితం ఈ శీర్షిక క్రిందకు వస్తుంది. అలాగే వివాహంతో నిమిత్తం లేకుండా స్త్రీ పురుషులు స్వైర విహారం చేయడం కూడా ఈ వర్గీకరణ క్రిందకే వస్తుంది. ఈ రకపు దాంపత్య జీవితాలలో ప్రేమాభిమానాలు సాధారణంగా కొరవడడం చూస్తున్నాం. కొన్ని సంబంధాలలో కేవలం కామవాంఛ బలీయమైన పాత్ర వహించడం జరుగుతున్నది. అయితే వివాహం లేకుండా కలసి జీవించే కొన్ని జంటలు ఉదాత్త ఆశయాల వల్ల ప్రబోధితులై సహజీవనాన్ని సన్నిహితత్వాన్ని సంతరించుకో గల్గుతారు. అయితే అలాంటి సంబంధాలు పరిణత మనస్కుల మధ్యనే ఏర్పడతాయి. సామాన్య ప్రజానీకం

అలాంటి సంబంధాలలోకి జొరబడలేరు. కొందరు ఈ సంబంధాలను విప్లవ వివాహాలుగా పేర్కొంటారు కొందరు స్త్రీ పురుషులు అసలు పెండ్లితంతును ప్రమాణ స్వీకారాన్ని నిరాకరిస్తారు సామాన్య ప్రజలు ఇలాంటి సంబంధాల పర్యవసానంగా ఉద్భవిస్తే పరిణామాలను తట్టుకోలేరు. కొందరు వివాహ వ్యవస్థను ఇతర కారణాల వల్ల నిరాదరణ చేస్తారు. వివాహం బంధమని, ఆ బంధంలో ఇరుక్కోవడం తమకు ఇష్టం లేదని వారి వాదన. స్వేచ్ఛ తమ జన్మహక్కని, స్వేచ్ఛకు ప్రమాదం కల్గించే వివాహ వ్యవస్థను తాము నిరసిస్తున్నామని వారు బహిరంగంగా ప్రకటిస్తున్నారు. స్వేచ్ఛను గురించి వారికి విపరీత భావాలున్నాయి. నిర్నిబంధమైన స్వేచ్ఛ ఎవరికీ కుదరదు, సాధ్యపడదు, స్వేచ్ఛకు పరిమితులుంటాయి. కాగా ఆ పరిమితులు, ఆ షరతులు స్వచ్ఛందంగా ఏర్పరచుకున్నవా? ఇతరులు తమపై రుద్దినవా అనేది మీమాంస.

స్వైర విహార జీవితంలో స్త్రీకాని పురుషుడుకాని సామాన్యంగా పగటి కల జీవితం కొనసాగిస్తారు. వాస్తవంలోకి రాలేని ఊహా జీవితంలో విహరిస్తారు. చివరకు ఎదురుదెబ్బలు తగిలి పూర్వంకన్నా ఎక్కువగా మితవాదులుగా ప్రత్యామ్నాయ శక్తులుగా తయారవుతారు. ఈ సత్యాన్ని జీవితానుభవం రుజువు చేస్తున్నది. కామాన్నిగురించి, ప్రేమనుగురించి అలాంటి వారికి విడ్డూరపు ఊహాపోహలు ఉంటాయి. పెట్టుబడిదారీ వైవాహిక జీవితంలో స్త్రీయొక్క వ్యక్తిత్వానికి గుర్తింపు లేదని తలచి మార్క్స్ వివాహ వ్యవస్థను శాసనసమ్మతమైన వ్యభిచారంగా విమర్శించాడు. ఆయన శిష్యులు లెనిన్, స్టాలిన్లు వివాహ వ్యవస్థను సరళం చేయకుండా దానికి గట్టి బందోబస్తును కల్పించారు. ఏదోరూపంలో వివాహ వ్యవస్థ కొనసాగుతూనే ఉంది. వివాహ వ్యవస్థను విమర్శించి ఖండించిన నేతలు, మేధావులు తమ అభిప్రాయాలకు వాస్తవరూపం కల్పించలేదు. తమ చిన్ననాట జరిగిన వివాహాల ఫలితంగా ఏర్పడిన దాంపత్య జీవితాలనే సాగించారు. తమ భార్యలను విడనాడలేదు. కనుక విమర్శకుల వాదనలను తట్టుకొని వివాహ వ్యవస్థ నిలిచిందని మనం గ్రహించాలి. కామతృప్తి తాత్కాలిక ఆకర్షణ, ప్రేమను గురించిన కలలు దాంపత్యబంధాన్ని స్వీకరించలేవు. సమానస్థాయి వ్యక్తుల మధ్య కలిగే సహజీవనం, సన్నిహితత్వమే ప్రధాన సూత్రాలుగా పనిచేస్తేనే ఆ సంబంధం సుసంపన్నం అవుతుంది.

సన్నిహితత్వ రూపాలు - ఆచరణ :- స్త్రీ పురుషుల మధ్య సన్నిహితత్వం అనేక రూపాలలో వెల్లివిరుస్తున్నది. ఆ రూపాల అమలు తీరును పరిశీలిస్తే గాఢమయిన

భేదాలు గోచరమవుతాయి. కొన్నింటిమధ్య భేదం గుణాత్మకం; మరికొన్నింటిమధ్య వ్యత్యాసాలు పరిమాణాత్మకం.

అమలిన శృంగారం:- ఇందులో స్త్రీ పురుషులు పరస్పరం ప్రేమించు కుంటారు; అభిమానించుకుంటారు. ఒకరు రెండవవారికి సన్నిహితంకావాలని అహరహం తపిస్తారు. వారికి వియోగంలోనే తృప్తి; విరహంలోనే ఆనందం. అవతల వ్యక్తితో శారీరక సంబంధాన్ని ఆశించకపోవటం దీని ప్రత్యేకత. జీవిత సహచరి లేక జీవిత సహచరునికోసం తను ధన మనః ప్రాణాలను తృణప్రాయంగా త్యజించ ఇచ్ఛగించడం దీని విశిష్టత. సాధారణంగా ఇందులో ప్రేమ ఏకపక్షంగా ఉంటుంది. ప్రేయసి లేక ప్రియుడు నిరాదరణ చేశారని వాపోవడం కన్పిస్తుంది. ప్రేయసి నిరాసక్తతను ప్రదర్శిస్తున్నదనే వ్యథ ప్రబలంగా ఉంటుంది. ప్రేయసి ప్రియుల శారీరక సంపర్కంవల్ల ఆ సంబంధం మలినమవుతుందనే భావం కొట్టవచ్చినట్లు దర్శనమిస్తుంది. అందుచేతనే దానిని 'అమలిన శృంగారం' అని పేరుపెట్టడం జరిగింది. శృంగారం సాధారణంగా స్త్రీ పురుషులమధ్య కొనసాగుతుంది. శృంగార జీవితంలో మధురభావం చోటు చేసుకుంటుంది.

ఈ అమలిన శృంగారానికి వాస్తవస్వరూపం ఉన్నదా లేక ఇది ఊహాస్వప్నమా? ఇది సాధారణంగా విపరీత మనస్కులకే సాధ్యం. జీవితాన్ని సత్యంగా స్వీకరించే వారిలో ఇది కన్పించదు. ఇందులో అంకితభావం, త్యాగం నిండి నిబిడీకృతంగా ఉంటాయి. తాను ప్రేమించే వ్యక్తిని ఆరాధకుడు లేక ఆరాధకురాలు గౌరవించడం సహజం. గౌరవాభిమానాలు ఆ రకపు ప్రేమకు ఆలంబనాలు. ఎవరు ఈ అమలిన శృంగారాన్ని సాధారణంగా చేపట్టారు? కామభావన లేనివారు, నపుంసకులు, ఊహలలో విహరించేవారు, నేలవిడిచి సాముచేసే మనస్తత్వం కలవారు వీరికిమాత్రమే ఇది సాధ్యం. సర్వసామాన్యంగా స్త్రీ పురుషులు పరస్పర గౌరవాభిమానాలను లోనుఅయితే ఎప్పుడో ఒకప్పుడు శారీరక సంపర్కాన్ని పొందుతారు ప్రత్యేకంగా వారు అలాంటి శారీరక కలయికను ఆశించకపోవచ్చు. ఆ సంబంధంలో సన్నిహితత్వం పెరుగుతున్నకొలదీ వారిలో ఒకరు మరియొకరికి చేరువకావాలని ఆశిస్తారు. ఆ మానసిక స్థితిలో సంకల్ప బలంవల్లనో లేక అసంకల్పితంగా యాదృచ్ఛికంగానో వారిరువురు శారీరక సంబంధాన్ని ఏర్పరుచుకోవడం తటస్థిస్తుంది. ఇది ప్రకృతి ధర్మం, మానవనైజం. అమలిన శృంగారభావంలో సన్నిహితత్వం లోపిస్తుంది. గిరులలో తచ్చాడుతుంది. హద్దుల

మధ్య - కృత్రిమ పరిమితులమధ్య - తిరుగాడుతుంది. దీనిని పరిపూర్ణతకు దగ్గరయిన భావనగా స్వీకరించలేము. పరిపూర్ణత అనేది జీవితంలో లేకపోవచ్చు. కాని పరిపూర్ణతను ఆశించే స్వభావం ఇంకా ప్రబలంగానే ఉంది. పరిపూర్ణత కోసమని చెప్తూ ప్రేమికులు చేసే ప్రయాణంలో పరిపూర్ణత దొరకకపోవచ్చు. నిరంతర అన్వేషణే దాని లక్షణం. ప్రేయసి లేక ప్రియుని సంశ్లేషాన్ని కాంక్షించటంలోనే ఆ వ్యక్తికి ఆనందం. అమలిన శృంగార భావన అందరికీ అందుబాటులో ఉండదు. ఊహాలోకంలో విహారించేవారికి సృజనాశక్తి మిక్కుటంగా ఉన్నవారికిమాత్రమే అది సులభసాధ్యం.

దాంపత్యం :- కేవలం సాహచర్యంకోసం కలిసి జీవించే జంటను దంపతులంటాము. అయితే ఈ దాంపత్య జీవితంలో సెక్సు ప్రధాన భూమికను నిర్వర్తిస్తుంది. అయితే సెక్సు భావన మెదడులో ఉద్భవిస్తుందనే విషయాన్ని విస్మరించరాదు. మనస్సులో మధురభావం పుట్టే తదనుగుణంగా శరీరం స్పందిస్తుంది. సెక్సులేని సంబంధం సుసంపన్నం కానట్లే. అయితే సెక్సు సంబంధం ఉన్నంతమాత్రాన చాలదు. దాంపత్య జీవితాన్ని పుష్టివంతం చేసుకోవాలంటే సెక్సు అనుభవంతోపాటు మరికొన్ని అంశాలు చోటుచేసుకోవాలి. ఇక్కడే పరస్పర ప్రేమ, గౌరవం, శ్రద్ధ, కష్టసుఖాలను పాలు పంచుకోవటం బరిలోకి వస్తాయి. అమలిన శృంగారం మానసిక స్థితిగతులకు ప్రాధాన్యత ఇస్తే దాంపత్యం సెక్సుకు ప్రాముఖ్యతను ఇస్తుంది.

తోడు నీడ :- సాహచర్యంకోసం తపన, సెక్సుకోసం ఆరాటం మాత్రమే సన్నిహితత్వానికి మనుష్యులను చేరువ చేయలేవు. ఇంకా మరికొన్ని అంశాలు రంగం మీదికి వస్తాయి. జంటలో ఒకరు మరిఒకరికి చేదోడు వాదోడుగా ఉండాలి. తోడుకోసం తహతహ మానవలక్షణం. సమాజంలో ఉద్భవించిన మానవుడు సమాజంలోనే స్వేచ్ఛాసౌఖ్యాలను పొందగలడు. అలాగే స్త్రీ కూడాను. సామాజిక జీవి అయిన మానవవ్యక్తి తోడుకోసం అహరహం అలమటిస్తాడు. దీనినే సాంగత్య వాంఛ అని పేర్కొంటాము. ఎన్ని సంపదలున్నా తోడుకోసం మానవ వ్యక్తి అర్రులు చాచటం గమనార్హం. కష్టం వస్తే చెప్పుకోవటానికిమరో వ్యక్తి కావాలి. అలాగే సంతోషం, ఆనందం వస్తే వాటిని ఇతరులకు అందించే క్రమంలో తోటిమనిషి అస్తిత్వం అవసరం. తోడులేని జీవితంలో సన్నిహితత్వం పెరగదు. తోడు ఉన్నంతమాత్రాన సన్నిహితత్వం కలుగకపోవచ్చు. కాని తోడు లేకపోతే సన్నిహితత్వం సుసంపన్నం కాదు.

సుసంపన్నతకు మార్గం :- మామూలుగా జీవితంలో తటస్థించే అంశాలు అంటే ప్రేమాభిమానాలు, సెక్సు అనుభవం, తోడుకోసం తహతహ ఇది ఏదీ వాటంతట అవే సుసంపన్నతకు ఆ సన్నిహితత్వానికి దోహదం చేయవు అన్ని అంశాలు ప్రత్యక్షంగా కనపడ్డప్పుడే సన్నిహితభావం వెల్లివిరుస్తుంది.

సహజీవనం, సన్నిహితత్వం ఈ రెంటి తేడా :- సహజీవనం సమాన శక్తి యుక్తులుకల స్త్రీ పురుషులమధ్య సాధ్యమవుతుంది. అయితే సహజీవనానికి పరస్పర ప్రేమాభిమానాలు తప్పనిసరి కావు. అవతలి వ్యక్తిపై అభిమానం లేకపోయినా కేవలం మనుగడకోసం ఆ వ్యక్తితో సహనభావంతో సహజీవనం సాగించడం సాధ్యమే. కాని సన్నిహిత సంబంధంలో అవతలి వ్యక్తిపై శ్రద్ధ, అవతలి వ్యక్తి అనుభవాలను పంచుకోవాలనే వాంఛ విధిగా ఉండాలి; ఉంటాయి కూడాను. సహ జీవనం వర్ధిల్లాలంటే త్యాగం, అంకితభావం, పరోపకార పారీణత అవసరంలేదు. కాని ఇవి సన్నిహిత జీవితానికి అత్యంతావశ్యకాలు అనక తప్పదు. సహజీవనం సాగించ టానికి సహకారభావన దోహదకారి కానక్కర లేదు. సన్నిహితత్వాన్ని సాధించటానికి సహకార భావం తప్పనిసరిగా ఉండాలి.

భవిష్యత్తు; ఊహా చిత్రణ :- ఇంతగా ఇన్నివిషయాలు చర్చించిన తదుపరి భవిష్యత్తు ఎలాగుంటుందోననే కుతూహలం రేకెత్తుతుంది. భవిష్యత్తు అనేది ఊహ కందని విషయంకాదు ఈనాటి పరిస్థితులనుబట్టి దానిని రేఖామాత్రంగా సూచించ వచ్చు ప్రతి అంశాన్ని ఇదమిద్ధమని తేల్చి చెప్పలేకపోవచ్చు. కాని భవిష్యత్తుయొక్క స్థూల స్వరూపాన్ని ఆకళింపు చేసుకోవచ్చు. భవిష్యత్తులో వివాహ వ్యవస్థ దెబ్బ తింటుంది. ఈనాడు కుటుంబాలను శాసిస్తున్న పురుషాధిక్యత బలహీన పడుతుంది. పురుష దురహంకారం అదృశ్యమయ్యే ధోరణులు ప్రబలమవుతున్నాయి. కుటుంబాలలో సమానత్వ భావన బలం పుంజుకుంటుంది. స్త్రీలు ఇతోధికంగా స్వేచ్ఛను ఆశిస్తారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక స్వేచ్ఛలోమాత్రమే మహిళలు తృప్తి పడరు. వారు లైంగిక స్వేచ్ఛను వాంఛిస్తారు. తమ సమ్మతిలేకుండా భర్తలయినాసరే తమ శరీరాలను వాడుకోవటం వారు సహించరు. తరుణులు తమకు ఇష్టమున్నపుడే సంతానాన్ని కంటారు. ఇంతమంది సంతానాన్ని కనాలని, అందులో ఇంతమంది పురుష శిశువులను కనాలని భర్తలు కోరితే తిరస్కరిస్తారు. జన్మ నిగ్రహం సర్వసామాన్య

మవుతుంది. పిల్లలను కావాలనుకున్నప్పుడు, వారిని సరిగా పెంచి విద్యాభివృద్ధులు కల్గించగలిగినపుడు, వారికి తగిన వసతి, సదుపాయాలను కల్గించగలిగినపుడు మాత్రమే వారు సంతానాన్ని పొందుతారు. తమరిని సంతానం కనే యంత్రాలుగా భావించే సమాజాన్ని వారు నిరసిస్తారు., పురుషులతోపాటు సమాన హోదాతో స్త్రీలు ఉద్యోగాలు చేస్తారు, శ్రమపడతారు. సమానముగా బాధ్యతను నిర్వర్తిస్తారు; హక్కుల కోసం పోరాడుతారు. నారీలోకం స్వేచ్ఛకోసం ఆరాటపడుతుంది. ఆ స్వేచ్ఛను అనుభవించటానికి వలసిన పరిస్థితులను వనరులను దిగుండు చేస్తుంది. వాటికోసం పోరాడుతుంది. స్త్రీలకు సహజమని చెప్పబడే సిగ్గును, లజ్జాభావాన్ని తృణీకరిస్తుంది. క్రమేపి సభ్యత, నాగరికతలను అలవరుచుకుంటుంది వనితాలోకం. మానవాళి పెంపుకు, మనుగడకు తాను దోహదం చేస్తున్నది కనుక అందుకై శిశువును నవమాసాలు గర్భంలో ధరించి తదుపరి స్తన్యమిచ్చి పోషిస్తున్నందుకు సమాజంనుండి ఇతోధికంగా సదుపాయాలను, సౌకర్యాలను అతివలు ఆశిస్తారు.

సెక్సుకు ప్రాధాన్యత నశించి సాహచర్యానికి సన్నిహితత్వానికి పెద్దపీట వేయటం సంభవిస్తుంది. అసమానతకూడిన వైవాహిక బంధాన్ని, దాంపత్య సంబంధాన్ని స్త్రీలు వ్యతిరేకిస్తారు. వారు తమ ఆత్మగౌరవానికి ప్రాధాన్యతనిస్తారు. జీవిత సంబంధాలలో సన్నిహితత్వంకోసం ఆరాటం హెచ్చు పెరుగుతుంది.

సన్నిహితత్వానికి ప్రాముఖ్యత రావటంతో స్త్రీ పురుష సంబంధాల ప్రాశస్త్యం తగ్గిపోతుంది. ఇరువుర స్త్రీలు లేక ఇరువురు పురుషులు కుటుంబ సభ్యులుగా జీవించటం నేర్చుకుంటారు. వ్యక్తుల మైత్రి, సహకారభావం, త్యాగదృష్టి పెరుగుతాయి. ఇది ఈ నాడు విడ్డూరంగా, విచిత్రంగా ప్రకృతి విరుద్ధంగా తోచవచ్చు. కాని కాలగర్భంలో ఉన్న మార్పులు వెలికిరాగానే ఈ సహజీవన రూపాలు ప్రస్ఫుటమవుతాయి. శారీరక సంబంధాలకన్న మానసిక వైఖరులకు విలువ పెరుగుతుంది. కాలక్రమేణ మానవజాతి బుద్ధినైశిత్యం పెరుగుతుంది. నూతన పరికరాలను, క్రొంగొత్త పనిముట్లను సంతరించుకోవటం చూస్తాము. 'ఇల్లాలితనం' స్త్రీలకు మాత్రమే నిర్దేశితంకాదు స్త్రీలు పిల్లలను కన్నా పెంచడం స్త్రీ పురుషుల బాధ్యత అవుతుంది. శిశుపోషణను ఇరువురూ చేయగలరు. ఇంటి పనిని ఇరువురూ పంచుకుంటారు. వీలునుబట్టి సర్దుకుంటారు. కుటుంబంలో సర్దుబాటు పేరుతో అణచివేతను, దౌష్ట్యాన్ని, అన్యాయాన్ని స్త్రీలు ఇక ఏమాత్రం సహించరు. యంత్రయుగం వికసించటంతో మానవబుద్ధి సంకల్పిత చర్యలనుకూడా



సుందరయ్య గ్రంథాలయము
C. 70,734

కంప్యూటరులాంటి యంత్రాలతో చేయగలుగుతుంది. మానవ సమాజం, జీవితం చాల వరకు సుఖభరిత మవుతుంది. యంత్రాల సమన్వయం మాత్రం మానవ వ్యక్తి చేయవలసి ఉంటుంది. పురుషులు స్త్రీల శక్తిని అన్యాయంగా వాడుకోవటం జరుగదు దోపిడీ మనస్తత్వం క్రమక్రమంగా నశింపు అవుతుంది దోపిడీ స్థానంలో సహకార భావం చోటుచేసుకుంటుంది. సమాజంలో సమిష్టితత్వాలు బలహీనపడతాయి దేశం పేర, సమాజంపేర, వర్ణంపేర, జాతిపేర అణచివేత, దుర్మార్గం ఇక సాగదు. వ్యక్తి స్వేచ్ఛకు ప్రాధాన్యత వస్తుంది నేర స్వభావం కలవిగా పేర్కొనే చర్యలను కేవలం వ్యవహార సంబంధమయిన అతిక్రమణలుగా పరిగణిస్తారు. వ్యభిచారానికి, అసహజ చర్యలకు శిక్షలు పోతాయి. ఇద్దరు స్త్రీలు ఒక పురుషుకు కలిసి కాపురం చేయపూనితే, అలాగే ఇరువురు పురుషులు ఒక స్త్రీ దాంపత్య జీవితం సమ్మతితో సాగిస్తే సమాజం, శాసనం పట్టించుకోవు. కాగా అలాంటిచర్య సహజీవనాన్ని వృద్ధిచేస్తుందా లేదా అలాగే సన్నిహితత్వ భావాన్ని పెంపొందిస్తుందా లేదా అనేది మాత్రమే చర్చనీయాంశం అవుతుంది. ఇది స్థూలంగా భవిష్యత్ సమాజ చిత్రణ.

చివరిగా కొన్ని భావాలు రేఖామాత్రంగా స్పృశించబడిన సామాజిక చిత్రపటాన్ని చూచి చాలమంది బెంబేలు పడతారు. వారికి గంగవెర్రులెత్తుతాయి. ఉలిక్కిపడతారు. సూర్యునికి ముంజేయి అడ్డుపెట్టినట్లుగా అడ్డుపడాలని విఫలప్రయత్నం చేస్తారు.

భవిష్యత్తులో సూచింపబడిన సమాజాన్ని సంపూర్ణంగా ఆశిస్తామా అనేది ప్రశ్న కాదు. ఈనాటి ధోరణులనుబట్టి ఇలా జరుగవచ్చని ఊహించడమే జరిగింది. జరుగుతుందని ఊహించినది అంతా మంచిది కాకపోవచ్చు. ఆ మాటకువస్తే వాంఛనీయం కాకపోవచ్చు. ఒకటిమాత్రం సత్యం. స్త్రీజాతిని పురుష దురహంకారంతో అణచివేయటం - ఈనాడు చేస్తున్నట్లుగా - సంభవంకాదు. స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను, సమానత్వాన్ని వనితాలోకానికి నిరాకరించడం సాధ్యపడదు. ఇంతోధికంగా స్త్రీలు వ్యక్తి వికాసాన్ని పెంపొందించుకుంటారు. వాస్తవ సహజీవనం, నిజాయితీకల సన్నిహితత్వం అభిలషణీయాలు. అవి మున్ముందు పెరగాలని స్త్రీజాతి ముక్తకంఠంతో నినదిస్తున్నది. ఆ స్త్రీశక్తిని ఆపగల సత్తా ఎవరికీ ఉండదని, ఉండరాదని ఆశించటం సహృదయులయిన మానవుల కర్తవ్యం. కనుక ఈ సందర్భంగా స్త్రీజాతి భవిష్యద్దర్శనం సముచితం కాకపోదు.



70,734

# వివాహ విధానాలు : మంచిచెడ్డలు

ఈనాటి వివాహ వ్యవస్థలో అనేక మార్పులొచ్చాయి. వివాహ విధానాలలోకూడా వైవిధ్యంతో కూడిన విధానాలు - సంప్రదాయ వివాహాలు, ఆదర్శ వివాహాలు, ప్రేమ వివాహాలు, సంస్కరణ వివాహాలు, విప్లవ వివాహాలులాంటివి అనేక విధానాలు అమలులో వున్నాయి. పెళ్లి ఎలా జరిగినా కొన్ని విఫలమవడం జరుగుతోంది. జీవితంలో ముఖ్యభాగమయిన వివాహంలో, దాంపత్య జీవితంలో కలతలు వస్తున్నాయి. వాటికి పరిష్కారం ఏమిటి, వివాహవ్యవస్థలో ఎలాంటి సంస్కరణలు జరగాలి అనేవి నేడు మన ముందున్న ప్రశ్నలు.

సంప్రదాయ వివాహాలు: ఇవి రెండు రూపాలలో వుంటాయి. పెద్దలు ఏర్పాటు చేసిన పెళ్లిళ్లు మొదటితెగకు సంబంధించినవి. వధూవరులు వారే ఎంపిక చేసుకొనగా మతాలు నిర్దేశించిన విధానంలో జరిగే వివాహాలు రెండోకోవకు చెందినవి. ఈనాడు పెద్దలుచేసే వివాహాలు ఎక్కువ సంఖ్యలో వీగిపోతున్నా యనడానికి కారణాలు అనేకం. పెళ్ళినాటికే వారికి కొన్ని భావాలు, అభిప్రాయాలు, అభిరుచులు, అలవాట్లు స్థిరపడతాయి. ఇష్టాయిష్టాలు ఏర్పడతాయి. సర్దుకుపోయే మనస్తత్వంవున్నా ఆచరణలో అది కష్టమవుతున్నది.

ప్రేమ వివాహంలో వధూవరులు వివాహాత్పూర్వమే ఒకరినొకరు బాగా అర్థం చేసుకొని వుంటారు. వాస్తవమయిన ప్రేమలో పరస్పరాభిమానం, గౌరవం, త్యాగం ఇమిడివుంటాయి. అభిప్రాయభేదాలు తలయెత్తినా, చిన్నచిన్న కలతలు పుట్టినా, పట్టింపులు, పంతాలు ఉద్భవిల్లినా వాటినన్నింటి: వారు సర్దుకుంటారు. కనుక అలాంటి వివాహాలలో అనర్థాలు సంభవించవు. కాకపోతే కామాన్ని, మోహాన్ని ప్రేమ అనుకుని భ్రమపడి ప్రేమ వివాహాన్ని చేసుకున్నవారి దాంపత్య జీవితంలో సాధారణంగా వచ్చే వైఫల్యాలు ఉదయిస్తాయి.

ఆదర్శ వివాహాలు వివాహ విధానంలో మార్పు, పెళ్లి మంత్రాలు లేక ప్రమాణాల భాషలో మార్పు, ఆచారత్వంచేసే వ్యక్తితో తేడా, కుల మతాలను అధిగమించగలగడం, కట్నం లాంఛనాలు అనే అంశాల ప్రసక్తి లేకపోవడం ఆదర్శ వివాహాల లక్షణాలు.

విప్లవ వివాహాలు· వీటిలో వివాహతంతు వుండదు. పెళ్లి ప్రమాణాలు వుండవు. మనస్సు కలిసిన స్త్రీ పురుషుల జంట దాంపత్యజీవితం చేస్తుంది; కుటుంబాన్ని నిర్మించుకుంటుంది విడిపోవడం అనివార్యం అయితే విడిపోతారు అంతే కొందరిదృష్టిలో ఇవి వివాహం అనే పేరుకు నోచుకోవు కాని ప్రేయసిప్రియులు కలిసి సహజీవనం నెరపటానికి, అహ్లాదంగా జీవించటానికి ఈ వివాహాలు తోడ్పడతాయి. ఇందువల్ల వివాహ వ్యవస్థకు పట్టుకున్న రుగ్మతలు నశిస్తాయి.

# మల్లాది సుబ్బమ్మ సాహిత్యం

| | | |
|---|---|---|
| 1. | ఆం. ప్ర. మహిళోద్యమం చరిత్ర (1960-1988) | రూ. 40/- |
| 2. | హైందవం : స్త్రీలు | 25/- |
| 3. | ఇస్లాం : స్త్రీలు | 15/- |
| 4. | క్రైస్తవం : స్త్రీలు | 12/- |
| 5. | సమస్యలు, సంస్కరణలు | 25/- |
| 6. | స్త్రీ విమోచన | 25/- |
| 7. | ఓ మహిళా ముందుకు సాగిపో | 7/- |
| 8. | వనితా లోకం | 12/- |
| 9. | మనం : మన సంస్కృతి | 12/- |
| 10. | బానిసా కాదు, దేవతా కాదు | 10/- |
| 11. | స్త్రీలపై అత్యాచారాలు | 7/- |
| 12. | మత ధర్మ శాసనాలు | 8/- |
| 13. | బంగారు సంకెళ్ళు | 10/- |
| 14. | వివాహం : నేడు, రేపు | 20/- |
| 15. | మహిళా వికాసం | 15/- |
| 16. | వివాహం సంతానం కోసమేనా ? | 10/- |
| 17. | వరకట్న విశ్లేషణ | 10/- |
| 18. | స్త్రీల లైంగికత : లైంగిక స్వేచ్ఛ | 20/- |
| 19. | అశ్లీలం : అసభ్యత | 15/- |
| 20. | వంశాంకురం | 20/- |
| 21. | ప్రేమ + సెక్స్ = నీతి | 17/- |
| 22. | వెలిగిన జ్యోతి | 12/- |
| 23. | కాంతి కిరణాలు | 12/- |
| 24. | చీకటి వెలుగులు | 10/- |
| 25. | ఈ దేశం నాదేనా ? | 5/- |
| 26. | విషాద గాథలు | 16/- |
| 27. | మాతృత్వానికి మరో ముడి | 20/- |
| 28. | స్త్రీ విముక్తి : నూతన సిద్ధాంతం | 6/- |
| 29. | భారతనారీ ఆదర్శం | 10/- |
| 30. | వ్యక్తిగత సమస్యలు : సమాధానాలు | 16/- |
| 31. | పాతివ్రత్యం నుండి ఫెమినిజందాకా | 30/- |
| 32. | ఆధునిక స్త్రీ | 25/- |
| 33. | మారుతున్న సమాజం - మహిళలు | 5/- |
| 34. | తరతరాల స్త్రీల పరాజయ గాథ | 6/- |
| 35. | వైవాహిక కుటుంబ సలహా | 5/- |

9, ఎం.ఐ.జి.హెచ్. కాలనీ, మెహిదీపట్నం, హైదరాబాద్ - 28. ఫోన్ : 35429.